
త్వరలో వస్తుంది!!
శోభనాచల వారి
మహోజ్జ్వలముగా నిర్మించబడిన
మహత్తర జానపద చిత్రము
తిలోత్తమ
అంజలీదేవి.... నాగేశ్వరరావు.... సూర్యప్రభ.... కనకం
డైరెక్టర్... మీర్జాపురం రాజా వారు

# మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

**బాధపడుచున్న యెడల వెంటనే**

పాత్రుడు గారి

# బాల సంజీవిని

**యీయండి**

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళై పిళ్ళై వీధి
తెప్పకొలం.





దోంగ్రేగారి

## బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను, పళ్లు మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు నిలిపి, బలమును, ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4



1951 జనవరి సంచికనుండి

## ఆంధ్రజ్యోతి

సంవత్సర చందా రు. 4-8-0 కు
2 సంవత్సరాలకు రు. 8-0-0 కు
తగ్గింపబడింది
విడిసంచిక మామూలు రు. 0-6-0

చందాదారులకు ప్రత్యేక సంచికలు ఉచితం.

**నేడే చందాదారులుగా చేరండి.**

—: ఆఫీసు :—

పోస్టు బాక్సు 1686., మద్రాసు—1

# మీరు మెక్లీన్స్ తో
# నేడు పళ్లు తోముకున్నారా?



"నేనెప్పుడూ మెక్లీన్సే వాడుతాను. ఎందుచేతనంటే అది నా నోటిని ఎంతో పరిశుభ్రంగానూ, పరిమళభరితంగానూ చేస్తుంది. మీకిప్పుడు కనబడుతున్నట్లుగానే నా పళ్లను బహుచక్కగా సంరక్షిస్తుంది."

అది దుర్వాసనను నివారిస్తుంది.


నోటిని పరిమళభరిత మొనర్చి మీ ఇగుళ్లను సంరక్షిస్తుంది.

పళ్లమీది మరకలను తొలగించి వాటిని ధవళతర మొనర్చుతుంది

అన్ని పన్నుల్నీ చక్కబెట్టే టూత్ పేస్ట్ మెక్లీన్సు ఒక్కటే. అది పళ్లను ముత్యాలవలె మెరిసేటట్టు చేస్తుంది నోటిలోని అమ్లాలను విరిచివేసి, దంత క్షయాన్ని అరికట్టుతుంది; శ్వాసను పరిమళభరిత మొనర్చుతుంది; వాడుటకు ఆహ్లాదకరమైనది.

మెక్లీన్సు పెరాక్సైడ్ టూత్ పేస్టు విశిష్ట సూత్రప్రకారం తయారైనది. దాని పరిపూర్ణ పరిశుభ్రతకు హామీ గలదు.

నేడే మెక్లీన్సు కొనండి!




MTX 3TG

ఫిబ్రవరి 2-వ తేదినుండి ప్రదర్శింపబడుచున్నది



# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక......

సంపుటి 15 ] ఫిబ్రవరి 1951 [ సంచిక 2


## అంజలి

భారత స్వతంత్రసంరంభ కారణమున
ప్రాణముల్ ధారవోసిరీ భరతభూమి
త్యాగులైనట్టి వారినందఱిని భక్తి
సంస్మరింపుడీ పుణ్యవాసరమునందు !

# మన వ్యవహారం

"ఆంధ్రరాష్ట్రనిర్మాణ వ్యవహారాన్ని రాజకీయనాయకులకు వదిలి, ఆంధ్రదేశ ఆర్థికాభివృద్ధికి మహానభ నాయకులు కృషిచేయాలి." అంటూ 25 వ ఆంధ్ర మహానభను ప్రారంభిస్తూ హరేకృష్ణ మహతబ్ ఆంధ్ర ప్రభృతులకు కర్తవ్యాన్ని బోధించారు. అంటే రాష్ట్రసంపాదనలో ఆంధ్రులకు తానేమీ సహాయపడలేనని పరిశ్రమలమంత్రి స్పష్టంచేశారు. ఆంధ్రదేశ ఆర్థికాభివృద్ధిని సాధించడానికి జరిగే ప్రయత్నాలు ఫలప్రదంకావడానికైతే తానేమైనా సహాయపడగలనని చెప్పారు.

మహానభకు అధ్యక్షతవహించిన హరిసర్వోత్తమరావుగారు గానీ, వచ్చినవారందరికీ స్వాగతంచెప్పిన పున్నయ్యశాస్త్రిగారుకానీ మహతాబ్‌గారు మహానభను ఈవిధంగా ప్రారంభిస్తారని కల్లోనైనా అనుకొనిఉండలేదు. కాబట్టే ఉభయులూ తమ దీర్ఘ ప్రసంగాల్లో "రాష్ట్రంకావాలి, రావాలి" అనే ఉద్ఘాటించారుతప్ప రాష్ట్రాన్ని కలవత పెడుతున్న ఇతర సమస్యల జోలికేపోలేదు. రాష్ట్రంవస్తే ఆర్థికాభివృద్ధి దానికదే జరుగుతుందని వీరి విశ్వాసం. రాష్ట్రంలేకపోవడంవల్లనే ఆంధ్రదేశం అన్నివిధాలా వెనుకపడిఉందని ఇంతవరకూజరిగిన ఆందోళనకు ఆయువుపట్టు.

ఆంధ్రమహానభ 37 సంవత్సరాలుగా చేస్తున్న కృషిఫలితంగా ప్రత్యేకరాష్ట్రమూ రాలేదు, ఆంధ్రదేశ ఆర్థికాభివృద్ధీ జరగలేదు. ఇటీవల పరిస్థితులు యింకా విషమించినవికూడా.

వీటన్నింటినీ చక్కచేయాలనే పవిత్రాశయంతో ఉత్తరాయణ పుణ్యకాలంలో ఆంధ్రమహానభ 25 వ వార్షిక సమావేశాన్ని గుంటూరులో ఏర్పాటుచేశారు. విశాలాంధ్రసాధనకు గుంటూరుమహానభ నాయకత్వంవహించాలని ఆహ్వాన సంఘాధ్యక్షుడు జి. వి. పున్నయ్యశాస్త్రిగారు కోరారు. అందుకు ప్రాతిపదికగా ఇప్పటి ద్వాదశ ఆంధ్రజిల్లాలతో ఆంధ్రరాష్ట్రనిర్మాణాన్ని సాగించేందుకు ఆంధ్రులంతా నడుములుబిగించాలని విజ్ఞప్తిచేశారు.

ఇక మహానభకు అధ్యక్షతవహించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఉద్రేకోత్సాహాలతో అధ్యక్షప్రసంగం చేశారు. రాష్ట్ర సంపాదనకు కొన్ని మార్గాలు సూచించారు. వెనకటిలాగానే నాయకత్రయ నివేదికను ఆంధ్రులు నిర్నిబంధంగా అంగీకరించాలి. ఆతరువాత విభజనసంఘంవారు తయారుచేసిన నివేదికను ఆంధ్ర, తమిళప్రతినిధులు జాయింటుగా పరిశీలించి ఉభయులకు

సమ్మతంగాఉండే మార్పులనుచేసి ఆ నివేదికప్రకారం ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయమని కేంద్రప్రభుత్వాన్నికోరాలి. ఇది సాధ్యంగానిపక్షంలో పంచాయతీ పద్ధతిని ఈ విషయాలన్నింటిన్నీ పరిష్కరించుకోవాలి.


ఈలోపున గ్రామగ్రామంనుంచి "రాష్ట్రంకావాలి, రాష్ట్రంకావాల"ని గ్రామస్థు లందరూ సంతకాలు, నిశానీలుచేసి రిపబ్లిక్‌ప్రభుత్వానికీ, ప్రెసిడెంటుకూ మహజర్లు పంపించాలి. అధ్యక్షుడు చేసిన ఈసూచనలను అక్షరాలా అమలుజరిపేవారుంటే చాలు, అమలుజరక్కముందే రాష్ట్రంవస్తుంది.

అధ్యక్షుడి ఈ సూచనలను మించిఉంది మహాసభతీర్మానం. ఇన్నిచేసినా ఆంధ్ర రాష్ట్రం రాకపోతే శాసనసభల్లోని ఆంధ్రసభ్యులు మూడుమాసాలపాటు తెనుగులో మాట్లాడాలనీ, అందువల్లా లాభంలేకపోతే వారంతా తమ సభ్యత్వాలకు రాజీనామా ఇవ్వాలనీ గుంటూరుసభ కోరింది.

తెనుగులో మాట్లాడినందువల్ల ఎవరికీ ఏమీ నష్టంలేదు. ఇతరులకు తెలిసేటట్లు మాట్లాడితేనే అంతంతమాత్రంగాఉంది. ఎవరికీ అర్థంగానిభాషలో మాట్లాడితే పర్యవసానం ఎలాఉంటుందో చెప్పక్కర్లేదు. రాజీనామా అంటూవస్తే, ఇప్పుడున్న వార్లో రాజీనామా ఇచ్చేవాళ్లెవ్వరూలేరు. ఇచ్చినా మంత్రాలకు చింతకాయలు రాల్తయ్యా?

కర్నాటకులు ఆవిధంగా చేయకలిగారంటే కర్నాటక ఏకీకరణ సంఘానికి, కర్నాటక కాంగ్రెస్ సంఘానికి అత్యంతసన్నిహిత సంబంధంఉంది. అలాగే మహా రాష్ట్రంలోనూ. మన ఆంధ్ర కాంగ్రెస్‌దారి ఆంధ్ర కాంగ్రెస్‌దే, ఆంధ్ర మహా సభదారి ఆంధ్రమహాసభదే. ఆంధ్రకాంగ్రెస్ నాయకులంతా సందేశాలుపంపడం తోనే తృప్తిపడ్డారు. ఆ చాయలకే పోలేదు. ఇక మహాసభతీర్మానాలకు విలువ ఏముంటుంది?

రాష్ట్రనిర్మాణ బాధ్యతనూ రాష్ట్రకాంగ్రెస్ సంఘంవహిస్తే తప్ప ఆంధ్రరాష్ట్రం ఎప్పటికీ ఏర్పడదు. రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎవరు ఎన్నికైతే వారు స్వయంగా ఈ ఉద్యమాన్ని నిర్వహించాలి. అందరు కలిసి గట్టిగాపనిచేస్తే 1952 కు రాష్ట్రం రావచ్చు.



# రిపబ్లిక్
## (పర్యావలోకన)

భారత రిపబ్లిక్ అవతరించి సంవత్సరం అయింది. ఈ పన్నెండుమాసాల్లోనూ మన పరిస్థితీ, ప్రపంచపరిస్థితీ దాదాపు ఒకేవిధంగా ఉంది. ఈరోజుల్లో భిన్నంగాఉంటానికి వీల్లేదు కూడా.

పండిట్ నెహ్రూ ప్రభుత్వం దేశసర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి ప్రయత్నాలు మాత్రం అనేకంగాచేసింది. సమకూరినఫలితాలు చేసినప్రయత్నాలకు తగ్గట్టుగాలేవు. ప్రజా సామాన్యానికి ప్రధానం ఫలితాలుకాని ప్రయత్నాలుకాదు. గాంధిమహాత్ముని సిద్ధాంతమే తారక మంత్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వానికి ఫలితాలుగాక ప్రయత్నాలే సర్వత్రా, సర్వదా ప్రధానం కావడంలో ఆశ్చర్యంఏమీలేదు. లక్ష్యంకంటే లక్ష్యసిద్ధిపొందడానికి అనుసరించే మార్గాలు, ఉపయోగించేసాధనలు ముఖ్యంఅన్నాడు గాంధిజీ. మననాయకులూ మనకు అదేచెప్తున్నారు. పరిపాలనా నిర్వహణలోనూ అదేసూత్రాన్ని అనుసరించి, ఫలితాలమీదకంటే ప్రయత్నాల మీదనే ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించి, చివరికి ప్రయత్నాలే ఫలితాలని భ్రమించడంకూడా జరుగుతున్నది.

సరిగ్గా 20 సంవత్సరాలక్రితం జనవరి 26 వ తారీఖున భారతప్రజానీకం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ప్రమాణంతీసుకుంది. ఈ ఇరవైసంవత్సరాల్లోనూ భారత జాతీయకాంగ్రెస్ అధ్వర్యాన, గాంధిమహాత్ముని నాయకత్వాన స్వాతంత్ర్యసంపాదనకు పోరాటాలుసాగినవి. 1946 సెప్టెంబరులో భారత రాజప్రతినిధి కార్యవర్గానికి మంత్రివర్గ హోదా లభించడం, పండిట్ నెహ్రూ మొదటి ప్రధానమంత్రికావడం జరిగింది. అంటే పండిట్ నెహ్రూ కేంద్రప్రభుత్వంపై ఆధిపత్యం వహించి నాలుగేళ్ళకుపైగా అయింది.

ఈ నాలుగుసంవత్సరాల్లోనూ దేశంలో రాజకీయంగా చాలా ముఖ్యమైన మార్పులు వచ్చాయి. ఐక్యభారతదేశంలోని ముస్లింప్రాంతాలుపోయి పాకిస్తాన్ ఏర్పడినా మిగతాదేశం అంతా ముందు రాజకీయంగా, తరవాత ఆర్థికంగా ఏకఖండంగా రూపొందింది. సంస్థానాలన్నీ భారతసమాఖ్యలో సమైక్యమైనవి. ఒక్కహైద్రాబాద్ సంస్థానానికితప్ప మరే ఇతర సంస్థానానికీ స్వతంత్ర ద్రవ్యవిధానంగానీ, ఆర్థికవిధానంగానీ లేదు. ఈ సంవత్సరం నైజాం హాలీలు క్రమంగా చలామణిలోనుంచిపోయి సంస్థాన ఆర్థిక వ్యవస్థ పూర్తిగా భారత దేశార్థిక వ్యవస్థలో లీనమైపోవచ్చు. ఈ మహాకార్యాలనన్నింటినీ సాధించిన అభినవయుగంధరులు

సర్దార్ పటేల్ రిపబ్లిక్ ప్రథమ వార్షికోత్సవాలు సమీపిస్తూన్న సమయంలో వెళ్ళిపోయారు. మంత్రిగా ఉండి మహారాజులాగా దేశాన్ని పాలించిన సర్దార్ పటేల్ ధన్యులు.

స్వాతంత్ర్యం వచ్చిన మొదటి సంవత్సరంలో భారతజాతి జాతిజనకుని కోల్పోయింది. రిపబ్లిక్ అవతరించిన ప్రథమ సంవత్సరంలో సమైక్య, స్వతంత్ర భారత సృష్టికర్త సర్దార్ పటేల్‌ను కోల్పోయింది. మొదటిసంవత్సరంలోనే అస్సాంరాష్ట్రం భూకంపాలకూ, వరదలకూ గురియై విపరీతంగా నష్టపోయింది. అప్పటికే ప్రమాదకరంగాఉన్న మన ఆహారపరిస్థితి అస్సాంలో పంటలుపోవడంతో విషమించింది. దక్షిణాదిన వర్షాలులేక పైర్లు చాలాభాగం పోయినవి. తెనుగుజిల్లాల్లో మెట్టపైర్లుకూడా ఎక్కువగా దెబ్బతిన్నవి. వీటన్నింటివల్లా మన ఆహారసమస్య నాలుగుసంవత్సరాలనాడు ఎలాఉందో నేడూ అలాగే ఉంది.

అయితే ఈ సంవత్సరకాలంలో భారతదేశం ఏరంగంలోనూ పురోగమించలేదా అన్న ప్రశ్న ఏర్పడుతుంది.

1950 జనవరి 26 న భారత రిపబ్లిక్ అవతరించింది. తరువాత రెండురోజులకు సుప్రీం కోర్టు స్థాపన జరిగింది. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యతలను రాష్ట్రన్యాయస్థానాలూ, ప్రధాన న్యాయస్థానంకూడా స్వాతంత్ర్యప్రియుల మన్న నలపొందేవిధంగా నిర్వహించినవి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీపై విధించిన ఆంక్ష చట్టబద్ధంకాదని పశ్చిమ బెంగాల్ హైకోర్టు తీర్పుఇచ్చింది. అలాగే మద్రాసు హైకోర్టు కులనిష్పత్తి ఉత్తరువు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు భంగకరంఅని తీర్పుఇచ్చింది. బొంబాయి హైకోర్టు ఆ రాష్ట్ర మద్యనిషేధచట్టం దేశీయుల, విదేశీయుల మధ్య విచక్షణచూపుకున్నదనే కారణాన ఆ చట్టం అశాస్త్రీయమని తీర్పుఇచ్చింది. ఈవిధంగా మన న్యాయస్థానాలు రాజ్యాంగం సక్రమంగా అమలుజరిగేటట్లు చూస్తున్న సందర్భాలు అనేకం ఉన్నవి. ప్రభుత్వాలుకూడా ఇంతవరకూ న్యాయస్థానాలతీర్పుల్ని పాలిస్తూనే ఉంటున్నవి.

పోయిన సంవత్సరంలో ఆర్థిక, పారిశ్రామిక, సాంఘిక రంగాల్లో మన ప్రభుత్వాలు సాధించిన విశేషాలు అంతగా లేవు. పారిశ్రామిక వస్తూత్పత్తిలో పెరుగుదల ఏమీలేదు. సిమెంటు, ఉక్కుపరిశ్రమల్లోమాత్రం కొంచెం అభివృద్ధి కన్పిస్తుంది. ప్రధానమైన వస్త్రపరిశ్రమలో ఉత్పత్తి చాలాతగ్గిపోయింది. చేనేత పారిశ్రామికుల్లో నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. తమ పరిస్థితి ఎంత అధ్వాన్నంగావుందో అధికారులకు తెలుపుకునేందుకు ఆకలియాత్రలుకూడా జరిపారు. వస్త్రపరిశ్రమలో ఏర్పడిన ఈ విషమపరిస్థితులకు కారణం ముఖ్యంగా ప్రత్తికొరత; లభించిన ప్రత్తి విపరీత ధర. ప్రత్తి లేకపోవడంవల్ల బొంబయిరాష్ట్రంలో కొన్ని మిల్లులు మూసివేయటం, మరికొన్ని మిల్లుల్లో పని వేళలు తగ్గించివేయడం జరిగింది. ప్రత్తి కొరతకు కారణం పాకిస్తాన్‌తో ఏర్పడ్డ వ్యాపార ప్రతిష్టంభన. ఈ ప్రతిష్టంభనవల్ల జనపనార పరిశ్రమకూడా దెబ్బతినిపోయింది. ఆహార ధాన్యాలతోపాటు ప్రత్తి, జనపనారలవిషయంలోకూడా భారతదేశం స్వయంసమృద్ధిని సాధిం

చాల్సిఉంటుంది. ఇందుకే భారతప్రభుత్వం ఎక్కువగా బహుళ ప్రయోజనకరమైన ప్రాజెక్టుల నిర్మాణంమీద ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తున్నది. ఇందులో ముఖ్యమైనవి దామోదర లోయ, మహానదీ ప్రాజెక్టులు. దామోదర లోయ ప్రాజెక్టును అమెరికాలోని టెనెస్సీ లోయ ప్రాజెక్టుమాదిరి బ్రహ్మాండమైన సంస్థగా తయారుచేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఈ ప్రాజెక్టువిషయంలో అయినా ఇంతవరకు తృప్తికరమైనపని జరగలేదు.

ప్రభుత్వం ప్రారంభించిన నిర్మాణాత్మక కార్యక్రమాలన్నీ దాదాపు ఇదేస్థితిలో ఉన్నవి. పోతఇళ్ళ ఫాక్టరీని ఏర్పాటుచేస్తే అదంతా శుష్కదండగని విచారణసంఘం తీర్మానించింది. సింద్రీఎరువులఫ్యాక్టరీ వ్యవహారంఅయినా ఇంతకంటే తృప్తికరంగా లేదు. ఇక చెన్నరాష్ట్రంలో ప్రాజెక్టులగతి జగద్విదితం.

రామపాదసాగర్ ప్రాజెక్టుకు డబ్బులేదంటూ దిగువభవానీప్రాజెక్టు ప్రారంభించారు. ప్రారంభించాలనే సంకల్పశుద్ధి లేకపోయినా తెనుగువారి కళ్ళనీళ్ళు తుడవడానికి ఎన్నోప్రాజెక్టుల పరిశీలనా, విచారణలకింద ఎంతో ఖర్చు చేస్తున్నారు. మాచ్‌ఖండ్‌ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి అవుతుందా అనే ఇంకా ఎదురుచూస్తూఉండాల్సివచ్చింది. ఈలోపున విశాఖపట్నంలోని సింధియా నౌకానిర్మాణశాలకూడా మూలపడేస్థితి వచ్చింది. ఎప్పటికప్పుడు ప్రభుత్వం ప్రాణం పోస్తూ ఇంతవరకూ నిలబెట్టింది. ఇకముందు ఏంచేస్తుందో చూడాల్సిఉంది.

రాష్ట్రప్రభుత్వం రాయలసీమలో వనస్పతి, నూలుమిల్లుల స్థాపనకు ఎంతో సహాయం చేసింది. బిర్లాకంపెనీ కర్నూల్‌లో స్థాపించిన వనస్పతి ఫాక్టరీలో పనిసాగుతూఉంది. ప్రభుత్వ సహాయం పొందిన పరిశ్రమల్లోపనే ప్రారంభం కాలేదని చెప్పవచ్చు. అయితే పరిశ్రమలను స్థాపించాలనే ఉత్సాహంమాత్రం పూర్వంకంటే ఇప్పుడు ఎక్కువగా కన్పిస్తున్నది. సంక్రాంతినాడు గుంటూర్లో జగిరిన ఆంధ్రమహాసభకు ప్రారంభోత్సవంచేస్తూ కేంద్ర పరిశ్రమలమంత్రి హరేకృష్ణ మహతబ్ ఆంధ్రదేశపారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయగలదని హామీకూడా ఇచ్చారు.

ఏమైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రధానంగా వస్త్ర, ఆహారకొరత తీర్చడానికి ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నాలు ఫలప్రదం కావడానికి దేశంలో శాంతిభద్రతలు ఏర్పడాలి. ప్రపంచయుద్ధం నివార్యం కావాలి. భారతప్రధానమంత్రి ఇందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు. పోయినఏప్రిల్‌లో పాకిస్తాన్ ప్రధానమంత్రితో చేసుకున్న ఒడంబడిక ఈదృష్ట్యా చాలా ప్రధానమైంది. యుద్ధం, తరవాత దేశవిభజనవల్ల మన ఆర్థికవ్యవస్థ పూర్తిగా తారుమారైంది. అనంతరం తూర్పుబెంగాల్, పశ్చిమబెంగాల్‌నుండి వచ్చిన లక్షలాది శరణార్థులపునరావాసం, ఇంతలో కాశ్మీరుయుద్ధం మన ఆర్థికవ్యవస్థను దాదాపు శిథిలంచేసినవి. శరణార్థులసమస్య ప్రధానంగా ఆర్థిక, సాంఘిక సమస్య. రాజకీయసమస్యగా చేయడంవల్ల అసలు సమస్యాపరిష్కారం కొంచెం క్లిష్టమైంది. భారతప్రభుత్వం, కొందరు రాష్ట్ర ప్రభుత్వాలు కాందిశీకులపునరావాసం విషయంలో గణనీయమైనపనినే సాధించారు. అయినా ఆ సమస్య ఒక్కరోజులో పరిష్కారమయ్యేదికాదు.

శ్రేయోరాజ్యస్థాపనే లక్ష్యంగాగల నెహ్రూప్రభుత్వం ఈవిషయంలో బాధ్యతను ఏపరిస్థితుల్లోనూ వదులుకోలేదు. కార్మికజనాభివృద్ధికి భారతకార్మికశాఖ ఎన్నో శాసనాలను తయారుచేసింది. కేవలం శాసనాలనుబట్టి కార్మికజనశ్రేయస్సును ఎంచడంవస్తే పాశ్చాత్యదేశాల కార్మికులస్థితికంటే భారతకార్మికులస్థితి అంత అధ్వానంకాదు. కాని పార్లమెంటుచేసిన శాసనాలను అమలుజరపగలవారే కన్పించడంలేదు. ఆబాధ్యత రాష్ట్రప్రభుత్వాలది. అలాగే ప్రజారోగ్యంవిషయంలోనూ పరిశోధనలు చాలాజరిగినవి. ఎన్నో నివేదికలు తయారైనవి. అయినా పరిస్థితులు పూర్వంలాగానేఉన్నాయ్. వీటన్నింటికీ కారణం కార్యాచరణశక్తి పూర్తిగా లోపించడమే!

భారతప్రభుత్వం చెప్పుకోతగ్గ ఘనకార్యాలు ఏవైనాసాధిస్తే అవి విదేశాంగవిధానానికి సంబంధించినవే. కొన్నిలాభాలూ, కొన్నినష్టాలూకూడా మనకు ప్రాప్తించినవి. లాభాలు మాత్రం ప్రస్తుతం అక్కరకువచ్చేవిగా కన్పించడంలేదు. కొంచెం ఉపయోగానికివచ్చేదల్లా కామన్వెల్తురాజ్యాలు ఆగ్నేయ, దక్షిణఆసియా అభివృద్ధికి తయారుచేసిన కొలంబోపథకం. దీనిక్రింద భారతదేశానికి సాంకేతికప్రవీణుల సహాయంతోపాటు కొంత ఆర్థికసహాయంకూడా లభిస్తుంది. ఇదిగాక ట్రూమన్ ప్రతిపాదించిన చతుర్థసూత్రప్రణాళికక్రింద అమెరికా భారత దేశాలకుజరిగిన ఒడంబడికవల్లకూడా కొంత సాంకేతికసహాయం లభించవచ్చు.

అయితే ఈ లాభాలన్నింటినీ మరిపించే నష్టంకూడా ఒకటుంది. భారతదేశంలో ఏర్పడ్డ ఆహారలోటును తీర్చుకునేందుకు పండిట్ నెహ్రూ అమెరికాను 20 లక్షల టన్నుల గోధుమను అప్పుగా ఇవ్వమని కోరాడు. కొరియా యుద్ధవిరమణ విషయంలోనూ, చైనాను దురాక్రమణదారుగా ప్రకటించే విషయంలోనూ భారతప్రభుత్వం అమెరికా చెప్పినట్లుచేయలేదని ఈ గోధుమను సప్లయిచేయడం మానివేసేటట్లు కన్పిస్తుంది. ఇందువల్ల తాత్కాలికావస్థకు భారతదేశం గురి అయినా దూరప్రాచ్యదేశాల్లో అమెరికాపై అభిమానం తగ్గిపోవచ్చు. బర్మా, చైనాలు బియ్యాన్ని, రష్యా గోధుమనూ సప్లయిచేయడానికి సమ్మతించినవి.

పోతే నెహ్రూ విధానం టిబెట్‌లో విఫలమైనా నేపాల్‌లో ఫలప్రదమైంది. రాణాల నిరంకుశత్వాన్ని తటుకోలేక త్రిభువనవీర విక్రమసింగ్ మహారాజు రాజ్యంవదలి వచ్చివేశారు. ఇదే సమయంఅని నేపాలీ కాంగ్రెస్‌వాదులు సంస్థానంలో సాయుధవిప్లవం సాగించారు. భారతప్రభుత్వం మొదట్నుంచీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యంఇవ్వమని భవిష్యద్రాజ్యాంగవిధానాన్ని తయారుచేసేందుకు ప్రజాపరిషత్తును ఏర్పాటుచేయమనీ సలహా ఇస్తూనేఉంది. అయితే ప్రధానమంత్రి మోహన్ షంషర్‌జంగ్ బహాదూర్ రాణా న్యూఢిల్లీ వచ్చి భారత నేపాల్ మిత్రత్వ ఒడంబడికపై సంప్రదింపులు జరిపిన సందర్భంలో ఇందుకు సమ్మతించినా చివరికి అంతా ముంచుకొచ్చేవరకూ ఏమీచేయలేదు. మొదట ఎలాజరిగినా చివరికి నేపాల్ ప్రధానమంత్రి రాజ్యాంగపరిషత్తును ఏర్పాటుచేయడానికి ఇప్పటి మంత్రివర్గాన్ని

విస్తృతంచేసి ప్రజాప్రతినిధులకు తమతోబాటు సమప్రాతినిధ్యం ఇవ్వడానికి సమ్మతించారు. త్రిభువనవీర విక్రమసింగ్‌నే తిరిగి మహారాజుగా స్వీకరించడానికికూడా సమ్మతించారు.

టిబెట్ వ్యవహారంకూడా ఇలాగే పరిష్కారం అయ్యేసూచనలు కన్పిస్తున్నవి. దలైలామా రాజధాని లాసాను వదలివచ్చివేశారు. అయినా పెకింగ్‌ప్రభుత్వం టిబెట్ తూర్పుభాగంనుంచి తనసేనలను ఉపసంహరించుకొని రాజీసంప్రతింపులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. ఇది ఫలిస్తే భారతదేశ సరిహద్దు సమస్యలు చాలాభాగం పరిష్కారమైనట్లే.

ఇక కాశ్మీరు సంస్థానవిభజనే ఈ సమస్యాపరిష్కారానికి మార్గమని సమితిమధ్యవర్తి సర్ ఓవెన్‌డిక్సన్ స్పష్టంచేశారు. అందుకు పాకిస్తాన్, భారతదేశాలు సమ్మతించినవి. దీన్ని అమలుచేయించాలని జనవరి ప్రారంభంలో లండన్లో జరిగిన కామన్వెల్తు ప్రధానమంత్రులసభలో పాకిస్తాన్ ప్రధానమంత్రి విశ్వప్రయత్నాలు చేశారు. అయితే భారతప్రభుత్వం పాకిస్తాన్ షరతులపైగాక తన షరతులపై రాజీకి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. కాశ్మీరు సమస్యకూడా శాంతియుతంగా పరిష్కారమై పోతే భారతప్రభుత్వం నిర్మాణాత్మకకార్యక్రమాలపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించకలుగుతుంది. వచ్చేఎన్నికలుకూడా సరియైన వాతావరణంలో జరగడానికి వీలుంటుంది.

ఈసంవత్సరంలో చెప్పుకోతగ్గ మరికొన్ని సంఘటనలు పండిట్ నెహ్రూ ఇండోనీషియా పర్యటన. ఆ పర్యటన సందర్భంలోనే భారతప్రధాని మలయా, బర్మాలనుకూడా సందర్శించి వచ్చారు. ఇండోనీషియా ఇండియా మిత్రత్వఒడంబడిక త్వరలోనే సంతకంకాబోతుందనే వార్తనుబట్టి పండిట్ నెహ్రూ పర్యటన ఫలప్రదమైందని చెప్పవచ్చు.

దేశంలో అనేక ముఖ్యమైన అంతర్జాతీయ సమావేశాలు జరిగాయి. ఈ నెల్లో చెన్నపట్నంలోనే పసిఫిక్‌ప్రాంత మత్స్యపరిశ్రమసభ జరుగుతున్నది.

ప్రభుత్వ కలాపాలు ఇలాఉంటే కాంగ్రెస్ వ్యవహారాలు ఈమాత్రంగాకూడా లేవు. నాశిక్ కాంగ్రెస్ మహాసభకు పురుషోత్తమదాస్ టాండన్ అధ్యక్షుడుగా ఎన్నిక కావడంతో అనేక ముఠాలు బయల్దేరినయ్. మనరాష్ట్రంలో కాంగ్రెస్ సంఘంఅంటూ లేకుండా పోయింది.

వచ్చే నవంబర్లో ఎన్నికలు జరగడమే ఖాయమైతే కాంగ్రెస్‌వాదులు ఇప్పటి స్వార్థచింతననూ, వ్యక్తిగత ద్వేషాలనూ విసర్జించి దేశసమస్యల పరిష్కారానికి సమైక్య కృషి జరపవలసి వుంటుంది. అహమ్మదాబాద్‌లో జనవరి మాసాంతాన జరిగిన అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ ఇందుకు ప్రాతిపదికను తయారుచేడం శుభసూచకం. ఒక్కవిషయాన్నిమాత్రం మనం గుర్తించాలి; 1950 కంటే 1951 చాలా క్లిష్టంగా ఉండబోతున్నదేమోనని.



# కల్లోల ప్రపంచం



ప్రపంచాధిపత్యాన్ని గురించి కలలుగన్నవారు అన్ని దేశాలలోను—అన్ని కాలాలలోను— చాలామంది పుట్టారు. ప్రపంచాధిపత్యాన్ని చాటుకోడానికి ఉద్దేశించబడిందే అశ్వమేధ యాగం. ఈ యాగాన్ని చేసినా, చేయకపోయినా, తాము పరిపాలిస్తున్నది ఒక పరగణా మాత్రమే అయినా, "భూమండలేశ్వరా! బహుపరాక్!" అని భట్రాజులచేత పొగడ్తలు చేయించుకుని, ప్రపంచాధిపత్యం తమకు దక్కినట్టే సంతృప్తిపడినవారుకూడా వున్నారు. మరి జయించడానికి ప్రపంచాలు లేకపోయినవని అలెగ్జాండర్ నిట్టూర్చినాడని అంటారుగాని, ఇది నిజంకాదేమో! సింధునదీతీరం ప్రపంచానికి తూర్పుఅంచుగా అతడు భావించివుండడు. అప్పటికి అమెరికా, ఆస్ట్రేలియాల ఉనికి తెలియకపోయినా, ఆఫ్రికాఖండం సంగతి పూర్తిగా తెలియకపోయినా, సింధునదికి తూర్పున ఇంకా కొంతప్రపంచం వున్నదని అలెగ్జాండర్‌కు తెలుసు. దాన్నికూడా జయించిన పిమ్మటనే అతడు స్వదేశానికి తిరిగివెళ్ళాలని అనుకున్నాడు. అయితే, అప్పటికే ఎన్నోయుద్ధాలలో పోరాడి అలసివున్న అతడిసైనికులు ఇక ముందుకు ఒక్క అడుగైనా పెట్టమన్నారు. అందువల్లనే తనకు యిష్టంలేకపోయినా, అలెగ్జాండర్ యింటిదారి పట్టవలసివచ్చింది. అయితే, అతడు యింటికితిరిగి చేరుకోనేలేదు. దారిలోనే ఏదో జబ్బుచేసి చనిపోయాడు.

అలెగ్జాండర్ తర్వాత ప్రపంచాధిపత్యానికి ప్రయత్నంచేసినవారిలో ముఖ్యంగా యెన్నదగువారు జెంఘిస్‌ఖాన్, నెపోలియన్, కెయిజర్, హిట్లర్. జపాన్‌వారిలో ఒక వ్యక్తిని వేలెత్తి చూపి, "ఇతడు ప్రపంచాధిపత్యానికి కృషిచేశాడు" అని చెప్పడం కష్టంకాని, మొత్తంపై జపాన్‌జాతికూడా ఈ దురాశకుపోయింది. జపాన్‌ను దాదాపు అర్ధశతాబ్దంపాటు పీడించిన ఈ దురాశాసాఫల్యానికి ఒక ప్రణాళిక ("బ్లూప్రింట్")ను స్థిరపరచినవాడు తణకా. ప్రపంచాధిపత్యాన్ని సాధించాలంటే అనుసరించవలసిన క్రమాన్నిగురించి ఒకానొక సందర్భంలో తణకా చెప్పిన క్రమమిది: ప్రపంచాన్ని జయించాలంటే ముందుగా ఆసియాను జయించాలి; ఆసియాను జయించాలంటే ముందుగా చైనాను జయించాలి; చైనాను జయించాలంటే ముందుగా మంచూరియా, మంగోలియాలను జయించాలి; మంచూరియా, మంగోలియాలను జయించాలంటే ముందుగా కొరియా, ఫార్మోజాలను జయించాలి. ప్రపంచాధిపత్యసాధనయత్నంలో జపాను ఈ క్రమాన్నే అనుసరించింది. 1895 లో అది కొరియా, ఫార్మోజాలపై

దండెత్తింది. 1931 లో మంచూరియా, మంగోలియాల సమేతంగా మొత్తం ఉత్తరచైనాను అది కబళించివేసింది. 1937 లో మొత్తం చైనాను స్వాహాచెయ్యడానికి దానిపై యుద్ధాన్ని ప్రారంభించింది. 1941 లో ఆసియాఖండాన్నే కైవసం చేసుకోడానికి పెద్దప్రయత్నాన్ని ప్రారంభించి, దానిలో పూర్తిగా కాకపోయినా, చాలావరకు తాత్కాలికంగా నెగ్గింది. అయితే, చివరికి దురాశ దానికి దుఃఖంచేటుగా ఏవిధంగా పరిణమించిందో అందరికీ తెలిసిన విషయమే.

జపాన్ అమలుపరచడానికి ప్రయత్నించిన ఈ తణకా ప్రణాళికసంగతి చైనాకు తెలుసు. ఆ ప్రణాళిక తాకిడి ఎక్కువగా తనకే తగిలినందున దానిసంగతి చైనాకు తెలిసినంతగా మరొకదేశానికి తెలియదుకూడా. ఇందువల్లనే చైనా ఈనాడు యునైటెడ్‌స్టేట్సు ప్రపంచాధిపత్యానికి ప్రయత్నిస్తున్నట్టు పూర్తిగా అనుమానిస్తున్నది; కాదు, గట్టిగా నమ్ముతున్నది.

నిప్పుతో ఒకసారి చేతులుకాల్చుకున్న పిల్లవాడికి నిప్పుపేరుచెబితేనే భయంవేస్తుంది. జాగ్రత్తగావుంటే నిప్పువల్ల వచ్చేప్రమాదంలేదని అతడికి ఎంతచెప్పినా నిష్ప్రయోజనమే. ఇదేవిధంగా ఈనాడు చైనాభయం నిరాధారమైందని దానికి ఎందరుచెప్పినా లాభంలేదు. యునైటెడ్‌స్టేట్స్ ఇటీవలగైకొన్న అనేక చర్యలు తణకాప్రణాళికకు కేవలం నకలువలె వున్నాయని విస్పాక్షికులందరు అంగీకరించాలి. జపాన్‌ను జయించిన యునైటెడ్‌స్టేట్సు, యుద్ధం ముగిసి—ఇంచుమించు అయిదేళ్లుకావస్తున్నా, ఇంకా అక్కడే తిష్ఠవేస్తున్నది కాని, ఏదో ఒక సంధిచేసుకుని, అక్కడినుంచి కదిలేసూచనలను చూపించడంలేదు. జపాన్‌తో శాంతిసంధి ప్రస్తావనలు జరుగుతున్నా, ఆ దేశంలో అమెరికాకు యుద్ధస్థావరాలు కొన్ని వుండాలన్నపట్టుదల చూపబడుతున్నది. పైగా, ప్రస్తుతం చైనాను పరిపాలిస్తున్న రాజకీయ పక్షానికి వ్యతిరేకంగా అక్కడి అంతర్యుద్ధంలో మార్షల్ చాంగ్‌కై-షేక్ పక్షానికి యునైటెడ్ స్టేట్సు అంతులేని సహాయాన్ని చేసింది. మార్షల్ చాంగ్ పరాజయాన్ని చెంది, ఫార్మోజాకు పారిపోయినపిదపకూడా, కొత్తచైనా ప్రభుత్వాన్ని అది గుర్తించలేదు సరిగదా, ఇతర దేశాలు దాన్ని గుర్తించకుండా అడ్డుపడుతూవచ్చింది. సోవియెట్‌రష్యా, దాని పలుకుబడిలో గల తూర్పు యూరోపియన్ రాజ్యాలు, ఇండియా, ఇండొనీసియా, పాకిస్థాన్, సింహళం, గ్రేట్‌బ్రిటన్ వగైరాలు చైనా కొత్తప్రభుత్వాన్ని (* పీకింగ్‌ప్రభుత్వాన్ని) గుర్తించిన పిమ్మట కూడా, మిత్రరాజ్యసమితిలో తనకుగల మెజారిటీని పురస్కరించుకుని, యునైటెడ్‌స్టేట్సు ఆ సంస్థలో కొత్తచైనాకు ప్రాతినిధ్యంలేకుండాచేసింది. ఈలోపున దక్షిణకొరియానుంచి అమెరికన్‌సేనల ఉపసంహరణజరిగినా, వాషింగ్టన్ ఆశీర్వాదంతో మిత్రరాజ్యసమితి తెరచాటుగా అక్కడ అమెరికా కనుసన్నలమెలిగే సింగ్మన్‌రీ ప్రభుత్వం స్థాపించబడింది. ఈచర్యలలో ఏ ఒక్కటైనా యునైటెడ్‌స్టేట్స్ ఉద్దేశాలను కొత్తచైనా శంకించడానికి

---

* నిజానికి దాన్ని "పీకింగ్‌ప్రభుత్వం" అనాలి. ఈమాట తెలుగువారి చెవికి కటువుగా వుంటుందనే, తప్పుడుచ్చారణ అని తెలిసికూడా "పెకింగ్ ప్రభుత్వం" అని అంటున్నాము.

సరిపోతుంది. కాని, ఇవిచాలవన్నట్టు, మొత్తం కొరియాను సింగ్మన్‌రీ ఆధిపత్యం కిందికి తీసుకురావడానికి చాటుమాటుగా అమెరికా ప్రయత్నంచేసింది. అతడికి అది ధనసహాయాన్ని చేసింది; ఆయుధసహాయాన్ని చేసింది; అతడిసైన్యాలకు శిక్షణనివ్వడానికి, అతడికి సలహాలు చెప్పడానికి తన సైనికోద్యోగులను నియోగించింది. సింగ్మన్‌రీని టోకియోకు పిలిపించడం, అతడితో అమెరికన్ మంత్రులు, సైన్యాధ్యక్షులు, రహస్యమంతనాలు జరపడం కూడా సంభవించింది. ఈ మంతనాలతర్వాత ఒక అమెరికన్ ప్రముఖుడు—జాన్ ఫాస్టర్ డల్స్—దక్షిణకొరియా రాజధాని సోల్‌కువెళ్ళి, సింగ్మన్‌రీ చెవిని కొరికివచ్చాడుకూడా.


దక్షిణకొరియాపై ప్రెసిడెంట్‌తో అమెరికన్ ప్రముఖులు సంభాషిస్తున్నంత మాత్రంచేతనే పెకింగ్ తనపుట్టి మునగనున్నదని అనుమానించడం తనపీడనుచూచి తానే భయంచెందడం క్రింద కొట్టివెయ్యలేము. ఈ మంతనాలకు కొంచెం ముందుగానే (చైనీస్, ఉత్తరకొరియన్ ప్రభుత్వాల కథనం ప్రకారం) సింగ్మన్‌రీ బలాలు ప్రతిపక్ష బలాబలాలను పట్టిచూడ్డాన్ని ప్రారంభించాయి. 1949 జనవరికి, 1950 ఏప్రిల్‌కు మధ్యకాలంలో సింగ్మన్‌రీ సైనికులు 1,274 సార్లు ఉత్తరకొరియా సరిహద్దులపై దొంగపాటు ముట్టడులు జరిపారు. అతడి నౌకలు 38 వ అక్షాంశరేఖను 42 సార్లు దాటి (ఈ రేఖ ఉత్తర, దక్షిణకొరియాలకు సరిహద్దు) దానికి ఉత్తరంగాగల ప్రాంతాలపై ఫిరంగులను కాల్చాయి. అతడి విమానాలు యిదేవిధంగా 71 సార్లు ముట్టడులు జరిపాయి. ఈ విషయాలన్నీ నిజమైతే (ఇవినిజమైనవనే ఉత్తరకొరియాతో పాటు చైనా వాదం) మొత్తం కొరియాపైనే, సింగ్మరీని కీలుబొమ్మగా అడ్డంబెట్టుకుని, అమెరికా తనప్రాబల్యాన్ని సాధించడానికి పూనికచూపుతున్నట్టు పెకింగ్ అనుమానించడంలో తప్పులేదుగదా?

1950 జూన్ 25 వ తేదీని ఉత్తర, దక్షిణ కొరియాలమధ్య బాహాటంగా పొసగిన యుద్ధాన్ని ఏపక్షం ప్రారంభించిందో మనకు స్పష్టంగా తెలియదు. సింగ్మన్‌రీ పక్షమే దాన్ని ప్రారంభించినట్టు ఉత్తరకొరియా నిందిస్తున్నది. ఈ నిందను చైనా సమర్థిస్తున్నది. కాని, యుద్ధం ప్రారంభమైనవెంటనే ఉత్తరకొరియా సాధించిన ఘనవిజయాలను చూస్తేమాత్రం సింగ్మన్‌రీపక్షమే ముందుగా పోరుకు తలపడిందని నమ్మడం కష్టం. సంఘర్షణకు ఉభయ పక్షాలు సన్నద్ధపడుతున్నసమయంలో మరి ఆలస్యంచేస్తే తనకు సదవకాశం మించిపోగల దని ఉత్తరకొరియా యుద్ధానికి ఉపక్రమించినట్టు భావించడమే ఎక్కువ సమంజసంగా తోస్తుంది. ఏమైతేనేమి, కొరియా యుద్ధం ప్రారంభమైనంతనే అమెరికా చూపిన తొందర పాటులో నూరోవంతునైనా చైనా చూపలేదు. మిత్రరాజ్యసమితిచేత ఒక తీర్మానాన్ని—లాంఛనప్రాయంగానే అనుకోండి—చేయించేవరకైనా వేచి వుండక అమెరికా సింగ్మన్‌రీకి సహాయంగా జపాన్‌లోని తన నౌకా, వైమానికబలాలను ఉరికించింది. ఆ తర్వాత నిద్రలో వున్న భద్రతాసంఘసభ్యులను నిద్రలోనుంచి లేపి, తెల్లవారితే కొంప అంటుకుపోగలదన్నట్టు ఉత్తరకొరియా దురాక్రమణకు మడికట్టినట్టు ఒక ఖండనతీర్మానాన్ని చేయింపించింది. కేవలం నౌకా, వైమానిక సహాయంచేస్తే, సింగ్మన్‌రీకి ఘోరపరాజయం తప్పదన్నట్టు

తోచినంతనే జపాన్‌నుంచి తన సైనికబలాలను హుటాహుటిగా [illegible] యుద్ధరంగంలో నిలిపింది. అయినా పరాజయాలు, పలాయనాలు తప్పకపోయేసరికి బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, టర్కీ మొదలైన తన మిత్రరాజ్యాలను వొత్తిడిపెట్టి, ఆ దేశాలదళాలను కొన్నింటిని రణరంగానికి ప్రయాణం చేయించింది. ఇంతచేసినా, దెబ్బపైదెబ్బతింటూ దక్షిణకొరియాలోని ఓడరేవు పూసాన్ పరిసరప్రాంతాలలో అతికష్టంమీద—కేవలం పళ్ళ బిగిని—ఎలాగో తలదాచుకోవలసివచ్చింది. ఈ స్థితిలో ఉత్తరకొరియాకు గడ్డిపోచపాటి సహాయాన్ని పెకింగ్ చేసివున్నా, కొరియా గడ్డపైనుంచి అమెరికనులు కదలవలసివచ్చేదే; కాని, అది కేవలం కొరియనుల అంతర్యుద్ధం అని చెప్పి, పెకింగ్ దానితో జోక్యాన్ని పెట్టుకొనేలేదు.

అప్పుడేకాదు; మొదటతిన్న దెబ్బలను తట్టుకుని, కొత్తబలాలను సమీకరించి, పెద్ద పెట్టున ఎదురుముట్టడులు ప్రారంభించి, ఉత్తరకొరియన్ సైన్యాలను అమెరికనులు చెల్లా చెదరు చేసినప్పుడైనా పెకింగ్ జోక్యం కలిగించుకోలేదు. అప్పటిలో దానిఅంచనా అమెరికనులు 38 వ అక్షాంశరేఖవద్ద ఆగబోతున్నారని కావచ్చు. ఇంతే జరిగితే యథాపూర్వస్థితికి భంగంకలగదనికూడా అది భావించి వుండవచ్చు. కాని, అమెరికన్‌సైన్యాలు పురోగమనాన్ని ప్రారంభించేసరికే 38 వ అక్షాంశరేఖవద్ద నిలిచిపోరాదని, మొత్తంకొరియాను ఆక్రమించాలని అమెరికాలో హెచ్చరికలు వినవచ్చినవి. వీటిని విన్నమీదట "38 వ అక్షాంశరేఖను అధిగమిస్తే నేను మిన్నకుండేదిలేదు" అని పెకింగ్ స్పష్టపరచింది.

ఇంతవరకు పెకింగ్‌చూపిన నిగ్రహం నిజంగా ప్రశంసించదగింది. దూరప్రాచ్యంలో అమెరికా ఉద్దేశాలను శంకించడానికి ఆదివరకు పెకింగ్‌కు కనబడిన కారణాలు అన్నీ ఒక యెత్తుకాగా, సింగ్మన్‌రీ సహాయంగా జపాన్‌లోని తమ నౌకా, వైమానిక బలాలను బయలు దేరివెళ్ళవలసింగా చేసిన ఉత్తరవుతోపాటు ఫార్మోజా రక్షణకు వెళ్ళవలసిందిగా తమ సప్తమ నౌకాబలానికి ప్రెసిడెంట్ ట్రూమన్ చేసిన ఉత్తరవు ఒక్కటీ ఒకయెత్తు. పెకింగ్ ప్రజలవిరోధి చాంగ్‌కై-షేక్‌ను ఇది బాహాటంగా సమర్థించటమే; పెకింగ్‌పై ఇది యుద్ధాన్ని ప్రకటించడమని చెప్పినప్పటికీ తప్పులేదు. అయినా, అమెరికా చర్యను వాగ్రూపంగా ఖండించి, ఎప్పటికైనా తమ ఫార్మోజాను తాము జయించితీరగలమని చెప్పడంతప్ప పెకింగ్ ఎట్టితొందరపాటునూ చూపలేదు. కొరియాయుద్ధం సాకుగాతీసుకొని, ఫార్మోజారక్షణకు బాధ్యతవహించడంలో అమెరికా తప్పుజేసినట్టు లోకం ఖండించేసరికి, అక్కడ అమెరికన్ నౌకాబలాలు తాత్కాలికంగా మాత్రమే వుండగలవనీ, కొరియాయుద్ధం ముగిసినంతనే వాటిని ఉపసంహరించగలమనీ, ఆతర్వాత ఫార్మోజా భవితవ్యాన్ని అంతర్జాతీయ బాధ్యతల ప్రకారం మిత్రరాజ్యసమితిద్వారా నిర్ణయించవచ్చుననీ ప్రెసిడెంట్ ట్రూమన్ ప్రకటించాడు. ఈ ప్రకటనను నిర్లక్ష్యంచేసి, పసిఫిక్‌లో ప్రపంచశాంతిని కాపాడాలంటే ఫార్మోజాను చేయిజారిపోనివ్వరాదని జనరల్ మెకార్థర్ ఒక సందేశమిచ్చాడు. ఈ సందేశాన్ని



"సరే అట్లాగే రూపాయికి తీసుకుపోతాను! కాని,
బండి విరిగితేమాత్రం దానిఖరీదు మీరివ్వాలి."

---

ట్రూమన్ ఖండించగా, అప్పటికి మిన్నకుండి, కొద్దిరోజులలోనే ఫార్మోజాకు స్వయంగా వెళ్ళి, మార్షల్ చాంగ్‌కై-షేక్‌తో రహస్యచర్చలు జరిపివచ్చాడు. ఇంతజరిగినా పెకింగ్ నిగ్రహాన్నే చూపింది. దాని ఈ నిగ్రహాన్ని అమెరికా చాలలేనితనంక్రింద జమకట్టినట్టున్నది. అందువల్లనే ౩౮ వ అక్షాంశరేఖను అధిగమించడానికే కాకుండా, మంచూరియా సరిహద్దుల వరకు పురోగమించడానికే అది నిర్ణయించింది. కేవలం నిర్ణయించటమేకాదు, మంచూరియాకు కనుచూపుమేరలోవరకు వెళ్ళింది. అప్పుడిక పెకింగ్ కదిలింది. దానిఫలితం,—తిరిగి కొరియాలో అమెరికాకు ఘోర పరాజయం.

ఈ పాతకథనంతటినీ ఇక్కడ త్రవ్వడం కొరియాలో పెకింగ్‌దురాక్రమణకు చైనా వారి కట్టినట్టు మిత్రరాజ్యసమితి తీర్మానించి, దానిపై చర్యకుదిగాలని అమెరికా చూపుతున్న పటుదల ఎంతమాత్రం న్యాయంకాదని వివరించడానికే. ఎక్కడో అయిదువేల మైళ్ళదూరంలో వున్న అమెరికా కొరియాలో కమ్యూనిష్టుప్రభుత్వ సంస్థాపనవల్ల తన భద్రతకు భంగం

---

వాటిల్లగలదని భావిస్తుండగా, తన ఇరుగుపొరుగున, దాదాపు తన పెరటిలో అమెరికనులు ప్రవేశించడం తనకు ప్రాణసంకటంకాగలదని పెకింగ్ అనుకోవడంలో తప్పేమున్నది? ఒకరు మరొకరిపై దురాక్రమణ జరపడం ప్రశ్న నిజంగా వుంటే, చైనాపైనే అమెరికా దురాక్రమణ జరిపినట్టు బల్లగుద్దిచెప్పవచ్చు. ఫార్మోజా రక్షణకు అమెరికా తన నౌకాబలాన్ని పంపడం దురాక్రమణ! చాంగ్‌కై-షేక్ ప్రభుత్వానికి ఈమధ్య కొత్తగా సహాయాన్ని పంపించడం దురాక్రమణ!! ఇందువల్ల మిత్రరాజ్యసమితి ధర్మదేవత ముఖాన్నిచూస్తూ తీర్మానాన్నిచేస్తే, అది ఖండించవలసింది చైనానుకాదు; అమెరికానే. ఈసంగతి అమెరికా మిత్రరాజ్యాలకుకూడా వాటి అంతరంగంలో తెలుసు. కాని, అమెరికా దయాధర్మ బిచ్చాలపై ఈనాడు వాటిబ్రతుకు ఆధారపడివున్నది. ఇందువల్ల అంతరంగంలోని మాటను పైకి అనలేకుండా వున్నాయి. ఇంతేకాదు. అమెరికా మంకుపట్టుపడితే, దాని కోర్కెప్రకారమే అవి చివరికి చేతులెత్తవచ్చుకూడా! అనేక స్వతంత్రరాజ్యాల ఈనాటి ఈ నిస్సహాయస్థితిని చూడగా, డాలర్ ప్రస్తుతంసాధించిన ఈప్రాబల్యాన్ని ఖడ్గబలం మానవచరిత్రలో ఏనాడైనా సాధించగలిగిందా అని ఆశ్చర్యాన్నీ, విచారాన్నీకూడా చెందవలసి వస్తున్నది.

చైనాపై చర్యలన్నప్పుడు దానిపై ఆర్థికపు ఆంక్షలను, ఇతరఆంక్షలను అమెరికా ఉద్దేశిస్తున్నది. గతానుభవాన్నిబట్టి ఆర్థికపు ఆంక్షలవల్ల ప్రయోజనం శూన్యం. కాబట్టి, ఇతర ఆంక్షలనే, ఆదిలో కాకపోయినా, ఆ వెనువెంటనే ప్రయోగించవలసివస్తుంది. ఈ ఇతర ఆంక్షల తాత్పర్యాన్ని ఒక్కముక్కలో చెప్పవచ్చు. అది,—యుద్ధం. ఇప్పటి చైనా వెనకటి చైనాకాదు; అది కొత్తచైనా. ఈనాడు దానిలో ప్రాంతానికి ఒక పరిపాలకుడు లేడు; పరగణాకు ఒక బందిపోటునాయకుడు ("వార్‌లార్డ్") లేడు. ఈనాటి దానిసైన్యం జీతభత్యాలకోసం పనిచేసేదికాదు; ఎవరు ఎక్కువ లంచం పెడితే వారిపక్షానికి తిరిగిపోయేదికాదు; అది ప్రజాసైన్యం. "పళ్ళు ఊడగొట్టడం తప్పనప్పుడు ఏరాయి అయితేనేమి?" అనేవైఖరిని చైనాప్రజలు ఈనాడు తమ ప్రభుత్వంపట్ల ప్రదర్శించడంలేదు; అది తమ ప్రభుత్వమేనని వారు భావిస్తున్నారు. చైనాలో అంతర్యుద్ధం ముగిసింది ఈమధ్యనే అయినప్పటికీ, బహుముఖంగా దేశం ఎంతో అభివృద్ధిచెందింది. ఈ అన్నికారణాలవల్ల చైనాను జయించడం సులభంకాదు. అది అసాధ్యం అని చెప్పినప్పటికీ అత్యుక్తికాదేమో! జపాను సైనికపాటవం మహోచ్ఛస్థితిలో నున్నప్పుడు అది చైనాపై ప్రయోగించిన సాయుధబలాలకంటె ఎక్కువ బలాలను పాశ్చాత్యరాజ్యాలు చైనాపై కేంద్రీకరించలేవనే అనుకోవచ్చు. పైగా, జపాన్ చైనా సరసనే వుండగా, ఈ పాశ్చాత్యరాజ్యాలు కొన్నివేలమైళ్ళలో వున్నాయి. జపాన్‌వారిని సమీకరించి, జపాన్‌సైన్యాలను చైనాపైకి నడపడానికి అమెరికా ప్రయత్నించవచ్చు. కాని, తమను ఘోరపరాజయానికి లోనుజేసి, తమదేశాన్ని ఆక్రమించి, నిరంకుశంగా పరిపాలిస్తూ, తమ జాతీయగౌరవాన్ని మంటగలిపిన అమెరికాకోసం జపాన్‌వారు ప్రాణాలను ఒడ్డి పోరాడగల రనుకోవడం పిచ్చిభ్రమ. పోనీ, తక్కిన పరాజయాలను, పరాభవాలను జపాన్‌వారు ఒకవేళ మరచిపోగలిగినా, హిరోషిమాను మరచిపోగలరా? నాగసకిని మరచిపోగలరా?


ఇంకొక విషయాన్నికూడా ఈ సందర్భంలో మనం గుర్తుపెట్టుకోవాలి. ఇదివరకు జపాన్‌తో ఒంటరిగా పోరాడవలసివచ్చినా, చైనా కడవరకు అజేయంగా నిలిచింది. ఇప్పుడు దానిపై యుద్ధప్రకటనే జరిగింది. అది ఒంటరిగా మిగలదు. యుద్ధప్రమాదం సంభవిస్తే పరస్పర సైనికసహాయానికి నిలవడానికి సోవియెట్ రష్యాతో దానికి ఒడంబడిక వున్నది. ఇందువల్ల దానిపై యుద్ధప్రకటన జరగడమే తడవుగా అది ప్రపంచయుద్ధంకింద పరిణమించడం తథ్యం.

చైనాపై ఆంక్షలను ప్రకటించడం మరొక ప్రపంచయుద్ధానికి నాందికాగలదని అందరికీ తెలుసుకనుకనే, రాయబారాలద్వారా సమస్యాపరిష్కారానికి ఇప్పటికీ విశేషంగా కృషిజరుగుతున్నది. ఈ నెలలో లండన్‌లో జరిగిన కామన్‌వెల్త్ ప్రధానులసభ ప్రధానంగా చర్చించిన సమస్య కొరియాయుద్ధం ప్రపంచయుద్ధంగా మారిపోకుండా చేయడానికి ఏదిదారి అనే. ఈ సభలో జరిగిన చర్చల ఫలితంగా కొరియా వివాదపరిష్కారానికి ఒక పంచసూత్ర పథకం రూపొందించబడింది. దాని సారాంశమిది: ఉభయపక్షాలచే కొరియాలో యుద్ధవిరమణ. అటుపిమ్మట తగుఅంచెలపై (చైనా వాలంటీర్లతోసహా) కొరియాలోని అన్ని విదేశసైన్యాల ఉపసంహరణ. తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోడానికి కొరియన్ ప్రజలకు అవకాశమివ్వడం. ఈలోపున దేశపరిపాలనకు ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని స్థాపించడం. బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, రష్యా, చైనాల సమేతంగా దూరప్రాచ్య సమస్యలతో సన్నిహిత సంబంధంగల ముఖ్యరాజ్యాల సమావేశాన్ని జరిపి, దానిద్వారా మొత్తం దూరప్రాచ్య సమస్యలన్నింటిని పరిష్కరించడానికి యత్నించడం. "మొత్తం దూరప్రాచ్య సమస్యలు" అన్నప్పుడు పెకింగ్‌కు మిత్రరాజ్యసమితిలో ప్రాతినిధ్యం, ఫార్మోజా భవిశవ్యంకూడా దానిలో చేరగలవని ఈ పథకంలో స్పష్టపరచబడింది.

అతికష్టంమీద అమెరికా ఈ పంచసూత్రప్రణాళికకు సమ్మతించింది. అయితే, దాని సమ్మతి సదుద్దేశంతో జరిగిందని అనలేము. దూరప్రాచ్యసమస్యల అమెరికన్ ఉపవిదేశాంగ మంత్రి "ఎలాగూ పెకింగ్ ఈపథకానికి సమ్మతించబోదు. ఆపని జరిగినమీదట ఇంకా సహిస్తారా అని మన మిత్రరాజ్యాలను వొత్తిడిపెట్టవచ్చుననే మనం వల్లె అన్నాము" అని చెప్పనే చెప్పాడు. కొన్ని అమెరికన్ పత్రికలుకూడా ఈ ధోరణిలోనే వ్యాఖ్యానాలుచేశాయి కూడా. "యుద్ధాన్ని నిర్నిబంధంగా ముందు విరమించితీరాలి" అని ఆదిలో మిత్రరాజ్యసమితి పంపిన ఆదేశంకంటె ఈ పంచసూత్రపథకం చాలామెరుగు. కాని, చైనాదృష్టిలో దీనిలోకూడా కొన్ని లోపాలున్నాయి. ముందు యుద్ధవిరమణ, ఆతర్వాత తగుఅంచెలపై విదేశసైన్యాల ఉపసంహరణ, అపిమ్మటనే దూరప్రాచ్య సమస్యలచర్చకు సమావేశం అని చెప్పడం దానికి మొదట పెద్దలోపంగా కనబడింది. యుద్ధవిరమణ పిదప విదేశసేనల ఉపసంహరణ జరగగలదన్న హామీయేమిటి? పైగా, "తగుఅంచెలపై వాటి ఉపసంహరణ" అంటున్నారుగదా? ఏవి తగుఅంచెలు? వాటిని నిర్ణయించేవారెవరు? ఈవిషయమై ఎడతెగని

రాయబారాలు సాగిస్తూ, ఈలోపుగా కొత్తముట్టడికి సన్నద్ధంకాగూడదా? కొరియా ప్రజలు స్వచ్ఛందంగా తమభవిష్యత్తును నిర్ణయించుకొనగలలోపల తాత్కాలిక ప్రభుత్వసంస్థాపనలో మెలికఏమీలేదా? దూరప్రాచ్యసమస్యల పరిష్కారానికై జరిగేసభ అమెరికాలోనే జరిగితే, అక్కడ పెకింగ్‌కు తీవ్రంగా ప్రతికూలంగావున్న వాతావరణంలో ఆసభ నెగ్గేఅవకాశం వున్నదా? దూరప్రాచ్యంతో సన్నిహితసంబంధంగల ఇతర రాజ్యాలన్నప్పుడు, అవియేవి? వాటిలో మార్షల్ చాంగ్ ప్రభుత్వంకూడా ఒకటికాదుగదా? ఇంతేకాదు, వాటిలో ఇండియా, ఈజిప్టులను పోలినవాటికి స్థానంవున్నదా, లేదా? తనకు కనబడిన ఈ లోపాలను తనకు తోచిన ఈ సందేహాలను పురస్కరించుకుని, పంచసూత్ర ప్రణాళికకు పెకింగ్ కొన్ని సవరణలను సూచించింది. ఇంతమాత్రానికే "అదుగో! మేము ముందే చెప్పలేదా! పెకింగ్ తిరిగి మిత్రరాజ్యసమితిని ధిక్కరించింది! ఇప్పటికే ఇది రెండవసారి! ఇంకా ఊరుకుంటారా? అయితే అది చేతకానితనంకాబోదా?"—ఈ ధోరణిలో అమెరికా తిరిగి అల్లరి ప్రారంభించింది. కామన్‌వెల్త్ రాజ్యాలు—ముఖ్యంగా ఇండియా, పాకిస్తాన్, బ్రిటన్, కెనడాలు—అమెరికా వ్యాఖ్యానంతో ఏకీభవించలేదు. ఇంకా పెకింగ్‌తో రాయబారాలకు అవకాశంగలదనే అవి అభిప్రాయపడినవి. ఈ పరిస్థితిలో ఇండియా నాయకత్వంక్రింద, దాన్నికూడా కలుపుకుని పన్నెండు అరబ్‌ఆసియన్ రాజ్యాలు రాయబారాలద్వారా వివాదపరిష్కారానికి కొత్త కొత్త సూచనలను చేయనారంభించాయి. యుద్ధవిరమణ, దూరప్రాచ్య సమస్యలపై సంభాషణలు ఒకే సమయంలో ప్రారంభంకావలెననడమే ఈ కొత్తసూచనలకు ప్రాతిపదిక. అయితే, "మిత్రరాజ్యసమితిని ధిక్కరించి, దురాక్రమణకుదిగిన రాజ్యాలతో అది యుద్ధాన్ని విరమించకముందు సమావేశానికి మేము కూర్చోవడం కల్ల" అని యునైటెడ్‌స్టేట్సు పట్టుదలకు పోతున్నది. దాన్ని సంతృప్తిపరచడం నిమిత్తం దురాక్రమణకు దిగినట్లు పెకింగ్‌ను ముందు ఖండించి, ఆ పిదప రాయబారాల ప్రారంభానికి అవకాశాలను వెతకాలని ఇజ్రాయెల్ ఒక చిత్రమైన సూచనను చేస్తున్నది. ఇంతే జరిగితే పెకింగ్ రాయబారాలకు సమ్మతించడమే కల్ల. ఈ క్షణానికి (దీన్ని వ్రాస్తున్నది 29 వ తేదీ రాత్రి పదకొండున్నరగంటలకు) ఇదీ పరిస్థితి. తెల్లవారితే ఏమి కాగలదో ఆ బ్రహ్మదేవునికే యెరుక.






[గతసంచిక తరువాయి]

## పదకొండో ప్రకరణం

చిన్నపిల్లలు స్వతస్సిద్ధంగా వేదాంతులు. ఎట్టి సిద్ధాంతాలూ ఎరగని నిర్లిప్తమైన మనస్సులతో వాళ్ల జీవితంలోని మంచిచెడ్డలనూ, కష్టసుఖాలనూ తమ అనుభవంగా చేసుకుంటారు. కనకనే వాళ్లకు జీవితంనుంచి పెద్దవాళ్లు పొందలేని ఆనందం లభిస్తుంది.

సుందరం మనస్సు రోజురోజుకూ కొత్తవికాసం పొందుతున్నది. జీవితంలో రోజూ కనిపించే వాటిలోనే కొత్త ఆనందం కనిపించటంకాక కొత్త అనుభవాలుకూడా ఎన్నో కలిగేవి. రోజూ బడికిపోవటం, పీరియడ్లు జరగటం, మేష్టర్లు మారటం, పాఠాలు జరగటం, సాయంత్రం పూట ప్లేగ్రౌండ్‌లో ఆటలూ, స్నేహితులిళ్లకు వెళ్లటం, కొత్త కుర్రాళ్లతో స్నేహితాలు చేసుకోవటం, ఇంటికి రావటం, తల్లి వెంట ఉండి ఆవిడచేసే ఇంటిపనులన్నీ చూడటం, ఆవిడ పాడుకునే పాటలు వినటం మొదలైనవి నిత్యకర్మ. ఇవికాక కొన్ని అపూర్వమైన సంఘటనలుకూడా ఉండేవి.

సుందరం నాలుగో క్లాసులోకి ప్రవేశించిన ఏడు మహమ్మారి వచ్చింది. జనం హడలిపోయినారు. జాతర్లూ, కొలుపులూచేశారు. మారెమ్మను గురించి తన తల్లితో అమ్మలక్కలు చెప్పుకునే భయంకరమైన విషయాలు సుందరం విన్నాడు. ఎవరికన్నా మశూచికంపోసి చావటానికి సిద్ధంగాఉంటే మారెమ్మ కల్లో కనిపిస్తుందిట। ఏదో తింటున్నట్టు దవడలు ఆడిస్తుందిట. లేదా ఫలానివాళ్లని తినేస్తున్నానని చెబుతుందిట. ఈ కథలన్నీ విన్నమీదట సుందరానికి మారెమ్మ కల్లో కనిపిస్తుందేమోనన్న భయంకొద్దీ చాలా రోజులు నిద్రకూడా పట్టేదికాదు.

ఆ యేడే యుద్ధం అయిపోయింది. యుద్ధం అయిపోయిన సంగతి సుందరానికి విచిత్రంగా తెలిసింది. ఉదయానే వాడు వీధి వాకిట్లోకివచ్చి నిలబడి ఉండగా అతని సహాధ్యాయి నాగేశ్వరరావు తన

తండ్రివెంట వీధినపోతూ సుందరాన్ని చూసి ఆగాడు.

"అరే, సుందరం, ఇవాళ బడిలేదు. శలవ," అన్నాడు నాగేశ్వర్రావు.

"ఏం?'' అన్నాడు సుందరం.

''నీకు తెలీదా? యుద్ధంలో మన వాళ్లు గెలిచారు. జర్మనీవాళ్లు ఓడి పోయినారు.''

"నిజంగా శలవేనా?" అన్నాడు సుందరం, నాగేశ్వర్రావు మాట నమ్మి బడికి పోకుండా, మానేసి పాఠాలు పోగొట్టుకోవటం ఇష్టంలేక.

"అబద్ధం చెబుతానుట్రా? నువు కూడా రా. తాలుకాఫీసుకు పోదాం. రాజూరాణీ పఠాలుపెట్టి ఊరేగుతారు. మానాన్న తాలూకాఫీసులో పనిచేస్తాడు గాదూ? అక్కడికే పోతున్నాం.''

"ఉండు వస్తా. మా అమ్మతో చెప్పనీ,". అంటూ సుందరం లోపలికి పరిగెత్తి, "అమ్మా, అమ్మా! మనవాళ్లు యుద్ధంలో గెలిచారు. నే నిప్పుడేవస్తా." అంటూ వచ్చి నాగేశ్వర్రావును కలుసు కున్నాడు. ఈలోగా నాగేశ్వర్రావుతండ్రి చాలాదూరం వెళ్లిపోయినాడు.

స్నేహితులిద్దరూ చేతులు చేతులు పట్టుకుని తాలూకాఫీసుకేసి నడిచారు. దారిలో నాగేశ్వర్రావు చాలా ఉత్సాహంగా మాట్లాడాడు. యుద్ధంలో "మనం" గెలవటంలో సుందరానికి ఆనందించవలిసిన అవసరం ఉందని మొదట తెలియనప్పటికీ, నాగేశ్వర్రావు ఉత్సాహం అంటువ్యాధిలాగా సంక్రమించింది.

"ఇక జర్మనీవాళ్లు ఎప్పటికీ యుద్ధం చెయ్యరు. వాళ్ల పొగరణిగిపోయిందిలే. ఇంగ్లీషువాళ్లంటే ఏమిటనుకున్నారో. నిజంగా ఇంగిలీషువాళ్లని ఎవరూ జయించలేరు తెలుసా?" అంటూ ఎంతో ఉత్సాహంగా మాట్లాడాడు నాగేశ్వర్రావు.

వీళ్ళు వెళ్ళుతుండగానే ఊరేగింపు ఎదురువచ్చింది. బాండువాయిస్తున్నారు. "సార్టు" బండిలో జార్జిచక్రవర్తివీ, మేరిరాణివీ రంగుపఠాలు ఊరేగించారు. పోలీసులూ, పోలీసుఉద్యోగస్తులూ, తహసీల్దారూ, డిప్టీకలెక్టరూ, ఊళ్ళో ఒకరిద్దరు గొప్పవాళ్ళూ ఊరేగారు.

సుందరం ఆనందాని కిప్పుడు మేర లేదు. ఆ ఆనందంలో బడికి శలవన్నది ఎక్కువయిన పాత్రవహించింది.

"నువు అన్నంతిని మా ఇంటికి రారాదుట్రా? ఇవాళ మా అన్నయ్యా, బావా, వాళ్ళస్నేహితులూ చాలామంది వస్తారు. సరదాగా తిరుగుదాం," అన్నాడు నాగేశ్వర్రావు.

సుందరం సరేనన్నాడు. ఈ ఇద్దరికీ ఈరోజున ఈవిధంగా ప్రారంభమైన స్నేహం సుందరం జీవితంలో అతి ప్రధాన స్నేహాలలో ఒకటిగా పరిణమించింది.

* * *

నాగేశ్వర్రావు అన్న శ్రీరామ్మూర్తి అప్పటికే ఫోర్తుఫారం చదువు తున్నాడు. నాగేశ్వర్రావు అక్కమొగుడు అత్తవారింటనే ఉండి, పోస్టాఫీసులో ఉద్యోగంచేస్తున్నాడు.

ఇవాళ నాగేశ్వర్రావింటికి శ్రీరామ్మూర్తి స్నేహితులూ, సహాధ్యాయులూ నలుగు రైదుగురువచ్చారు. వాళ్ళంతా చాలా కలుపుకోలుగా ఉంటూ ఇంటోవాళ్ళల్లేనే ప్రవర్తించేవాళ్ళు. నాగేశ్వర్రావుకూడా వాళ్ళను "ఏంరా?" అని పిలిచేవాడు. సాధారణంగా పెద్దఫారాలు చదివే పిల్లలు చిన్నక్లాసులవాళ్ళను లోకువగా చూసేవాళ్ళు, కాని శ్రీరామ్మూర్తి స్నేహితులు సుందరాన్ని అట్లా చూడలేదు.

రోజల్లా చాలా సరదాగా గడిచిపోయింది. చాలాసేపు చీట్లపేక ఆడారు. దొంగాట. సుందరానికి దొంగాట చాత కాదు. అందుచేత నాగేశ్వర్రావు ఆడే ఆట చూస్తూ కూచున్నాడు.

ఇంతలో ఎక్కడినుంచో గ్రామఫోను వచ్చింది, పువ్వుతోసహా. గ్రామఫోనూ, కుక్క గ్రామఫోను వింటున్న బొమ్మగల ప్లేట్లూ సుందరం ఈసారి దగ్గిర్నుంచి చూశాడు. వాడు గ్రామఫోనుకు కీ ఇచ్చాడు కూడానూ. ప్లేట్లలో వనజాక్షి ప్లేట్లూ, రైలుబండితమాషా, కోయం బత్తూరు తాయి ప్లేట్లూ, నవ్వేప్లేటూ, కొన్ని తురకప్లేట్లూకూడా ఉన్నాయి. వనజాక్షిప్లేట్లలో "ఓరోరిబండివాడా", "శివదీక్షాపరురాలనురా", "పదినెలందరు వచ్చిరి" ఉన్నాయి. పాటంతాపాడి "మైనేమీజ్ వనజాక్షి" అనేది వనజాక్షి. ఆ మాటకోసం ఎన్నిసార్లో ఆ ప్లేట్లు పెట్టారు. రైలుబండి తమాషా ఎన్ని సార్లు పెట్టారో సుందరానికి లెక్ఖకూడా లేకుండాపోయింది. చూస్తుండగా నే ఆ పాటంతా సుందరానికి వచ్చేసింది. నవ్వుప్లేటు తమాషాగా నేఉందిగాని వాదేమంటున్నాడో తెలీదు. తాళం ప్రకారం నవ్వటం సుందరానికి చాలా అసహ్యంగా కనపడింది.

సుందరం మధ్యాహ్నం ఇంటికొచ్చి అన్నంతిని మళ్ళీ రెండు గంటలకు నాగేశ్వర్రావింటికి వెళ్ళాడు. అక్కడ నాగేశ్వర్రావు తల్లి అందరికీ ఫలహారాలు పెట్టింది. ఆ ఫలహారం తిన్న తరవాత అందరూ కలిసి రైలుకట్ట దగ్గిర దొంకలో బిళ్ళంగోడు ఆడటానికి బయలుదేరారు.

ఆ ఆట చూస్తుంటే సుందరానికి ఆశ్చర్యంవేసింది. ఆ ఆటలో సుందరానికిగాని, నాగేశ్వర్రావుకుగాని స్థానం లేదు. అందరూ పెద్దవాళ్ళే. నాగేశ్వర్రావు బావ కొడితే బిళ్ళకంటికి కనిపించకుండా ఎక్కడికో వెళ్ళిపొయ్యేది. ఎదురు ఆడేవాళ్ళేం తక్కువతిన్నవాళ్ళుకారు. పిట్టల్లే ఎగిరేబిళ్ళను ఒడిసిపట్టుకునేవాళ్ళు. అంత దూరంనుంచీ బిళ్ళను విసిరి గుంటమీదపడేటట్టు వెయ్యటానికి ప్రయత్నించేవారు. గెలుచుకున్న ఎల్లలు కొలవటంలేదు, గెలిచినవాడు ఇన్ని ఎల్లలని చెప్పటమూ, వాడు ఎక్కువ చెప్పాడని తోచినప్పుడు రెండోపక్షం వాళ్ళు కొలవటమూనూ.

ఈ బిళ్ళంగోడు ఎంతసేపు చూసినా సుందరాకి విసుగెత్తలేదు. అందుచేత వాడికి సాయంకాలం అయిపోవటం కూడా గుర్తులేదు. తీరా ఆట చాలించే సరికి సూర్యాస్తమానం కావస్తున్నది. ఆ తరవాత అందరూ కలిసి రైలుకట్ట



వెంబడే నడిచి కాలవదగ్గిరికి వెళ్లి అక్కడ స్నానాలు చేశారు. ఇల్లు చేరేసరికి చీకటిపడి దీపాలు పెట్టి చాలా సేపయింది.

రోజల్లా సరదాగానే గడిచినా, ఇంటో ఎక్కువ సేపు గడపనందుకూ, స్కూలు మొహం చూడనందుకూ సుందరం కించపడి, ఏదో చెయ్యగూడనిపనిచేసి, తనకు అధికారంలేని ఆనందం అనుభవించినవాడల్లే బాధపడ్డాడు.

* * *

స్నేహితులు ఒకరినొకరు పొడి అక్షరాలతో పిలుచుకునేవాళ్ళు. సుందరం కె. ఎస్., నాగేశ్వర్రావు పి. ఎన్. ఆర్. ఇట్లాగే ఇతరవిద్యార్థులూనూ. ఈ దశలో వీళ్లు తమ అన్యోన్య సంబంధాలతో ఒక సమగ్ర ప్రపంచం సృష్టించుకునేవారు. ఈ ప్రపంచంలో ప్రేమలూ, అసూయలూ, అలకలూ, పరామర్శలూ, త్యాగాలూ, సహనాలూ, సమస్యలూ, పరిష్కారాలూ, స్వార్థమూ, నేరాలూ, శిక్షలూ అన్నీ ఉండేవి. అయితే బాహ్యప్రపంచంలోలాగ పెద్ద ఎత్తున దౌర్జన్యమూ, దోపిడీ, కుట్రా ఉండేవికావు.

సుందరానికీ, నాగేశ్వర్రావుకూ స్నేహం ఎప్పుడు, ఎట్లా ఏర్పడిందీ ఎవరూ ఎరగరు. అది క్రమంగా బలం పొందింది. మనసులో ఉన్న మాటలను అవతలివాడికి దాచకుండా చెప్పుకోవటమూ, ఒకరి ప్రభావానికి ఒకరు గురికావటానికి ఒప్పుకోవటమూ స్నేహం. ఇటువంటి స్నేహం ఎంతదూరమన్నా పోతుంది.

సుందరం బడినుంచి నాగేశ్వర్రావు వెంటలేకుండా ఇంటికొచ్చేవాడుకాడు. ఇద్దరూ సామాన్యంగా కలిసే బడికి వెళ్లేవాళ్లు. పరీక్షలూ అవీ దగ్గిరికివస్తే ఇద్దరూ కలిసే చదివేవాళ్లు. సుందరం రాత్రి అన్నంతిని పుస్తకాలు పట్టుకుని నాగేశ్వర్రావింటికి వెళ్లేవాడు. రాత్రి పూట అక్కడే పడుకునేవాడు.

సుందరానికి నాగేశ్వర్రావుకూ కలిగిన స్నేహం బలమైనదని సీతమ్మగారు సులభంగా ఊహించింది. ఎప్పుడన్నా నాగేశ్వర్రావు తమ ఇంటికివస్తే ఆవిడ వాణ్ణి ఆప్యాయంగానే చూసేది. కాని తన కొడుకును నాగేశ్వర్రావింట్లో వాళ్లు ఎట్లా చూస్తారో ఆవిడకు తెలీదు. నాగేశ్వర్రావు స్నేహం తన కొడుక్కు అంగరక్షగా ఉంటుందని ఆవిడ తెలుసుకున్నది.

ఇప్పుడు యుద్ధం విషయం మాట్లాడేవాళ్లెవరూలేరు. దేశమంతటా దైవభక్తి హెచ్చిపోయింది. ప్రతిరోజూ ఎవరో

ముసలాయన భజనకీర్తనలు పాడుతూ బయలుదేరేవాడు. అనేకమంది పిల్లలు ఆయనవెంట పాడుతూ తిరిగేవాళ్ళు. ఆయన ఉత్త అరచేతిలోనుంచి చిన్న చిన్న ఎండు కొబ్బరిముక్కలు తీసి తన వెంటవచ్చే పిల్లలకు ఉన్నట్టుండి పెడుతూ ఉండేవాడు. అప్పుడప్పుడూ దవనంముక్కలుకూడా తీసి ఇచ్చేవాడు. ఆయన గొంతు వెలుగురాచుకుపోయినట్లుండేది. ఆయన ఎవరినీ డబ్బు యాచించినట్టు కనపడేవాడుకాడు. వీధి వెంట పోతూ పోతూ తన ఇష్టంవచ్చిన ఇంటో ప్రవేశించేవాడు. అక్కడ ఏ కొబ్బరికాయలో ఇస్తే అవి అక్కడే పంచిపెట్టేవాడు. సుందరం, నాగేశ్వర్రావు ఈయనవెంట దాదాపు రోజూ తిరిగేవాళ్ళు.

చీకటిపడ్డతరవాత ఇంకొకరకం భజనలు బయల్దేరేవి. కొందరు కుర్రాళ్ళు దీపస్సెమ్మెలు పట్టుకుని ఇల్లిల్లూతిరిగి, "ఆడుగో రాముడు వస్తున్నాడు. వచ్చి వాకిట నిలిచున్నాడూ," అని పాడేవాళ్లు. ప్రతి ఇంటోనూ దీపానికి నూనే, కాని డబ్బులూ పడ్డేవి.

నాగేశ్వర్రావింటో ప్రతి శనివారం రాత్రి భజనకూడా ఏర్పాటుచేశారు, ఒకటి రెండు తరంగాలూ, రామదాసుపాటలూ పాడేవాళ్ళు. ఈ భజన సుందరానికి బాగుండేది.

ఒకనాడు సాయంకాలం సుందరం బడినుండి నాగేశ్వర్రావుతోబాటు ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డుమీద ఒకగుర్రం ఎదురువస్తూ కనిపించింది. దానిమీద



కాళ్ళు తెగిపోయినవాడొకడు పడుకుని ఉన్నాడు.

"వాడు యుద్ధంలో పనిచేసిన సిపాయిరా," అన్నాడు నాగేశ్వర్రావు.


"నిజంగానా?" అన్నాడు సుందరం ఆశ్చర్యంగా. ఆ గుర్రాన్నీ మొండి వాణ్ణీ సుందరం అదివరకు రెండుమూడుసార్లు చూశాడుగాని వాడు సిపాయని ఎరగడు.

"అవును. పాపం, యుద్ధంలోనే వాడి కాళ్ళు పోయినై. వాడికి పింఛనిచ్చి ఆ గుర్రాన్నికూడా ఇచ్చేశారు. ఆ గుర్రం మీద అట్లాగేతిరుగుతూ అడుక్కుంటాడు."

"కాళ్లు లేవుగా? ఎట్లా ఎక్కుతాడో?"

"ఎవరో ఎక్కిస్తారేమో. ఆ గుర్రం, చూడు, ఎంత విశ్వాసంకలదో! ఎవరన్నా ఎదురువస్తే ఆగుతుంది. ఎప్పుడూ పరిగెత్తదు. అడుక్కున్నవాన్లోనే వాడు తను తిని గుర్రానికిపెట్టాలి. ఏం పెడతాడు, పాపం?"

"గుర్రం చాలా తింటుందా?"



"తినకేంరా? పచ్చిగడ్డీ ఎండుగడ్డీ తింటుంది. ఉలవలు తింటుంది. అదీ కాక దాన్ని రోజూ మాలిస్ చెయ్యాలి."

అవును. సుందరానికి జ్ఞాపకం వచ్చింది. మునసబుగారికి గుర్రబ్బండీ ఉంది. ఆ గుర్రాన్ని కాసావాడు రోజూ మాలిస్ చెయ్యటం సుందరం చూశాడు. గుర్రం గడ్డిమీద తప్ప పడుకోదు. పక్కకు వేసే గడ్డి అది తినదుట....

కొన్నాళ్లకు హైస్కూల్లో ఒక మీటింగు పెట్టారు. ప్రతి క్లాసుకూ నోటీసు వచ్చింది, ఉమామహేశ్వర పండితుడు ఉపన్యాసం చేస్తాడని. ఉమామహేశ్వరపండితుడి ఉపన్యాసాన్ని చాల మంది మేష్టర్లూ రెండువందల మంది విద్యార్థులూ విన్నారు. పండితుడు హిందూ మతాచారధర్మాలను గురించి మాట్లాడాడు. జుట్టూ, బొట్టూ, కట్టూ—ఇవి జాతీయతకు చాలా ముఖ్యమనీ, మనం కిరస్తానీవాళ్ళని అనుకరించి క్రాపింగులూ అవీ పెట్టుకుని జాతీయతనూ, మతాచారాలనూ పోగొట్టుకోకూడదనీ ఆయన చెప్పాడు.

ఆయన ఉపన్యాసంవిని ఉద్రేకంవచ్చి చాలామంది విద్యార్థులు క్రాపింగులు తీసేసి తలలు గుండ్లు చేయించి పిలకలు పెట్టించేశారు. అట్లా చేసినవారిలో సుందరం క్లాసుమేష్టరు సాంబయ్యగారు ఒకడు.

ఆయన క్లాసులోకి వస్తూనే తలపాగా తీసి బల్లమీదపెట్టి పిల్లల్ని చూసి నవ్వాడు. పిల్లలంతా ఆయన బోడితల చూసి గొల్లున నవ్వారు.

"అంతా గుండుకాదులేరా. ఇదుగో గోష్పాదం." అంటూ ఆయన తల వెనక్కుతిప్పి పిలక చూపించాడు.

"అవునురా, మన వేడిదేశానికిదే హాయి. నిక్షేపంగా ఎన్నిసార్లయినా స్నానం చెయ్యొచ్చు, మంగలికి అర్ధణా డబ్బులు పారేస్తే డెక్కేస్తాడు తల. ఎందుకొచ్చిన క్రాపులు?.... తమాషా చూశారూ? ఈ ఇంగ్లీషువాళ్లు మనమీద అధికారంచేస్తున్నారు గనక మనం క్రాపులు పెడుతున్నాం. మనం వాళ్ళమీద అధికారం చేశామనుకో, ఈ దొర ముండాకొడుకులంతా చచ్చినట్టు బుర్రలు గీకించి పిలకలు పెట్టరూ?"

ఆరోజు పాఠంలేదు. సాంబయ్యగారు "వరల్ మాప్" తెప్పించి అందులో ఎర్రరంగు వేసిఉన్న భాగాలన్నీ చూపించి బ్రిటిషు సామ్రాజ్యంలో సూర్యాస్తమానం ఎందుకు కాదో చెప్పాడు. ఈ ఇంగ్లీషువాళ్లు యుద్ధమప్పుడు ఇండియాకు స్వరాజ్యమిస్తా

మని ఎటువంటి కబుర్లు చెప్పారో ఇప్పుడెట్లా తలాయిస్తున్నారో చెప్పాడు.

"గెలిచిన కోడి కప్పెక్కి కూసిందట. వాళ్లెందుకిస్తార్రా మనకు స్వరాజ్యం? ఇవ్వరు. యుద్ధంలో గెలవటానికి నోటికొచ్చిన అబద్ధాలన్నీ ఆడారు. వాళ్ళ అక్కర తీరిపోయింది. మనదేశంనుంచి వాళ్లు కోట్లకు కోట్లు రూపాయలు దోచుకు పోతున్నారు.... ఒక్క డబ్బేనా? మనదేశంలో ఎన్నో దేవాలయాలూ, కోటలూ, దేవుళ్ల విగ్రహాలూ ఉన్నాయి. అందులో ఉండే వజ్ర వైఢూర్యాలన్నీ కాజేశారు. దోపిడే అనుకోండి. వాళ్లు వదులుతారూ? వదర్లు. ఇదంతా మనసులో పెట్టుకోండి. పైకి అనకండి. ఎందుకొచ్చిన పీడ?"

సాంబయ్యగా రానాడు అన్నమాటలు వింటుంటే సుందరానికి ఇంగ్లీషువాళ్ళ మీదచాలా అసహ్యంవేసింది. కొన్ని పాడుపనులు చేసేవాళ్ళని చూసి అందరూ అసహ్యపడతారు. ఈ ఇంగ్లీషువాళ్లు అన్ని పాడుపనులూ చేశారు. వాళ్ళని ఎందుకు గొప్పగాచూడాలీ? సాంబయ్యగారన్నట్టు వాళ్ళ తెల్లతోలుచూసి మనం ఎందుకు గర్వపడాలీ?

ఇంగ్లీషువాళ్లనుగురించి సుందరమూ, నాగేశ్వర్రావూ చాలాసార్లు మాట్లాడుకున్నారు.

"ఈ వెధవ గవర్నమెంటుకింద పని చెయ్యగూడదురా. మా నాన్న చేస్తున్నందుకు నాకు చాలా కోపంగావుంది," అన్నాడు నాగేశ్వర్రావు. ఈ ఆలోచన సుందరానికి కలగలేదు. కాని నాగేశ్వర్రావు చెప్పినదాన్లో నిజం ఉందనిపించింది. ఈ ఇంగ్లీషు ప్రభుత్వంకింద ఎవరూ పనిచెయ్యకుండాఉంటే సరి! అప్పుడు వాళ్లేం ప్రభుత్వంచేస్తారు?

తనూ, నాగేశ్వర్రావూ కలిసి చేసుకున్న ఈ నిర్ణయంతో బ్రిటిషుప్రభుత్వం పతనమైనట్టే సుందరం సంతోషించాడు. ఆతరవాత వాడు బ్రిటిషు పరిపాలన గురించి పూర్తిగా మరిచిపోయినాడు. కొత్తగా కుంటిదొర ఒకడు స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగా వచ్చినప్పుడు కూడా సుందరానికి మళ్ళీ బ్రిటిషు పరిపాలన జ్ఞాపకంరాలేదు. ఈ దొర యుద్ధంలో గాయపడ్డవాడే. దాదాపు ఏడడుగుల ఎత్తుండేవాడు. మోటారు సైకిలుమీద స్కూలుకు వచ్చేవాడు. గుర్రంమీద తిరుగుతూ అడుక్కునే సిపాయల్లే ఈయనకు కాళ్ళు తెగిపోలేదు. రెండు కాళ్లూ ఉన్నాయి. కాని ఒకకాలు కుంటి. కుంటుతూ నడిచేవాడు. ఆయన ఇంగ్లీషు మాట్లాడితే మేష్టర్లు మాట్లాడినట్లు కాకుండా ఇంకోరకంగా ఉండేది. ఆయనకు నాలుగువందలు జీతమని ఎవరో అన్నారు.

## పన్నెండో ప్రకరణం

ప్రపంచంలో యుద్ధానంతర సంక్షోభం ఎట్లాఉన్నదీ తెలిసే అవకాశంలేక, తెలిసినా అది తమ జీవితాలను ఏవిధంగా స్పృశించేదీ అర్థంకాని పీడిత భారత ప్రజలలో చాలాతరగతులకు అవి మంచి



రోజులు. జీవితం చాలా రోజులు మంచానపడి తిరిగి కోలుకుంటున్నట్టుగా ఉన్నది.. అదివరకులేని కొత్తరకం వస్తువులూ, . బట్టలూ వచ్చాయి. జీవితంలో కొత్తచైతన్యం కనిపించింది.

సీతమ్మగారు, కొంత వ్యాపకం కోసమూ, కొంత డబ్బుఆదా చూసుకునీ దొడ్డినిండా పాదులు పెట్టింది. తూర్పు వైపు కాళీస్థలంలో ఒకపక్క గుమ్మడి పాదులు పెట్టింది. ఇంకోపక్క వేసిన పాకమీదికి సొరపాదు ఎక్కించింది. పాక వెనకవున్నస్థలంలో బెండలూ, వంగలూ పెట్టింది. బావిసమీపంలో ఆకుమళ్లు పెరుగుతోటకూరా, బచ్చలీ, మెంతీ, కొతిమేరా - వేసింది. గోరు చిక్కుడుకు చిన్ని పాదొకటి చేసింది. వీటివేటికీ సంబంధంలేకుండా పడమట వేపు పొట్లపాదుపెట్టి అది పైకివచ్చే సమయంలో దానికి పందిరివేయించింది. "పొట్లకు పొరుగుగిట్ట"దని తల్లిచెప్పగా సుందరం తెలుసుకున్నాడు.

ఇది అచ్చుగా సీతమ్మగారికిమాత్రమే తట్టిన ఆలోచనకాదు. దాదాపు ప్రతి ఇంటోనూ పాదులువెలిశాయి. అదివరకున్న ఇళ్ళలో విస్తరించాయి. జీవిత వ్యయం పెరుగుతున్నది. డబ్బులిచ్చి కూరలుకొనటమంటే ఎరగనివాళ్ళింకా జీవించివున్నారు. రెండణాలకు బుట్టెడు వచ్చే బెండకాయలు వీశె రెండణాలయాయి.

మళ్లు కట్టటం, పాదులు పెట్టటం, మొక్కలుపెంచటం, అవి కాయటం సుందరానికి చాలా ఉల్లాసంగా ఉండేది. బావిదగ్గిర తల్లి నీళ్లు తోడిపోస్తుంటే సుందరం చెంబుతో మళ్ళకు శ్రద్ధగా పొద్దునా, సాయంత్రం నీళ్ళుపోసేవాడు. కాని, ఎందుచేతో, దొడ్లోకాసిన కాయలు ఇళ్ళకు అమ్మవచ్చేకాయలంత బాగుండేవి కావు. బోలెడంత ఆవరణ ఆక్రమించిన గుమ్మడిపాదు పూలు పూసిందేగాని ఒక్క కాయకూడా వెయ్యలేదు. వంగలు ఒక కాపు బాగానే కాసి రెండో కాపుకు గిడసబారాయి. బెండలు బాగానే కాశాయి. అన్నిటికన్నా విరగ కాచినవి గోరు చిక్కుళ్లు.

"వెధవ గోరుచిక్కుడు. పైత్యమూ, వేడీనూ, గుత్తులు గుత్తులుగా ఎట్లా కాచిందో. తెలీకవేశాను," అన్నది సీతమ్మగారు. వాటి నావిడ ఎంతమందికి పందేరంచేసిందో లెక్కలేదు.

ఈ పాదులు పెట్టటంలో గల చిక్కు సీతమ్మగారు గ్రహించింది. ఎంత తక్కువగా పాదులుపెట్టినా కాచినవన్నీ తినటం అసంభవం. దొడ్లో

కాచిన పొట్లకాయలూ, బెండకాయలూ, వంకాయలూ, సొరకాయలూ, కాయ లేదుగాని కాస్తే గుమ్మడి కాయలూ, గోరుచిక్కుడు కాయలూ కలిపి తనూ పిల్లవాడూ, పిల్లా ఎట్లాతినేట్టు? వాటిని ఎవరికన్నా ఇచ్చెయ్యాలిసిందే. లేదా అమ్మాలి. కాని కూరలమ్ముకోవటం అసహ్యంకాదూ? ఇంతా కష్టపడి పండించినవేమో పందేరం చెయ్యాలి. వీటి కాపు ఏ నాలుగునెల్లకో అయిపోతే మిగిలిన ఏడాదల్లా కూరలు కొనుక్కోవలిసిందే. దొడ్లో కూరలు పండించటం ఒకందుకు మంచిదయింది. రోజూ ఇంటిల్లిపాదీ ఎక్కలొక్కనట్టు కూరలు తింటున్నారు. చిల్లర జబ్బులు తగ్గాయి.

కూరలు వాళ్ళకూ వీళ్ళకూ ఇవ్వటంకూడా సీతమ్మగారికి సమస్యగా ఏర్పడింది. బాగా ఎరిగున్నవాళ్ళకూ, బంధువులకూ ఇవ్వొచ్చు. కాని వాళ్లూ కూరలు పండించేవాళ్ళే.

ఎప్పుడూ ఇంతే. ఉన్నవాళ్ళకే పెట్టటం. పనివాళ్ళ కిద్దామంటే వాళ్ళు తినరు. అమ్ముకుంటారు. మనం అమ్ముకోవటానికి భయపడిచస్తూ వాళ్ళకిచ్చి అమ్ముకోనివ్వటం ఎట్లా? పైగా, పనివాళ్ళచేత అమ్మిస్తున్నారంటారు. ఆ జానికమ్మ అట్లాగే అమ్మిస్తుంది కూడానూ," అన్నది సీతమ్మ.

"అమ్మా, మా క్లాసులో చాలామంది బీదపిల్లలున్నారు. కూరలు వాళ్ళకిస్తే ఏం?" అన్నాడు సుందరం.

"కొంతమందికిచ్చి మిగిలినవాళ్ళకివ్వకపోతే బాగుంటుందిట్రా? అందరికీ ఇస్తే ఇంక మనకేంఉంటై?" అన్నది తల్లి.

తల్లిచెప్పినమాట సుందరానికి సబబుగానే కనపడింది.

* * *

మురికిగుంటలాగా వున్న జీవితం జలియన్‌వాలాబాగ్ కాల్పులతోనూ డయ్యర్ పేరుతోనూ ఒక్కసారిగా కదలబారిపోయింది. డయ్యర్ రాక్షసుడు. భారతీయులను కుక్కలకన్న అన్యాయంగాచూశాడు. యుద్ధం కాగానే బ్రిటిషువాళ్ళు ఇస్తామన్న స్వరాజ్యం ఎటువంటిదో వాడుచూపాడు. జలియన్‌వాలాబాగ్‌లో సభచేసే ప్రజని, పారిపోకుండా చుట్టుముట్టి కాల్చటమూ, మనుష్యుల్ని పొట్టలమీద దేకించి అవాచ్యాలకు గురిచెయ్యటమూ వింటుంటే ప్రతివాడికీ మండిపోయింది.

ఎక్కడి జలిజయన్‌వాలాబాగ్, ఎక్కడి పంజాబ్? అక్కడ జరిగిన దురంతాలు దేశాన్నంతనీ ఎట్లా కదిలించాయి? కాలమహిమ! పంజాబుకూడా భారతదేశమే; అక్కడా బ్రిటిషు పరిపాలనేఉంది. ఇవాళ అక్కడజరిగిన సంఘటనలు రేపిక్కడ జరగవచ్చు. ఇక్కడ జరక్కపోతే అది ఇక్కడి వాళ్ళ దేశభక్తి దీక్షకు కళంకమవుతుందేమోగాని బ్రిటిషువాళ్ళ మంచితనానికి నిదర్శనంమటుకు కాదు. ఈ దృష్టి చదువుకున్నవాళ్ళందరికీ పూర్వంకంటె ఇప్పుడు బాగా ఏర్పడింది.

రౌలట్‌చట్టం, సత్యాగ్రహం, జలియన్‌వాలాబాగ్, కాల్పులు, డయ్యర్

అనే మాటలు సుందరం విన్నాడేగాని ఈ సంఘటన వెనకవున్న రాజకీయాలు సుందరం ఎరగడు. అయినా ఈ సంఘటనవల్ల వాడిలో ఏదో వికారంకలిగింది. తొమ్మిదేళ్ళు నిండిన సుందరం ఈ సంసంఘటనను తాత్వికంగా అవగాహన చేసుకోవటానికి ప్రయత్నించాడు. అధికారంలో వున్నవాళ్ళు ఇటువంటి పనులు ఎట్లాచేస్తారు? ఎందుకుచేస్తారు? మనుష్యులకు ఎరగని మనుష్యులమీద అంత ఆగ్రహం ఎట్లావస్తుంది? దొంగతనంచేసినవాణ్ణి పోలీసులు పట్టుకోవచ్చు. ఖైదులోపెట్టవచ్చు; కాని సభచేస్తున్న వాళ్ళను చేతులారా ఎట్లా కాలుస్తారు? ఈసంగతి ప్రపంచానికంతా తెలుస్తుందని వాళ్ళకు తెలీదా? ఈ ప్రశ్నలు వాణ్ణి బాధించాయి. చెడ్డతనమూ, చెడ్డబుద్ధులూ అనేవి చదువుకున్న వాళ్ళలోనూ, ఉద్యోగాలు చేసేవాళ్ళలోనూ, అధికార్లలోనూ ఉండవనీ, తక్కువకులాల వాళ్ళలోనూ, కూలినాలి చేసుకునే అలగాజనంలోనూ, మర్యాదలేకుండా జీవించే బిచ్చగాళ్లు, రౌడీలు మొదలైనవాళ్ళలోనూ మాత్రమే ఉంటాయనీ సుందరానికి భ్రమఉండేది. ఆ భ్రమ ఒకంతట వదిలేది కాదు; అయినా బాగా దెబ్బతిన్నది.

* * *

సుందరం సీతప్పగారి క్లాసులోకి వచ్చాడు. సీతప్పగారు స్కూలు పెట్టినప్పటినుంచీ ఉన్న మేష్టరు. అప్పుడిది హైస్కూలుకాదు. మిడిలిస్కూలు. ఇప్పుడున్నచోట ఉండేదికాదు, దయ్యాలమర్రిదగ్గిర ఉండేది.

స్కూల్లోఉండే మేష్టర్లందర్లోకీ మెత్తనివాడు సీతప్ప. పిల్లల్ని "ఏమయ్యా" అని పిలిచేవాడు. సాంబయ్యగారల్లేనే ఈయనా దేశభక్తిపరాయణుడు, ఆయితే ఆదర్శవాది. ఎప్పుడూ బ్రిటిషువారిని తిట్టేవాడు కాడు. బ్రిటిషువాళ్ల మీది కోపంకొద్దీ సాంబయ్యగారు క్రాపు తీసేసి గుండుచేయిస్తే సీతప్పగారు ఎప్పుడూ సనాతనధర్మాన్నే అనుష్ఠించేవాడు. మత గ్రంథాలమీదా వేదాంత గ్రంథాలమీదా ఆయనకు చాలా ప్రీతి. ముఖ్యంగా ఆయనకు భగవద్గీత అంటే చాలా ఇష్టం.

ఒకరోజు సీతప్పగారు క్లాసులోకి అడుగుపెట్టటమే విచారంగా అడుగుపెట్టాడు. ప్రార్థన కాగానే ఆయన అటెండన్సుకూడా తీసుకోకుండా చాలా ఖిన్నుడైపోయి, "చాలా గొప్పవాడు పోయినాడయ్యా!" అన్నాడు.

"ఎవరండీ పోయిందీ?" అన్నారు విద్యార్థులు.

"బాలగంగాధరతిలక్. మహానుభావుడయ్యా! అవతారపురుషుడు. ఆయన పోవడం దేశానికి పెద్దదెబ్బ. అటువంటి మహానాయకుడు దేశానికి మరి దొరకడు. గాంధీ అని ఇంకో ఆయన ఉన్నాడు గాని—ఎబ్బే. తిలక్ మహాశయుడి కెవ్వరూ చాలరు. 'యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం' అంటూ చచ్చిపోయినాడు! మహానుభావుడు, మహానుభావుడు! ఇవాళ నిజంగా బడికి శలవివ్వటం

ధర్మం," అని విద్యార్థులకు చెప్పాడు సీతప్ప.

ఇదే సాంబయ్యగారైతే, ఈ తిలక్ ఏంచేశాడో, ఎందుకు గొప్పవాడో పిల్లలకుచెప్పి, ఏదోవిధంగా బ్రిటిషువాళ్ళను తిట్టిఉండేవాడే. సీతప్పగారి విచారం చూసి పిల్లలు విచారపడ్డారేగాని తిలక్ గారివిగురించి వాళ్లు తెలుసుకున్నదేమీ లేదు.

ఆపీరియడ్ సీతప్పగారు పాఠం చెప్పలేదు, అటెండన్సు తీసుకోలేదు. పిల్లలతో జాస్తిగా మాట్లాడనూలేదు. విచారసముద్రంలో మునిగిపోయినాడు.

అదృష్టవశాత్తూ ఆరోజు బడికి శలవని నోటీసు రానేవచ్చింది కొంత సేపటికి....

ఆరోజు సెలవురావటంతప్ప తిలక్ మహాశయుడి చావువల్ల చెప్పుకోదగిన వింతలేవీ జరగలేదు. జీవితపు మురికిగుంటలో ఒక చిన్న అలవచ్చి మాయమయింది. మళ్లీ పాచి దాన్నికప్పేసింది. దానికింద యథాప్రకారంగా బడీ, హోంవర్కూ, పరీక్షలూ, మార్కులూ, పాఠాలూ, మేష్టర్లు పిల్లల్ని కొట్టటమూ, మెత్తని మేష్టర్లను పిల్లలేడిపించటమూ జరుగుతూ పోయింది.

మేష్టర్లందరిలోకీ తెలుగు మేష్టర్లు లోకువ. ఇది అనాదిగావస్తున్న ఆచారం. వాళ్ళకి ఇంగ్లీషురాదు. రాని ఇంగ్లీషు మాట్లాడకుండా వుండరు. పిల్లల్ని భయపెట్టలేరు. పిల్లలు మరీ పెచ్చుమీరిపోతే హెడ్మాష్టరుకు రిపోర్టిస్తారు. హెడ్మాష్టరు పేంబెత్తంతో నాలుగు తంతాడు. ఆతరవాత తెలుగుమేష్టరుకు పశ్చాత్తాపం పట్టుకుంటుంది. పిల్లలు మరింత ఆకతాయితనం చేస్తారు. ఇన్స్పెక్టరు వస్తున్నాడంటే తెలుగు మేష్టర్లకి హడలు. వాళ్లకి హెడ్మాష్టరన్నా హడలే.

అందరు పిల్లలల్లేనే సుందరానికి కూడా కొందరు మేష్టర్లంటే ఇష్టమూ, కొందరిపైన నిర్లక్ష్యమూ, మరికొందరిమీద అసహ్యమూ వుండేది. అయితే ఏ విద్యార్థికూడా ఇటువంటి అభిప్రాయాలు తన స్వంతమని చెప్పలేదు. ఈ అభిప్రాయాలు విద్యార్థుల్లో ప్రచారమవుతాయి, కాని వీటివెనక ఆధారం ఉండకపోదు. స్కూలు కమిటీవారు ఏటా రహస్యబాలట్ ఏర్పాటు చేసేటట్టయితే ఉపాధ్యాయుల్లో నిజంగా పనికివచ్చేవాళ్ళెవరో, బొత్తిగా పనికిరానివాళ్ళెవరో సులభంగా తేలిపోతుంది. కాని ఆపనిచెయ్యాలని ఎవరికీతట్టలేదు.

సుందరానికి చదువు బాగాచెప్పే మేష్టర్లంటే ఇష్టం. వాళ్లు కొట్టేవాళ్ళయినా వాడికి అభ్యంతరంలేదు. కాని పాఠాలు సరిగాచెప్పలేని మేష్టర్లు ఎంత మంచివాళ్ళయినా, సాధువులైనా వాడికి కాటే ఇష్టంవుండేదికాదు.

సీతప్పగారి సెక్షనులో ఉండటానికి సుందరానికి మనస్కరించలేదు. సీతప్పగారు పాఠాలు సరిగా చెప్పకపోవటం ఒకటేకాదు. నాగేశ్వర్రావు ఇంకో సెక్షనులో పడ్డాడు. అందుచేత సుందరం తానుగూడా ఆ సెక్షనుకేపోతానని సీతప్పగారిని అభ్యర్థించాడు. ఆ సెక్షనునుంచి ఈ సెక్షనుకు రాగోరే కుర్రవాణ్ణికూడా

సుందరం చూపించాడు. అయితే ఆకుర్ర వాడికి కిందపేడు మంచిమార్కులు రాలేదు. సుందరం చాలా మంచిమార్కులతో పాసయినవాడు. అందుచేత సీతప్పగారు మార్పుకు ఒప్పుకోలేదు. అయితే అదృష్టవశాత్తూ ఒకటిజరిగింది. ఆయేడు సెకండుఫారంలోకి విద్యార్థులు విపరీతంగా వచ్చిపడ్డారు. ఒక్కొక్క సెక్షను లోనూ యాభయ్యేసిమందిదాకా తయారయినారు. అందుచేత అయిదోసెక్షను ఏర్పాటుచెయ్యవలిసి వచ్చింది. సుందరమూ, నాగేశ్వర్రావూ కూడా ఈ కొత్త సెక్షనులోకి వెళ్లారు.

అయినా సుందరం గుండె పిచపిచలాడుతూనేవుంది. కొత్తమేష్టరు ఇదివరకల్లా ఫస్టుఫారానికి మాత్రమే చెప్పినవాడు, సెకండుఫారానికి చెప్పగలడా అని. ఈ భయం మొదటిరోజునే పోయింది. సీతప్పగారికన్న ఈయన పాఠాలు చాలాబాగా చెప్పేవాడు.

* * *

తిలక్ మహాశయుడి చావుగురించి జనం మరిచారోలేదో గాంధీ ముందుకువచ్చి సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాడు. ఎవరినోటవిన్నా గాంధీపేరే, సత్యాగ్రహమన్న మాటే.

తిలక్ చావునుగురించి విన్నప్పుడే సుందరం గాంధీపేరుకూడా వినిఉన్నాడు. గాంధీనిగురించి ఇప్పుడింకా చాలావిషయాలు తెలిశాయి. తిలక్ పొయ్యేటప్పుడు గాంధీ దగ్గిరేవున్నాట్ట. జాతీయోద్యమాన్ని గాంధీకి వప్పగించి తిలక్ ప్రాణంవిడిచాట్ట. గాంధీచెప్పే కొత్తపద్ధతుల్లో ఒకటి స్వదేశీ ఉద్యమంతోబాటు విదేశవస్తు బహిష్కారం. ఇంగ్లీషు వాళ్లు వర్తకంతో ఇండియాను దోస్తున్నారు. ఈ దోపిడికోసమే ఇక్కడ పరిపాలన తతంగమంతానూ. మన దేశంలో వాళ్ళ వస్తువులను ఎవరూ కొనకుండా మానేస్తే వాళ్ళరోగం కుదిరిపోతుంది. ఏటా ఎన్నో కోట్లరూపాయల సరుకులు ఇంగ్లండునుండి ఇండియాకు దిగుమతి అయి అమ్ముడుపోతున్నాయి. వాటిని కొనటం మానాలి. ముఖ్యంగా విదేశీ వస్త్రాలు బహిష్కరించాలి. అందరూ నూలువడికి నేయించుకుని ఆ బట్టలే కట్టాలి. అదే ఖద్దరు. అదే స్వదేశీ దీక్షావస్త్రం....

ఒకనాడు సుందరం, నాగేశ్వర్రావూ స్కూలుకువచ్చేసరికి అక్కడ పికెటింగు సాగుతున్నది. వందలకొద్దీ విద్యార్థులు గేటుబయట నిలబడివున్నారు. పికెటర్లు వాళ్ళని లోపలికి పోవద్దని నయానా భయానా నివారిస్తున్నారు. పికెటింగు చేసేవాళ్ళు విద్యార్థులుకారు. కాని చాలా పెద్దవాళ్ళూ కారు.

ఒకాయన సైడుకాలవ కల్వర్టుమీద నుంచొని ఉద్ఘోషిస్తున్నాడు.

"ఒరే అబ్బాయిలూ, మీరెవరూ స్కూలుకు పోనక్కర్లేదు. స్కూళ్ళు మానమని గాంధీ చెప్పాడు. ఆమాటే నేనూ మీకుచెబుతున్నా....ఇదుగో, అభిమానం ఉన్నవాళ్ళెవరూ లోపలికి పోకండి. సిగ్గుమాలినవాళ్ళు పోతే పోవచ్చు, నే వొద్దన్ను. మీరెవరూ వెళ్ళకపోతే పాఠాలు జరగవుటా, పిచ్చి





వాళ్ళల్లారా! రెండు మూడురోజు లాగారంటే జాతీయ కళాశాల పెడుతున్నాం. అందులోకివచ్చి నిజమైనచదువు చదువుదురుగాని."

మేష్టర్లు మాత్రం లోపలికివెళ్ళారు. పిల్లలు దాదాపు ఎవరూ వెళ్ళలేదు. దాదాపు పదకొండు గంటల ప్రాంతాల సుందరం నాగేశ్వర్రావుతో కలిసి ఇంటికి తిరిగిపోయినాడు.

శ్రీరామ్మూర్తి స్నేహితులంతా చేరారు. వాళ్ళలో ఒక్కడూ స్కూలుకు వెళ్ళలేదు. వాళ్ళంతా ఉద్రేకంగా మాట్లాడుకునే విషయాలన్నిటినీ సుందరం శ్రద్ధగా ఆలకించాడు. ఈ చదువుపద్ధతి ఇంగ్లిష వాళ్ల కావాలని తెచ్చిపెట్టారు. ఇంకోభాష నేర్చుకుంటేగాని ఉద్యోగాలు దొరకని పద్ధతి భూప్రపంచంలో ఎక్కడాలేదు. ఇంగ్లీషువాళ్ళు ఇండియాలో తెచ్చి పెట్టారు. ఎందుకూపనికిరాని చదువు ప్రవేశపెట్టారు. నూటికి తొంభైతొమ్మిది మంది ఏవోవృత్తులు చేసుకునే వాళ్ళయితే దేశంలో వృత్తివిద్యలు లేకుండాచేశారు. చరిత్రనిండా అబద్ధాలు రాశారు. చదువు బహిష్కరించాలిసిందే.

అట్లాగే విదేశ వస్తువులు కూడా బహిష్కరించాలి. అవి లేకుండా మనం గడుపుకోవాలి. మంచో చెడో మన దేశంలో తయారయేవే కొంటే దేశంలో ఉండే డబ్బు దేశం దాటిపోకుండా ఉంటుంది. ఆతరవాత ఇంగ్లీషువాళ్లు మనల్ని దోచుకోలేరు. ఈ విషయాలు సుందరం విన్నాడు, అర్థంచేసుకున్నాడు. ఇవి వాడికి క్రొత్తవిషయాలే అయినా తెలియదగిన విషయాలల్లే కనిపించాయి.



స్కూలుముందు రోజూ పికెటింగు సాగుతూనేఉంది. సుందరానికి ఒకటే సందేహం కలిగింది. ఇట్లా ఎన్ని రోజులు సాగుతుంది? ఎప్పుడో ఒక నాడు పికెటింగు మానరా? ఆతరవాత మళ్లీ స్కూలు యథావిధిగా సాగదా? అని!

అయినా సుందరం పికెటింగు జరిపే వాళ్ళ పక్షాన్నే ఉన్నాడు. స్కూలూ, హెడ్మాష్టరూ, మేష్టర్లూ జాతీయోద్యమానికి శత్రువులుగా వాడికి కనపడ్డారు. పికెటింగు లక్ష్యపెట్టకుండా లోపలికి వెళ్లి కాళీక్లాసుల్లో కూర్చున్న యాభై, అరవై మంది విద్యార్థులూ స్వార్థపరుల్లాగానూ, పిరికివెధవల్లాగానూ కనిపించారు.

మొదటి రోజుకంటె రెండో రోజు తక్కువమంది విద్యార్థులు క్లాసులకు వెళ్లారని విని సుందరం సంతోషించాడు. మూడోరోజు రెండువందల మందిదాకా వెళ్ళారని విని ఎందుకో భయపడ్డాడు. ఎవ్వరూ స్కూలుకు వెళ్ళరాదని సుందరం కోరాడేగాని, ఎవరు బడికి పోయినా తాను పోకూడదన్న నిర్ణయం సుందరం చెయ్యలేదు. అదీకాక క్లాసులు నడిచి తాను వాటికి హాజరుకాకుండా ఉండటం సుందరాని కెంతమాత్రమూ ఇష్టంలేదు.

పికెటింగు నిరసించేవాళ్ళపక్షంకూడా సుందరం విన్నాడు. ఇంటో ఆడవాళ్లకు ఆదినారాయణ చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

"వీళ్ళమొహం పికెటింగు! రెండు రోజులు పికెటింగుచేసి మూడోరోజు మానేస్తారు. స్వరాజ్యం రావటానికి పిల్లలు చదువులు మానుకోవాలా? అందరూ చదువులుమాని బడుద్ధాయిలైతే స్వరాజ్యంవచ్చేసి చదువురాని వాళ్ళకి ఉద్యోగాలొస్తాయికాబోలు. ఏమిటో!"

ఆదినారాయణగారు ఈమాట అన్న మర్నాడే ఊళ్ళో జాతీయ విద్యాలయం మంత్రపూర్వకంగా శంఖుస్థాపన జరిగింది. హైస్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులిద్దరు అందులో ప్రవేశించారు కూడానూ. విద్యాలయం ప్రారంభమైన రోజు ఉదయం సుందరం అక్కడికి వెళ్ళాడు. పెద్ద పందిరివేశారు. భజంత్రీలు వాయించారు. అనేక వందలమంది అక్కడచేరారు. వాళ్ళలో చాలావరకు స్కూలుకువెళ్ళని విద్యార్థులే. బ్రాహ్మడు మంత్రాలు చదివాడు. బరంపురం వంగపండు పట్టుపట్టలు కట్టుకుని ఎర్రగా, అందంగావుండే ఒకాయన అదావుడిగా అటూఇటూ తిరుగుతూ పెత్తనంచేశాడు. ఆయన దగ్గిరాల గోపాలకిష్టయ్యని సుందరానికి ఎవరో చెప్పారు.


ఆ సాయంకాలం అక్కడే మీటింగు. ఇసకవేస్తే రాలకుండా జనం మీటింగుకు వచ్చారు. కొండా వెంకటప్పయ్యా, ఇంకా ఎవరెవరో మాట్లాడారు. కాని ఎవరు మాట్లాడినా దుగ్గిరాల గోపాల కిష్టయ్య మాట్లాడినట్టులేదు. ఆయన మాట్లాడుతుంటే వినేవాళ్లు పరవశమై పోయినారు.

"....అయితే ఇంగ్లండంటే ఏమిటనుకున్నారు. మన మద్రాసు రాజధానంత కూడాలేదు. మనమంతా వెళ్ళి ఉచ్చపోస్తే మునిగిపోతుందన్నమాట. నే చూసేవచ్చాలే!"

పిల్లలంతా గొల్లున నవ్వటం. నిజంగానే దుగ్గిరాల గోపాలకిష్టయ్య ఇంగ్లండులో చాలాకాలం వుండివచ్చాట్ట. అటువంటివాడే బ్రిటిషువాళ్ళ పరిపాలన దగా అని చెబుతున్నాడు. ఇంత గొప్పవాళ్ళు జాతీయోద్యమంలోకి వస్తున్నారంటే ఇంకేంకావాలి?

సుందరానికి ఉపన్యాసాలన్నీ అర్థం కాకపోయినా వాటిని ఎంతో భక్తితో విన్నాడు. ఇంత వైభవంగా ప్రారంభమైన ఈస్కూల్లో చేరకుండా ఇంగ్లీషువాళ్ళకు ఎదురుతిరగలేని ఆ పాత స్కూల్లో చదవటం ఘోరమైనతప్పు. పిరికితనం, గాంధీకీ, దుగ్గిరాల గోపాల కిష్టయ్యకూ, కొండా వెంకటప్పయ్యకూ మిగిలిన వాళ్ళకూ కూడా ఎంతో అన్యాయం!

"ఏంరా, పీయెన్నార్? మనంకూడా రేపటినుంచీ ఈ జాతీయ విద్యాలయంలో చేరదాం?" అన్నాడు సుందరం.



నాగేశ్వరరావు అటే ఉత్సాహం కనబరచలేదు.

"ఈ క్రొత్తబడి నాలుగు కాలాల పాటు నడిస్తే అప్పుడు చూడొచ్చు లెమ్మన్నాడ్రా మానాన్న." అన్నాడు వాడు.

అదికూడా బాగానే ఉందదనుకున్నాడు సుందరం. ఒకవేళ ఈబడి సాగదేమో అనే ఆలోచన వాడికి రానే లేదు. ఈబడి ఎట్లాగూ సాగుతుంది. అటువంటప్పుడు ఎప్పుడుచేరితేనేం? ఈవిధంగా వాడు తన అంతరాత్మను సమాధానపరుచుకున్నాడు.

కాని నాగేశ్వరరావు అన్న శ్రీరామ్మూర్తి మాత్రం తండ్రిసలహా వినిపించుకోకుండా బడి మానేశాడు. లేకపోతే అతను ఆమేడు స్కూలుఫైనలు పాసై ఉండవలిసింది.

పికెటింగు అడాపుడి తగ్గి మళ్ళీ స్కూలు యధాప్రకారం నడవటం ఆరంభించేసరికి సుందరం క్లాసులోవాళ్లు


ముగ్గురునలుగురు చదువు చాలించినట్లు తెలిసింది. అందులో ఒకడు సుందరానికి కనపడి, తాను ఇక ముందు తమ స్వగ్రామంవెళ్ళి సంస్కృతం చదవ బోతున్నానని చెప్పాడు. వాడికేం? వాడికి బోలెడంత ఆస్తి ఉంది. చదువుకున్నా వాడు ఉద్యోగంచెయ్యడు.

రోజులు గడుస్తున్నాయి. దాదాపు రోజూ ఊళ్లో దుగ్గిరాల గోపాలకిష్టయ్య ఉపన్యాసాలిస్తూనే ఉన్నాడు. సుందరం వాటికోసం పోతూనేఉన్నాడు. ఏవో సరదాకబుర్లుచెబుతాడు గోపాలకిష్టయ్య. "....అబ్బాయిలూ, శ్రీ కృష్ణపరమాత్మ అర్జునుడికి భగవద్గీత చెప్పినట్టు నేనూ చెబుదును. కాని ఇప్పుడు ప్రైములేదు. అందుచేత నేను మీకు చెప్పేదల్లా ఏమంటే.... ఇది పాత ఉద్యమాలల్లే ఆగేదికాదు. ఈసారి స్వరాజ్యం తెచ్చామన్నమాటే....మీరు ఈ దేశద్రోహకరమైన చదువు మానేసి నిజమైన జాతీయ విద్య నేర్చుకోండి...."

కొంతకాలం గడిచింది.

ఒకనాటి సాయంకాలం సుందరం, నాగేశ్వర్రావూ జాతీయ విద్యాలయం మీదుగా పెద్దబజారు పోతూ లోపలికి వెళ్ళారు. సుందరానికి పెద్ద ఆశాభంగమయింది. పందిరిలేదు, జనంలేరు. పెళ్ళిల్లు కళలేదు. అది నిజంగా జాతీయ విద్యాలయంతప్పు కాదు. అయినా సుందరాని కదేదో లోపంగా కనిపించింది. విద్యాలయంలో ఏడెనిమిదిమంది విద్యార్థులుమాత్రమే కనిపించారు. ఇద్దరు ముగ్గురు రాటాలమీద నూలుతీస్తున్నారు. ఒకడు ఏకులుచేస్తున్నాడు. ఇంకొకడు నవారు నేస్తున్నాడు. మిగిలినవాళ్ళు తాటాకుచాపలమీద గోడకు చేరగిలబడి కూర్చున్నారు. ఒక్క మేష్టరూ కనిపించలేదు. హైస్కూలునుంచి వచ్చి చేరిన ఇద్దరు మేష్టర్లలోనూ ఒకాయనమాత్రమే ఇంకా పనిచేస్తున్నాడనీ, రెండో ఆయనా, పైనుంచివచ్చిన మరి ఇద్దరు మేష్టర్లూ సరిగా రావటంలేదనీ, జాతీయ విద్యాలయానికి డబ్బులేదనీ తెలిసింది.

(సశేషం)






"అబ్బబ్బ! వాకిట్లో నుంచోని నుంచోని కాళ్ళు లాక్కుపోతున్నై. వీధిలోకి చూచీచూచీ కళ్లు కాయలుకాచిపోతున్నై. ఎందుకులే! నాకిబిడ్డలు మంచికిపుట్టలా. నాకేమో అప్రతిష్ఠకే నలుగురి చేత నాలుగు మాటలు అనిపించుకోటానికే దేవుడు వీళ్ళకి బుద్ధులు పుట్టిస్తున్నాడు. ఏమిరా మొద్దు? ఇద్దరువాకిట్లో ఆడుకుంటూ ఆడుకుంటూ నేవుంటిరి వాడెటుపోయింది నీకెట్లా తెలియలేదురా? గుడ్లు పత్తికాయల్లాగ పెట్టుకుచూస్తాడు చూడు" అని అంటూ పెద్దకుమారుని బుగ్గలు సాగదీసి స్తంభాని కానుకూర్చుంది బేగమ్.

"కాదమ్మా! మేమే గోలీలాడుకోటానికని నే నేమో గుంటలు తొవ్వుతున్నాను. వాడెప్పుడు పోయినాడో నేను చూడలేదమ్మా" అన్నాడు బేగమ్ పెద్దకుమారుడు.

"గుంటలు తవ్వుతున్నావా గోతులు తవ్వుతున్నావా? గుంటలు తవ్వుతుంటే మాత్రం నిన్ను మరిపించి వాడుపోయాడు గాని వాణ్ణి మరిపించి నీవు పో మరి చూస్తాను. వాడికున్న తెలివితేటల్లో నీకెన్నోవంతున్నవిరా. ఏంభాగ్యంలే! వాడికి తెలివితేటలున్నవని వాడివల్ల సుఖం కనపడటంలేదు. నీవు చెప్పిన చోటవుంటావని నీవల్ల సుఖం కనపడటం లేదు" అని బేగమ్ అంటూవుండగానే మొదట దర్వాజా పట్టుకునీ తరువాత గోడ పట్టుకునీ అడుగులో అడుగు వేసుకుంటూ పిల్లిలాగా వస్తున్నాడు హుమయూ.

"ఎవఁ్రావాడు? నీవేనటరా నీగుండెలు తియ్య! నీకెంత ధైర్యం వచ్చిందిరా! వచ్చా! ఇక ఇవాళతో అఖరయ్యావేమో ననుకుంటున్నా. ఇంకా కాసేపు తిరిగి రాకపోయినావా అప్పుడే వచ్చావేం? ఎక్కడకు వెళ్ళా? ఇంత ప్రొద్దుపోయిన దాకా ఎక్కడ తిరిగివచ్చావురా?" అంటూ లేచిపోయి హుమయూ చెవ్వుపట్టుకుంది బేగమ్. "ఆడుకుంటున్నా" అన్నాడు హుమయూ.

"ఆడుకుంటున్నావా? ఎక్కడ ఆ ఆటలు? నాకు చెప్పకుండా వాకిలి దాటి వెళ్ళవద్దని చెప్పానా లేదా?" అని అంటూ హుమయూ రెండుచెంపలూ

వట్టికొండ విశాలాక్షి

వాయించింది బేగమ్. హుమయూ గుడ్ల నీళ్లు కుక్కుకున్నాడు.

"నేనా బయటకు పోయే మనిషిని కానైతిని. వాడా వాడికీ ఇంకా తూర్పు పడమర తెలియదాయె. నిన్ను వెదకి పట్టుకురావటానికి ఎవరున్నారని చెప్పు? పోనీ మామనన్నా పంపుదామా అంటే వాడు వూళ్ళో లేడాయె. సరీగా ఇట్లాం టప్పుడే నీకు వుట్టుతుందాయెగుణం. ఈ పరిస్థితుల్లో మీరు సరిగ్గావుంటే సరిగాని లేకపోతే మీకే కొంచెం హెచ్చుతగ్గు వచ్చినా నలుగురూ నన్నే నిందిస్తారు. 'అయ్యే లేక పోయే టప్పటికి అమ్మ పెంపకం చూడు ఎట్లా వుందో' అని నన్నే ఆడిపోసుకుంటారు లోకులు. లోకంసంగతి అట్లా వుంచి ముందు మీరు బాగుంటేనేతప్ప లేకపోతే నాకు మాత్రం ఇంకేముంది? ఇవాళ మళ్ళీ స్టేషనువైపేమైనా వెళ్ళావా?"

"లేదమ్మా."

"ఎక్కడికెళ్ళావుమరి?"

"ఆడుకుంటున్నా."

"ఎక్కడా ఆటలు?"

"ఇవాళ చాలాదూరంవెళ్లి ఆడుకొచ్చా నమ్మా."

"ఇవాళకు ఎట్లాగో అయిపోయింది గాని మరొకసారి ఇలా నాకు చెప్పకుండా చెయ్యకుండా బయటకువెళ్ళావా అంటే కాళ్ళురెండూ విరగ్గొట్టి పడవెయ్యటమే తెలిసిందా? కాళ్లు కడుక్కునిరా అన్నం తిందువుగాని. నీదుంపతెగ నీ వేమై పోయావో అని ఇంతవరకు ఒక్కళ్ళకు కూడా అన్నంపెట్టలా వండినతప్పేల వండినట్లు అపాట్నవుంది. తొందరగా కానీ అన్నాలు తిని పడుకుందాం."

"నాకు అన్నంవద్దు ఏమీవద్దులే."

"వద్దూ! ఏంకావాలి? అర్ధరాత్రివరకు వూళ్ళో తిరగనివ్వాలా? తొందరగాలే, మళ్ళీ దెబ్బలు తినకు" అంటూ అన్నాలు పెట్టింది. హుమయూ ఇష్టంలేకుండానే అన్నం తిన్నాడు. అంతా ఎక్కడివా ళ్ళక్కడ పడివున్నారు. హుమయూకి మాత్రం నిద్రపట్టటంలేదు. గంట పది కొట్టింది. సరీగ్గా ఆవేళప్పుడే హుమయూ తండ్రి తలుపుతట్టుతూ పెద్దకుమారుని పేరుతో పిలిచేవాడు. హుమయూతల్లివెళ్లి తలుపుతీసేది. ఒకొకసారి ఆమెకు నిద్ర తెలియకపోతే హుమయూయే తల్లిని లేపేవాడు అమ్మా నాన్న వచ్చారని. అదంతా హుమయూకి జ్ఞాపకం వచ్చే టప్పటికి ఏదో పకి దిగులుగా కూసింది. వాకిట్లో పందిరికి అల్లుకొనున్న ఐటానీ తీగెలసందుల్లోనుంచి వాళ్ళనాన్న తొంగి చూస్తున్నట్లుగా వుంది. అలా ఎన్నివస్తువు ల్లోనో ఎన్నిసార్లో వాళ్ళనాన్న కనపడు తున్నట్లుగానే వుంటాడుగాని నిజంగా కనపడటంలేదు.

"అమ్మ ఎప్పుడూ ఇట్లాగే కొడుతూ వుంటుంది. నాన్నవుంటే ఎంతబాగుం డేది. నాన్న ఎప్పుడు కొట్టేవాడుకాడు. నాన్న ఎంతమంచివాడు. అమ్మ ఏమిటో అంటుంది అదేమిటో నాకు తెలియదు.



" నువు చేసేపని మంచిదికామ్మా! ఇంతమందిపిల్లలుంటే
ఈ రోజుల్లో అన్నం ఎక్కడినుంచి పెడతావు?"

నే నేదో చెప్పాలనుకుంటాను. అమ్మకు తెలిసేటట్లుగా చెప్పలేను" అని అనుకున్నాడు. నిజంగా బేగమ్ చెప్పేదేమిటో హుమయూకి హుమయూ చెప్పేదేమిటో బేగమ్‌కి తెలిస్తే హుమయూ ఇట్లా దెబ్బలు ఎందుకు తినవలసివస్తుంది? ఇట్లా ఇంటికిరావటం ఆలస్యమైనరోజు నిజం చెప్పినా దెబ్బలే అబద్ధం చెప్పినా దెబ్బలే. రెండూ చెప్ప చూచాడు. రెండు సార్లూ దెబ్బలే తిన్నాడు. ఇకమీదట ఏమిచేయాలో తోచటంలా హుమయూకి.

"ఆడుకోటానికి పోయినానంటే కొట్టొచ్చు. నాన్నకోసం పోయినానన్నా అమ్మకెందుకో అంతకోపం వస్తుందాయె. కోపమే కాదు ఒకొకసారి ఏడుస్తుంది కూడా" అని అనుకునేటప్పటికి హుమయూకి దిగులుగా వుంది.

"ఓరి పిచ్చితండ్రి! నాన్న ఎక్కడున్నాడని వెతకటానికి పోయినావయ్యా! నాన్నలేరు. మనకు దొరకరు. ఇంకెప్పుడు ఆలా ఎక్కడికీ వెళ్ళబోకు" అని ఎన్ని సార్లో బుజ్జగించి చెప్పింది బేగమ్. ఐనా హుమయూకి మాత్రం అట్లా అనిపించటంలా.

"నాన్నలేక ఏమౌతారు? చిన్నచెల్లాయికైతే ఏమీ తెలియదుగాని పెద్దచెల్లి మాత్రం రోజుకొకసారైనా 'అమ్మా నాన్న ఏడీ' అని అడుగుతూవుంటుంది. 'నాన్న


పూరికి వెళ్ళారని చెపుతుంది అమ్మ. నాకేమో నాన్న లేనేలేరని చెపుతుంది. నేనొకసారి అన్నతో నాన్న ఎప్పుడో చాలా రోజులకి వస్తారు అని అంటే, 'నాన్నరారు. మనతమ్ముడు చాంద్‌పాషా వచ్చాడా నాన్న రావటానికి!' అంటాడు అన్న. చాంద్‌పాషా రాకపోతే రాకపోవచ్చేమో కాని నాన్న ఎట్లా రాడు! నాన్న డ్యూటీ నుంచి వస్తూ ఎన్నిపళ్లు తెచ్చేవాడు! నాన్న రాకపోతే అవన్నీ ఎవరు తెస్తారు మరి! నాన్న ఇంటికిరాగానే ముందు మా అన్నయ్యకు నాకు నీళ్లుపోసి ఉతికిన చొక్కాలు తొడిగి అత్తరు రాసేవాడు. అవన్నీ ఎవరు చేస్తారు మరి! నాకు రోషం తెప్పించి నన్ను తనమీద కలపడే ట్లుగా చేసి నాకు పోరాటం నేర్పుతూ వుండేవాడు. అదంతా ఎవరు నేర్పుతారు నాన్న లేకపోతే" అని అనుకుంటూవుంటే వాళ్ళనాన్న ఎదుటవున్నట్లేవుంది హుమ యూకి. వాళ్ళనాన్న ఏవైనా సరుకులు కొనటానికి బజారుకు వెలుతూవుంటే ఇద్దరుకొడుకులు వెనకమాల చొక్కా చెరగులు చెరొకక చెరుగు పట్టుకుని నడుస్తూవున్నాగాని కాదని కసిరి ఇంటికి పంపలేక అలాగే ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వెంటబెట్టుకెళ్ళి తీను కొస్తూవుండేవాడు. అట్లాంటి వాళ్ళనాన్న తమను వదలిపెట్టి ఎక్కడికీ పోడనీ, ఎప్పుడో ఒకరోజు తప్పకుండా వస్తాడనీ హుమయూ ఆశ.

"నాన్న ఎక్కడున్నదీ తెలియదుగదా! అసలు నాన్న ఎక్కడికి వెళ్లాడో! డ్యూటీకి వెళ్ళాడా! కాదు ఎక్కడికీ వెళ్ళలేదు. డ్యూటీకి వెళ్లేటట్లైతే కాకీడ్రెస్సువేసుకుని అదొక రకమైన టోపీపెట్టుకునివెళ్లేవాడు. నాన్న అలా ఎక్కడికి వెళ్తున్నా నేను వస్తానని ఏడుస్తూ వెంటపడుతూవుంటే అమ్మ నన్ను బలవంతాన గదిలోకినెట్టి గొళ్ళెంపెట్టేది. కాని ఆరోజుమాత్రం నాన్న కాకీడ్రెస్సు అదీ ఏమీవేసుకోలేదు. బూట్లుకూడా తొడుక్కోలేదు. అసలు తనంతట తను నడిచేపోలేదు. నిద్ర పోతున్న నాన్నను మామయ్యా వాళ్లంతా కలసి పెట్టెలోపెట్టి గుడ్డకప్పి మోసుకు వెళ్ళారు. నాన్న ఎక్కడికైనా పోతూంటే నేను ఏడ్చేవాడినికాని అమ్మ ఎప్పుడూ ఏడ్చేదికాదు. ఆరోజు ఎందుకో అమ్మ ఏడుస్తూ ఏడుస్తూ కిందకూడా పడి పోయింది. నాన్నను అలా తీసుకుపోతూ వుండటం, అమ్మ అలా కిందపడిఏడ వటం అదంతా చూస్తూవుంటే నాకు ఏడుపువచ్చింది. అంతకుముందు నాన్న ఎక్కడికైనాపోతుంటే ఏడవటం ఏడవా ల్నని అనుకోని ఏడ్చేవాడిని. ఆరోజు మాత్రం అలాకాదు. అనుకోకుండానే దానంతటదే ఏడుపువచ్చింది.అపుకుందా మన్నా ఎంతసేపటికోగాని ఆగలేదు. ఆ ఏడుపే ఇప్పటికీ అమ్మ దిగులుగా వున్నప్పుడు, నాన్నను చూడబుద్ధి అయి నప్పుడు పొర్లుకొస్తుంటుంది. నాన్నను తీసుకెళ్ళారనుకో, తీసుకెళ్తేమాత్రం ఎందుకురాడు, తప్పకుండా వస్తాడు." అని అనుకున్నాడు హుమయూ. హుమయూ అంటే వాళ్ళనాన్నకు ఎంతో

ప్రేమ. బజార్లో ఎవరైనా స్నేహితులెదురైనా ఎవరైనా వాళ్ళఇంటికివెళ్ళినా ఇద్దరుకొడుకులు వున్నప్పటికీ, పెద్ద కొడుకుమాటవదిలేసి అచ్చంహుమయూ ఖబుర్లే చెపుతూవుండేవాడు వాళ్ళనాన్న. అలా హుమయూనిగురించి చెపుతూ చెపుతూనే హుమయూ తల సవరించుతూనూ బుగ్గలునిమురుతూనూ వుండేవాడు. అట్లాంటి వాళ్ళనాన్న ఎప్పుడు వస్తాడో ఎక్కడ వున్నాడో అని అనుకునేటప్పటికి హుమయూకి రైలుకూత వినపడింది. రైలుకూత వినపడేటప్పటికి వాళ్ళనాన్న పిలుస్తున్నట్లే వున్నది హుమయూకి. వాళ్ళనాన్న ట్రావెలింగ్ ఇనస్పెక్టరుకావటాన ఎప్పుడూ రైళ్ళల్లోనే తిరుగుతూవుండేవాడు. ఒకటి రెండు సార్లు హుమయూనికూడా తీసుకెళ్ళాడు తనుడ్యూటీకివెళ్తూ. వాళ్ళనాన్న రైళ్లల్లో తిరుగుతూవుండటం కళ్ళారా చూచి వుంటాన ఇంకా వాళ్ళనాన్న రైళ్ళల్లోనే తిరుగుతూవుంటాడనీ, ఎప్పుడో రైలుదిగి నరానరి ఇంటికివచ్చేస్తాడనీ హుమయూ వూహ. అలా ఎంతకాలంచూచినా వాళ్ళ నాన్న ఇంటికిరాకపోవటాన మరీ చూడ బుద్ధిపుట్టి గుబులుగుబులుగా వున్నప్పుడు తనే స్వయంగాపోయి స్టేషన్లో వెతికి వెతికి నిరాశతో ఇల్లు చేరుకుంటూ వుంటాడు. స్టేషన్లో తననాన్నలాంటి డ్రెస్సువేసుకున్నవాళ్ళను చూచినప్పుడు మొదట తన నాన్నేనేమో ననుకోవటం కొంచెం నిదానించి చూచిన తరువాత తననాన్న కాకపోవటం గుర్తించి లోలోపల కుమిలికుమిలి ఇల్లుచేరుకోవటం, ఇంటికివచ్చిన దగ్గరనుంచీ తల్లిచేత దెబ్బలుతినటంతో హుమయూ పిచ్చివాడైపోతూవున్నాడు.

"నాన్నంతట నాన్నవచ్చి కనపడేదాకా కనిపెట్టుకుని వుండటమేనా! కాదు. స్టేషనుకువెళ్తే ఏదో ఒకరోజు ఏదో ఒక బండిలో నాన్నతప్పకుండా కనిపించుతాడు. నాన్న డ్రెస్సువేసుకున్నవాళ్ళందరిలాగా చూచిచూడనట్లు ఇట్లా తప్పుకుపోతాడానాన్న! చూచీచూడటంతోనే నన్ను అమాంతం ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటాడు. అప్పుడు నేను నాన్నను ఇంటికితీసుకువచ్చి అమ్మకు, అన్నయ్యకు, చెల్లాయికి అందరికీ చూపించవచ్చు. అమ్మకొట్టినాసరే మామయ్యా వూళ్ళోలేనిరోజుచూచి స్టేషనుకువెళ్ళి పెందరాడే ఇంటికి తిరిగి రావాలి. నాన్న కనపడక ఏమిచేస్తాడో చూడాలి మరి. తప్పకుండా కనుపించుతాడు. నేను మాత్రం వెదుకుతూనేవుండాలి" అని హుమయూ నిశ్చయించుకున్నాడు.






'నవ మన్మథ' సంపాదకుడి గృహం అతి హీనంగా ఉంటుంది. అతనేమిచేస్తాడు పాపం! మదరాసులో ఒకసందులో అందులో మళ్లీ గొందిలో ఒకఇల్లు బాడుగకి తీసుకొని కుటుంబంతో ఉంటున్నాడు. ఇల్లు అనడ మెందుకు? ఇంటిలో ఒకవాటా! వాటా అనడానికి ఎంత తగిఉంటుందో ఆలోచించండి. ఆ ఇంటిలో పదిమంది కాపురా లున్నారు. అందులో ఇతనొకడు. ఇతనిభాగం ఒక రెండు చిన్నగదులు, ఒక చిన్నకూటం. ఈ గదులు పేరుకిమాత్రమే! మనిషి పడుక్కొనేపాటి పొడుగున్నా బాగుండును. పెద్దలు ఏదో ఒక రకమైన గదియొక్క చహరా వర్ణిస్తారులెండి. గుమ్మంమీద తల ఆన్చి పడుక్కొంటే అవతలగోడకి కాళ్లుతగలాలి అని. ఆ కొలతకి సరిపడేవే ఆ రెండుగదులూ. ఒకగదిలో వంట, ఒకగదిలో సామానులుపెట్టుకొన్నారు. ఆ రెండింటికి మధ్యనుంది కూటం. ఇంటి శుభ్రత వేరే వర్ణించనక్కరలేదు. పాపం, అతను శుభ్రంగా ఉండదలచికాదు. అతనికి వశంలోలేని కొన్నివిషయాలకి అతనేలాగు బాధ్యుడు! దోమలబాధ, నల్లులవంటివి. మదరాసు నల్లులు ప్రసిద్ధి. పగలు ఎక్కడ దాగుంటాయో ఎవరికీతెలియదు. వాటికి మంచాలే ఉండాలన్న బాధలేదు. గోడల నెరదలలోను, ఎలెక్ట్రిక్ లైట్లతాలూకు కర్ర ముక్కలకింద, ఇంటికప్పుల సమీపాన, ఎక్కడెక్కడో దాగుంటాయి. ఇంక బల్లలు కుర్చీలు, పెట్టెలు మొదలైనవాటిని ఆశ్రయించుకొంటాయని వేరే చెప్పనక్కరలేదు రాత్రికాగానే బయలుదేరతాయి. వీటితో వేగలేక మన ఖర్మమని ఊరుకొంటారు. సాధారణంగా, వాటిజోలికి పోరనే చెప్పవచ్చు. గెలుపు వాటిదే! సంపాదకుడు ఉండే వాటాలోకి గాలిరాదని వేరేచెప్పడం పునరుక్తి. గాలిరావడానికి మొదట దారేలేదు. ఒకవైపున గోడకి కిటికీలులేవు. వెలుగుమాట అంటారా? అది మాటవరసకే! పట్టపగలే ఇళ్ళలో ఎలెక్ట్రిక్ దీపాలు వెలుగుతూండడం మదరాసులో సహజలక్షణం.

'నవ మన్మథ' సంపాదకుని సుందర నామధేయం రమానాథరావు. అతనికుటుంబం పెద్దదికాదు; భార్య, తాను, ఇద్దరు పిల్లలూ.

రమానాథరావు ఇల్లువేరు, ఆఫీసువేరు. ఆఫీసు జార్జిటౌన్‌లో ఒక సందడివీధిలో ఒక సందులోఉన్న ఒకమేడమీద ఒకచిన్న

టేకుమళ్ల కామేశ్వరరావు

గదిమాత్రమే! అతనికి సొంత ముద్రాశాల ప్రస్తుతంలేదు. మరొక ముద్రాశాలలో 'నవ మన్మథ' పత్రిక అచ్చవుతూ ప్రూఫులు వస్తూంటాయి. అదొకబాధలెండి! ముద్రాశాల వాళ్లతో యుద్ధంచేస్తూన్నప్పుడల్లా ఒకొక్కొక్క కాగితం ఊడిపడుతూ ఉంటుంది. జగడం ఏ రోజునలేదో ఆరోజున కాగితమూలేదు. ముద్రాశాలకుండే రద్దీ అటువంటిది. పాపం వాళ్లేమి చేస్తారు. అతనేమిచేస్తాడు! ఎవరితొందర వారిది. ఎవరిలాభం వారిది! సొంత ముద్రాశాల వచ్చేవరకూ ఇంతే! అది ఎప్పుడు వస్తుందో పూర్తిగా చెప్పలేము. కాని అతను కనుచూపు మేరలోనే ఉంది అనే మాటలని మనం విశ్వసిస్తే విశ్వసించవచ్చు. పత్రికయొక్క సంపాదకుడు, అధిపతి హోదాలురెండూ అతనివే.

సంపాదకుని పరిచయస్థులకి మితమేమిటి! అనేకరకాలు! అందులోను ఈ పత్రిక యొక్క ఆదర్శమే వేరు. లోకంలో మన్మథ ప్రచారం విరివిగాచెయ్యడమే దాని ఒకే ఒక ఆదర్శం. పత్రికకి తగిన అధిపతి, అధిపతికి తగిన పత్రిక!

రమానాధుని సాంఘికాభిప్రాయాలతోటి, నైతికోద్దేశాలతోటి ఏకీభవించే మనుష్యులు కొందరు ఉండబట్టే ఆ పత్రికకి కొంతప్రచారం కలుగుతూంది. కాని లోకమంతా అలాగు లేదు. ఆ అభిప్రాయాలంటే మొహం చిట్లించుకొనే పెద్దలు, వెగటించుకొనే పెద్దలు బాహుళ్యంగా ఉన్నారు. ఇట్టివారితో రమానాధరావుకి వాదోపవాదాలు జరుగుతూంటాయి. ఏనుగులు కొండలను ఢీకొన్నట్లే! తనతో వాదించినవారిని సంపాదకుడు మార్చ జూస్తాడు. తాను మా[illegible]కుల అని అతని అభిప్రాయం. భవిష్య[illegible]గుదురు!

నవానందస్వామి రమానందరావు పాతులలో ఒకడు. అతను 'పట్టి వాదస్తపు సన్యాసి' అని సంపాదకుని దృఢాభిప్రాయం. స్వామి ఇది కలికాలమని ఎరిగికూడ, తన ప్రచారమే తన విధి అని నమ్మి [illegible] పడుతూంటాడు. కొన్ని [illegible]పడతాయి. అక్కడక్కడ ఇనపగుగ్గిళ్లకూడ ఉంటాయి.

నవానందస్వామి సాధారణంగా కనబడతాడు, కాని పెద్ద ఆడంబరమేమీలేదు. అతని పేరు పెద్దది, కాని వయస్సు పెద్దదికాదు. పాతిక దాటేయో లేదో! ఇట్టి నడివయస్సులో అతను తన జీవితాన్ని భగవంతుడి కైంకర్యం చెయ్యడం లోకులకి ఆశ్చర్యమైన విషయం. అది పూర్తిగా నమ్మలేనివారు - లోకులు పలుగాకులు అన్న సామెత ఉండనే ఉంది కదా - అతన్నిగురించి కథలల్లబోతారు. కాని పునాదిలేని గోడలవడంవల్ల కట్టినవారి మీదే కూలబడుతూంటాయి. స్వామి కాషాయి వస్త్రాలు ధరిస్తాడు. తుమ్మెద రెక్కల లాంటి గిరజాలు, గడ్డమున్నూ. వాటిమీదా అంత శ్రద్ధఉన్నట్టు కనపడదు. చామనచాయ మనిషి.

స్వామి 'నవమన్మథ' ఆఫీసుఉన్న మేడ మెట్లెక్కి, ఆఫీసు గుమ్మందగ్గర నిలుచున్నాడు. తెరతలుపులు మూతపడిఉన్నాయి. లోపల సంపాదకుడుఉన్న జాడ తెలియ వస్తూనేఉంది. పని చేసే కుర్రవాళ్లెవరూ అక్కడలేరు. అతను ఎవరిపీ కనుక్కోనిదే లోపలికి చొరవచేసి వెళ్ల దలచుకోలేదు. పత్రికాధిపతియొక్క కళాకళలు ఎవరెరుగరని కమోసు!

స్వామి నిలుచున్నాడు. అతని చేతిలో ఒక చేతిసంచిఉంది. కాళ్లకి జోడులేదు.

కళ్లకి జోడుపెట్టుకోలేదు. అది జేబులో ఉంటుంది. కాగితాలు చూడవలసినప్పుడు మాత్రమే దానినితీసి కళ్లకి తగిలిస్తాడు. దాని అలంకారగుణాన్ని అతను పరిగణించడు. వేషభాషలతో తనకేమి సంబంధమని. చేతి గడియారంమట్టుకు తప్పదు. అది అత్యవసర వస్తువు. అతను గడ్డం నిమురుకుంటూ అక్కడ నిలబడ్డాడు, ఇంకా ఎవరి దర్శనం కాలేదు అన్నట్టు.

పనిచేసే కుర్రవాడు మేడ మెట్లెక్కి వచ్చాడు. స్వామిని చూడగానే వాడు. "సంపాదకులు గదిలో ఉన్నారు" అన్నాడు. "నువ్వు వారితో చెప్పిరా" అన్నాడు స్వామి. పనికుర్రవాడు లోపలికివెళ్లి రమానాధరావుతో చెప్పగా "ఒక్క అయిదు నిమిషాలు ఆగమని చెప్పు" అన్నాడు. వాడు తిరిగివచ్చి, ఆ విషయంచెప్పి. ఒక కుర్చీతెచ్చి అక్కడ వేయగా, స్వామి ఆసీనుడయాడు.

అక్కడినుంచే స్వామి కనబడినంత మేర వీధిని చూస్తూ, మహాసముద్రంలాంటి పట్టణం గురించి ఆలోచిస్తూ, ఆకాశం పరిశీలిస్తూ, 'ఈ మాయలోకమే ఈశ్వరుని సృష్టా' అని ఆశ్చర్యపోతున్నాడు. సృష్టిలోంచి గుణపాఠాలకోసం. వెతుకుతున్నాడు. సంపాదకుడు చెప్పిన అయిదు నిమిషాలకాలం అయిందో లేదో అని స్వామి మొదట తన గడియారం వైపుచూసి, అక్కడే ఉన్న గోడగడియారం వైపుకూడా చూశాడు. అయిపోయింది. సంపాదకుని మితిలేని పని ఎరిగినవాడు కాబట్టి అతను ఇక్కడ కూర్చుంటే కూర్చోడమే అని తలచి లోపలికి చక్కా బయలుదేరి వెళ్లాడు. రమానాధరావు ఏవో కాగితాలు చూసుకొంటూ, స్వామినిచూసి, చిరునవ్వు నవ్వి "మీ మాటే మరిచిపోయాను, క్షమించండి" అని లాంఛనప్రాయంగా అని, ఎగాదిగాచూసి "కుశలమా ?" అని ప్రశ్నించి, ఎదుటఉన్న కుర్చీ చూపించాడు. తాను ఒక సిగరెట్టుతీసి ముట్టించాడు. స్వామి కుర్చీని అలంకరించాడు.

సంపాదకుడు కాగితాలు చూసుకొంటూ ఎదుటనున్న మనిషిసంగతే మరిచిపోయాడు.

స్వామి "పనిలో ఉన్నారు" అని పలకరించాడు.

"ఎప్పుడూ ఉన్నపనే" అన్నాడు సంపాదకుడు.

"హద్దులేనిపని"అని తోడ్పడ్డాడు స్వామి.

ఔను అన్నట్టుగా తల ఎత్తి కళ్ళ అద్దాల కిందినుంచి చూశాడు రమానాధరావు.

"ఏమిటి విశేషాలు ?" అన్నాడు స్వామి.

"అదే అడగబోతున్నాను" అన్నాడు సంపాదకుడు.

ఇద్దరిమొహాలు చిరునవ్వుతోవికసించాయి.

"మీరేమీ రాసి ఇవ్వరా ?" అన్నాడు సంపాదకుడు మర్యాద ఉట్టిపడగా.

"అందుకు సందేహమా" అన్నాడు స్వామి.

"వెనక చిలుక చెప్పిన జవాబు జ్ఞాపకానికి వస్తూంది" అని హాస్యంగా అన్నాడు సంపాదకుడు.

"అందుకు సందేహమా" అని మళ్ళీ అన్నాడు స్వామి నవ్వుతాలుకి.

"మీరు మామ్మోలు స్వాములు కారు" అన్నాడు రమానాధరావు.

"అందుకు సందేహమా"అని "ముఖ్యంగా మూడుమార్లీ సూత్రం పాటించాను. అంతకంటే మరేంలేదు" అన్నాడు స్వామి.

స్వామియొక్క హాస్యధోరణికి రమానాధరావు సంతోషించాడు. వేళ్ళమధ్యనున్న సిగరెట్టుపీకె పారవేశాడు. చేతిలో కాగితాలు ముందుకు జరగడం లేదనుకొంటున్నాడు. స్వామి అతనియొక్క ఊహ గ్రహించాడు. "మీకు ఆఫీసులో తీరుబాటుఉండడం కల్ల" అన్నాడు.

"ఔనండీ!" అని సంపాదకుడు మరొక సిగరెట్టు ముట్టించి పొగవదులుతూ "ఈ టపా చూశేటప్పటికే తెల్లవారుతుంది. ఒకరకం కరెస్పాండెన్సు కాదు. చందాదారులగోల అలా గుంచండి. అటు వ్యాసాలు, ఇటు శృంగారప్రశ్నలకి సమాధానాలు, అటు ప్రూఫులు, ఇటు పజెల్సు కరెస్పాండెన్సు. ఒకటేమిటి!" అన్నాడు.

"నిజమే!" అని స్వామి "ఇంటికివస్తాను లెండి" అన్నాడు.

అప్పటికి వదిలిందే చాలు అన్నట్లుగా రమానాధరావు "తప్పక దయచేయండి" అన్నాడు.

"తప్పక" అని స్వామి స్థిరపరిచి లేవగా రమానాధరావు కాగితాలధోరణిలో గమనించనేలేదు.

* * *

మాణిక్యం, అంటే రమానాధరావుభార్య, వంట చేస్తూంది. ఆమె వయస్సు ఇరవైలోపు. ఆమె సంపాదకుని రెండోభార్య. అంతసుందరాంగికాదు, గాని వేషభాషలలో సౌందర్యం వెల్లివిరిసిపోతూంది. నవనాగరికంగా మొహాన్ని బొట్టులేదు. దండలకి బిగువైన పట్టురవిక, లోపల బాడీ. మంచి ఖరీదైన ఎర్రని చీరకట్టుకొంది. ఎడమచేతికి రిస్టువాచీమాత్రమే. కుడిచేతికి ఒక బంగారు గాజు, ఒక ఎర్రని ప్లాస్టిక్‌గాజుల చుట్ట ఉన్నాయి. ఆమెచెవులని, ముక్కుని ఆభరణాలు మిలమిలలాడుతున్నాయి. మెడలో ఒంటిపేటగొలుసు. వాలుజడ చివరకోల జడకుచ్చులు. కదంబం ముడుచుకొంది. మనిషి నాజూకుతనం ఓడిపోతూంది.

ఆమె కుంపటిమీద కాఫీతయారుచేస్తూంది. చాపమీదకూర్చునిభర్త సిగరెట్టుపీలుస్తున్నాడు. అతను ఏదో కలకంటూ అటూ ఇటూ చూసి, తెలుగుభాష తెలిసినవాళ్ళు పక్కని లేరని ఎరిగి "హా సుందరాంగీ! ప్రియురాలా!" అన్నాడు.

ఆ మాటలు పరిపాటు అవడంవల్ల మాణిక్యం లక్ష్యంచేయలేదు. పైగా కాఫీ పనితో కొట్టుకొంటూంది. కుర్రవాళ్ళు అల్లరి చేస్తూండగా "ఈ గుడుగుడుగుంచంలో మీరొకళ్ళర్రా నాప్రాణానికి!" అని పిల్లలని కసిరి "అవతలకిపోయి ఆడుకోరాదర్రా" అని మాటవరసకి అంది. మదరాసులో ఇళ్ళలో నివసించడానికే స్థలంలేకపోతే ఆడుకోడానికి స్థలమా! అయినా పిల్లలుపాపం ఇళ్ళలోనే అతినేర్పుగా ఆడుకొంటారు. దారిలో ఎన్ని వస్తువు లుండనియ్యండి, వాటిని ముట్టకుండా. అంటకుండా వాళ్ళు గంతులువేస్తారు, పరుగెత్తుతారు, బంతులు ఆడతారు! రెండోవాడు పాలు పారపొయ్యడానికి సిద్ధపడ్డాడు. మాణిక్యం వాడిని రెండుచరుపులు చరిచి, రెక్కపట్టుకొని లాగుకొనివెళ్ళి తండ్రిదగ్గర కూలవేసింది.

"వద్దు మొర్రోమంటూంటే మీరొకళ్లర్రా" అన్నాడు యజమాని.

"నాప్రాణం ముఖపడిపోతుందేమోనని" అని భార్య బాధ వెలిబుచ్చింది.

"అవేవో పద్ధతులున్నాయంటకాని మనకి సాధ్యంలో లేవు" అన్నాడు భర్త.

"పోదురూ నోటికివచ్చినట్లు మాట్లాడతారు! ఆడవాళ్ళముందర ఆవేంమాటలు!" అని ముద్దుముద్దుగా కసిరింది భార్య.

"పెరవా రెవరిచ్చుట. ప్రియురాలా!" అన్నాడు కవిత్వధోరణిగా.

ఇంతటిలో వాకిటిలో మనిషివస్తూన్న జాడ కనబడింది. ఎవరా అని ఇద్దరూ పరిశీలించారు.

నవానందస్వామి దర్శనంకాగా, రమానాథరావు తువ్వాలు పైమీదవేసుకొని "లోపలికి దయచెయ్యండి" అని, కూటంమధ్యనున్న తెర దించాడు. ఇద్దరూ కుర్చీలమీద ఆసీనులయారు.

తెరచాటుననిల్చుని మాణిక్యం చూస్తోంది.

"ఏమిటి విశేషాలు" అన్నాడు సంపాదకుడు సిగరెట్టు వెలిగించి.

"ఎప్పటి లోకమే!" అన్నాడు స్వామి.

"లోకమంటే శృంగారలోకమా, అశృంగారలోకమా?" అన్నాడు సంపాదకుడు చమత్కారంగా.

"శృంగారమో! పచ్చిశృంగారమో! పశుశృంగారమో! మావోటి జడులకేమి తెలుస్తుంది!"

"ఆమాటలకేమి లెండి! లోకంలో ఎంత మంటని చూడడంలేదు! భక్తురాలులేవిదే బావాజీలేడని చెప్పుకోడం వినడంలేదూ?"

"కృతకరత్నాలు లోలెడన్ని" అన్నాడు స్వామి గడ్డం సిమురుకొంటూ.

"నిజరత్నాలో కృతకరత్నాలో ఎవరికి తెలుస్తాయి. తళతళమంటూ మిలమిలలాడుతూన్నదే లోకానికి ఇంపు" అన్నాడు తల కొంచెం ఓరగాపెట్టిన భంగిమంలో.

"మానవజన్మ మాయనుండి పురుషుని వేరుపరచడానికేగాని మరొకదానికి కాదు. అజ్ఞానకూపంనుంచి జ్ఞానమార్గానికి పోవాలి" అన్నాడు స్వామి మీసాలు సవరించుకొంటూ.

"మీరెన్నిచెప్పండి. ఆ వేదాంతం మా బుర్రకెక్కదండీ!" అని మనిషిమీదగల మర్యాదతో అని "మాకు మీరేమైనా సహాయపడతారా?" అన్నాడు.

స్వామి ముందే అభయహస్తం ఇయ్యక "ఏవిషయంలో?" అని ప్రశ్నించాడు.

"మీరు తొందరపడే మనుష్యులు కారని నాకు తెలుసు" అని సంపాదకుడు కళ్ళజోడు తీసి తుడిచి మళ్ళిపెట్టుకొని "మీరు కథలు రాసి ఇవ్వాలి మా పత్రికకి" అన్నాడు.

"ఓ, దివ్యంగా" అన్నాడు స్వామి మందహాసంతో.

"మాకు దివ్యంగా ఉండకూడదు" అన్నాడు సంపాదకుడు.

"మరెలాగుండాలి" అని స్వామి గాంభీర్యం పొందాడు.

"సంభోగభాగ్యంగా ఉండాలి" అన్నాడు సంపాదకుడు.

"అదేమిటి!" అని స్వామి ఆశ్చర్యపోయాడు.

"ఈకాలంలో కావలసిన రాతలువేరు. పచ్చిశృంగారం ఓడుతూండేనే చదువరులు మెచ్చుకొంటారు" అని సంపాదకుడు ఒక క్షణం ఆలోచనగా ఆగాడు.

పచ్చకామర్ల రోగికి లోకమంతా పచ్చగాకనబడుతుందిఅని స్వామి తనలోఅనుకొన్నాడు.

"ఏకథ అయినాసరే ఈ మసూయిదామీద ఉండాలి మాకు" అని సంపాదకుడు ఒక్క-క్షణం ఆగాడు.

స్వామి కుతూహలంతో చూస్తున్నాడు.

"ఒక భార్యా భర్తా సంసారం చేస్తూంటారు. భర్త చాటుకాగా భార్య ఎదుటింటియువకుడితో సరసాలు సాగిస్తూంటుంది. చివరికి వారి సంయోగం. లేక — మీకు ఇంకా కావలిస్తే — వారిపరిణయం. మగవాడివిషయమే ఉండాలి అన్న నిర్బంధంలేదు. ఒక పెండ్లికాని యువతిని తీసుకోండి. అది ఊరివారితో సరసాలాడి ఎవరితోటో లేచిపోయిందని రాయండి"అన్నాడు రమానాధరావు అందులో ఉండే మజువు కనబరుస్తూ.

మాణిక్యం వారిసంభాషణ పరిశీలిస్తూనే ఉంది.

స్వామి పైచెవులు మూసుకొని సంపాదకుని తృణీకారానికి పాల్పడలేక లోపలి చెవులుమూసుకొని, మనస్సులోనే 'పాపము శమించుగాక!' అని ఉచ్చరించి "ఇది నాబోటివాణ్ణి రాయమనేసెలవా!" అని వికటంగా ప్రశ్నించాడు.

తెరచాటునుంచి మాణిక్యం స్వామిని చూసి "ఈకాలంలో తప్పబుట్టిన వ్యక్తి" అని ఆశ్చర్యపోతూంది. మగడు చెప్పిన మాటలు తలకి చక్కగా పట్టించుకొంటూంది.

"పోనీ మరొకపద్ధతిగా రాయండి" అన్నాడు సంపాదకుడు నవానందస్వామిమీద దయపుట్టి. కేసులోంచి సిగరెట్టుతీసి పాత సిగరెట్టుపీకనుంచే ఈ సిగరెట్టు అంటించాడు.

"ఏమిటి?" అని ప్రశ్నించాడు స్వామి.

"ఏమిటి అని అడుగుతారా" అని సంపాదకుడు పునరుక్తిగా అని ఆలోచనా దృష్టిని ప్రకటించాడు.

తెరచాటునుంచి "కాఫీఅయింది" అన్న మాట వినరాగా భర్త తెరఅవతలికివెళ్ళి రెండుకప్పులు ప్లేట్లు తీసుకొనివచ్చి, మేజాబల్లమీదపెట్టి "మీరు పుచ్చుకోండి" అని స్వామిని కోరాడు.

"అభ్యాసంలేదు" అన్నాడు విరాగి.

"కొంచెం తీసుకోండి పర్వాలేదు" అని సంపాదకుడు ప్రియంగా అన్నాడు.

"మా నియమానికి వ్యతిరేకం" అన్నాడు స్వామి.

"పాలు ఆరగిస్తారా పోనీ?" అని అడిగాడు సంపాదకుడు.

"ఆయావేళలలోనేగాని ఇతరకాలాలలో తినకూడని నియమం నాది" అని స్వామి తన భావం వెలువరచగా రమానాధరావు "సరే!" అనుకొన్నాడు.

మాణిక్యం విచారించింది.

రమానాధరావు కప్పుఖాళీచేసి రెండోకప్పుతోకూడ తెరవెనకాలికి అందించాడు.

"ఏమిటి ఆజ్ఞ" అన్నాడు స్వామి సాయిలాబాయిలాగా.

"అయితే ఒక పనిచెయ్యండి" అని సంపాదకుడు మళ్ళీ ఆలోచనగా కనపడి "బావాజీ భక్తురాలి సరసాలో లేక బావాజీ ఒక ఊళ్ళోచేరి ఎవరినో లేవతీసుకుపోయినట్లో లేక ఒక హరిదాసు శృంగారవ్యవహారాలో, ఏదో ఒకటి కల్పించి రాసి తీసుకురండి" అన్నాడు.

భరించలేక "హరిహరి!" అని స్వామి చెవులుమూసుకొన్నాడు.

"అయితే ఏమిటి మీ ఉద్దేశం! మన సంఘం ఎల్లకాలం ఈ నరకకూపంలోనే పడిఉండాలనా ఏమిటి మీ అభిప్రాయం! ఈ పాతివ్రత్యం, పెద్దలు కుదిర్చే ఈ వివాహాలు, ఈ ప్రేమలేని దాంపత్యాలు, ఈ సౌఖ్యంలేని జీవితం ఇలాగే గడపాలనా మీ ఉద్దేశం! మీరంటే రాగం పరిత్యజించి విరాగులయారుకాని లోకమంతా ఇలాగే ఉందనుకొంటున్నారా! పాశ్చాత్యులు ఎంతముందుకు పోయేరు ఏమిటికథ!" అని ఆగాడు స్వామిలో కలిగిన గుణం కనిపెట్టడానికి.

స్వామి వాదంవేసుకోడానికి సిద్ధపడుతున్నాడు.

మగనిమాటలు చక్కగా అర్థంచేసుకొంటూంది మాణిక్యం.

"మీకు రెండేముక్కలుచెప్తాను" అన్నాడు సంపాదకుడు.

గురువుగారి ముఖాన్ని చూస్తూన్న శిష్యుడిలాగ స్వామి కూర్చున్నాడు.

"పాశ్చాత్యసంఘాలు ముందుకు పోతూన్నట్టే మనమూ ముందుకు పోవాలి. విన్నారో లేదో, ఆ దేశాలలో సెక్స్యువాలిటీ అంటే స్త్రీపురుషసంబంధంగురించి వెనుకటి అభిప్రాయాలు పూర్తిగా తారుమారయేయనే చెప్పవచ్చు. నగరనాగరికము, జానపదనాగరికము అని రెండూ వేరువేరయేయి. నగరనాగరికంలో వెనుకటి సెక్స్యువల్ పద్ధతులు పనికిరావు. గర్భనిరోధాన్ని చెక్కుమంది ప్రశంసించి అనుసరిస్తున్నారు. స్త్రీపురుషులు మొట్టమొదట మచ్చుకాపరాలు చేస్తారు. వారిద్దరికి పూర్తిగా సరిపడితేనే వివాహమాడతారు. లేకుంటే ఎవరిదోవవారిది! వివాహవిచ్ఛేదన సామాన్యం. దానిలో మునుపు ఆడవారిఫిర్యాదులు హెచ్చుగా ఉంటే ఇప్పుడు మగవారిఫిర్యాదులు మిక్కుటంగా ఉన్నాయి. అక్కడితో ఆగిందనుకొన్నారేమో! ఎంతమాత్రంకాదు! భార్యాభర్తలునామకమాత్రమే! ఎవరిఇష్టంవచ్చినట్లు వారు వర్తించడం నేరంకాదు అన్నవాదన ప్రచారంలోకి వస్తూంది. ఇహ ఏమిటి చెప్పమన్నారు!" అని సంపాదకుడు ఆగి, సిగరెట్టుకొంటి దులిపి, పీల్చి, పైకి పొగవదిలి ఆలోచిస్తున్నాడు.

"నాయనా! వారు ఐహికసుఖాన్నిమట్టుకే గ్రహించారు. ఆముష్మికదృష్టిలేనిదీ సంఘం శాశ్వతంకాదు. ఐహికసౌఖ్యంకోసమే చూసిన ప్రాచీనగ్రీసు, రోమన్‌నాగరికాలు ధ్వంసమయేయి. ఐహికసౌఖ్యాన్ని మితంలో ఉంచి శాశ్వతానందం సాధించాలిబాబూ!" అన్నాడు స్వామి.

అతనికళ్లలో దివ్యతేజస్సు వెలుగుతూంది.

"అవన్నీ పూర్వకాలపు మాటలండీ!" అని సంపాదకుడు ఒక్కమాటలో కొట్టి పారవేశాడు.

"నేనూ హావలాక్ ఎల్లీసు, బ్రాడ్‌లా, మార్గరెట్‌శాంజర్, క్రాఫ్ట్‌ఎబ్బింగ్, ఫ్రేజర్ మొదలైనవారి రచనలు చదివాను" అన్నాడు స్వామి చల్లగా.

"ఇంకేం! మాకంటే ఎక్కువే చదివేరన్నమాట! మీరు పూర్వకాలపు స్వాములు కాదండోయ్! పొరపాటు! ఏమిటో అనుకొన్నాను! నవీనస్వాములు! అన్నట్లు అది మీరు ధరించిన ఆశ్రమనామంలోనే విదిత



మవుతూంది. నాదె పొరపాటు: క్షమించండి."
అన్నాడు సంపాదకుడు ఉత్తేజంతోటి.

పెద్దవాదనవేసుకోడానికి స్వామి సిద్ధపడుతున్నాడు. రమానాధరావు కంగారుపడి తడుము కున్నట్టయిపోయాడు. దిగ్గున లేచాడు, వేరే లాంఛనాలు మానివేసి "ఆఫీసువేళయిపోయిం"దని తొందరపడ్డాడు. అతని పని తొందర స్వామి గ్రహించి "మంచిది. వెళ్ళవస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రమానాధరావు వీధిలోకి వెళ్ళడానికి తగు ముస్తాబయి భార్యతో "భోజనానికి రావడానికి తీరుబాటు లేదు. అక్కడే హోటేలులో భోంచేస్తాను. ఇంకేవేవో పనులున్నాయి. రాత్రికిగాని తిరిగి రానని నా నమ్మకం" అన్నాడు.

"సరే" అంది భార్య.

అతను వెళ్ళిపోయాడు.

మాణిక్యం తనలో "ఆయన కథలలో రాస్తూన్నవే నోటితో ఉచ్చరించాడు. అంతే కాని, తన వ్యభిచారానుభవాలు చెప్తాడేమో అని కుతూహలంతో విన్నాను. కాని అదేమీ లేదు: కొత్తసంగతులేమీ లేవు: మా ఆయన చెప్పినట్టుగా నేనూ చేస్తున్నాను: ఆయన ప్రియభార్యని అనడంకన్న ప్రియశిష్యురాలిని అనడం తగినమాటలాగు కనబడుతుంది:" అనుకొన్నది.

సంపాదకుని ఇంటిఎదుటే ఒక లక్షాధికారి ఉన్నాడు. అతను సంపాదించినది మూడు వంతులు నల్లబజారులోనే: ఆ వ్యాపారస్తుని కొడుకు చిన్నవాడు. వట్టిషోకిళ్ళా. తండ్రి గడించినది వినియోగపరుస్తున్నాడు. దుర్వి నియోగమే: అతనిపేరు వేదాచలం.

మాణిక్యం వేదాచలంతో కొంతకాలమయి గ్రంథం జరుపుతూంది; చాలవరకు ముదిరింది. కాని రెండోమనిషికంట పడడంలేదు. పనిమనుష్యులమాటకాదు। వారిద్వారా రహస్యంగా ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతూంటాయి. ఈరోజున భర్త ఆఫీసుకి వెళ్ళిన తర్వాత ఆమె తనప్రియుడికి ఒక ఉత్తరం తయారుచేసింది. అది పనిమనుష్యులచేతిలో పెట్టడం ఇష్టంలేక వేదాచలంపేర పోస్టులో వెయ్యదలచుకొంది. కవరు తీసి ఉత్తరం దానిలోపెట్టి అంటించి, చిరునామారాసి, పోస్టుకెళ్ళి పడవేద్దాం అనుకొంటూ చూరులో పెట్టింది.

రమానాథరావు తిన్నగా ఆఫీసుకివెళ్ళి టపా చూసుకొన్నాడు. అందులో తొందర లేమీలేవు. ఏవో మూడుఉత్తరాలుమట్టుకు ఉన్నాయి. అవి ఎవరో పెద్దమనుష్యులదగ్గర నుండి వచ్చినవి, వారిబాధలు వెళ్ళబుచ్చుకొన్నవి. వానిలో, మీపత్రికలో పడ్డ కథలు చదివి నాకూతురు చెడిపోయిందని ఒకటి, మీ పత్రిక చదివి మాకోడలు కాపరం మానేసిందని మరొకటి, మీ కథలు చదివి నాకొడుకు సంసారం విడిచిపెట్టి ఎవరినో తీసుకొని లేచిపోయేడని ఇంకొకటి ఉన్నాయి. మూడు ఉత్తరాలలోను చివరివాక్యంలోమట్టుకు మీరు మా కొంపతూల్చినట్టే, దేవుడు మీ కొంప ఎప్పుడు సర్వనాశనంచేస్తాడో అనే దీవన భావంమట్టుకు సమానంగా ఉంది. సంపాదకుడు ఆ ఉత్తరాలు చదువుకొని తెగనవ్వుకొన్నాడు. "నాపత్రిక అంటే పట్టితమాషా అనుకొంటున్నారేమో। అది అగ్నివ్యాపించినట్టు వ్యాపిస్తుంది। పాతపద్ధతులు, పాత ఆచారాలు పటాపంచలు కావలసిందే!" అని సగర్వంగా అనుకొన్నాడు. "ఈ లేఖలు నా పత్రిక్కి ఏలాగు పనికివస్తాయి" అని సంపాదక దృష్టితో ఆలోచించాడు. "వీటిలో కొంతభాగమే పేరు ఊరు లేకుండా ప్రకటిస్తే పత్రికాప్రచారానికి బాగా తోడ్పడతాయి. వచ్చేనెలనుంచి 'నిజమైన లేఖలు' అని కొత్తశీర్షిక ఒకటి ప్రారంభించి దానిలో దూరుస్తాను వీటిని" అనుకొన్నాడు. పత్రిక తాలూకు తొందరపనులేమీ కనపడకపోగా, ప్రూఫులు చూడడం, వ్యాసాలు రావడం వంటివి - తలుపుతాళంవేసి, రెండుగంటలకే బయలుదేరి ఇంటికివచ్చేశాడు. అతన్ని చూసి మాణిక్యం ఆశ్చర్యపోయింది. ఈ చిత్రమేమిటని మగణ్ణి ప్రశ్నించింది.

"పనిలేందే అక్కడ పడుండడ మెందుకని వచ్చేశాను" అన్నాడు.

"బాగుంది. భోజనానికి లేవండి" అంది.

"ఏదో ఫలహారంచేశానులే" అన్నాడు భర్త.

"ఎందుకూ అన్నం ఉండనేఉందిగా అంది ఆమె. రమానాథరావు లేచి, భోజనం చేసి, తీరుబాటుగా వాలుకుర్చీమీద కూర్చుని అటూ ఇటూ చూస్తూండగా, చూరులో ఏదో కాగితంలాగు కనబడింది. ఏమిటి చెప్మా అని లేచివెళ్ళి అందుకొన్నాడు.తనకి పోస్టులో వచ్చిన కవరు అనుకొని చింపాడు. లోపలి చూసి ఆశ్చర్యపోయాడు. తర్వాత కవరుమీద పేరు చూశాడు. తనపేరుకాదు! ఉత్తరంలోని సంతకం భార్యదే! దస్తూరి తనభార్యదే! పైగా అది ఆరోజున రాసిందే। దైవవశాత్తు ఆ ఉత్తరం తనచేతిలో పడినందుకు భగ

వంతుణ్ణి వెయ్యివిధాల స్తుతించాడు. అతను ఆ ఉత్తరం మళ్ళీ మనస్సులో చదువుకొన్నాడు. దానిలో వాక్యాలు కొన్నిమట్టుకు మళ్ళీ మళ్ళీ నెమ్మదిగా పైకి ఉచ్చరిస్తూ చదివాడు. "మనోహరా! నాకు నీమీదఉన్న ప్రేమ నామొగుడిమీదనైనా లేదు, అంతేకాదు నాపిల్లలమీదకూడా లేదు....నీకు సమర్పించని ఈనాశరీరంకాల్చనా....నాకు నీమీద ఇంత ప్రేమ ఉండగా నీకు నామీద ప్రేమలేదంటే ఎవరు నమ్ముతారు....చెప్పరాని నాబాధలకి మందువేయగల ప్రియవైద్యుడవు నీవేనని ఆ దేవుడు నాకు దారిచూపించినాడు....నీవు నాభర్త అనుమతిలేదని భావించవద్దు. మగ వాళ్ళతో స్వేచ్ఛగా ఉండమనే ఆయనబోధ. ఆయన మద్దత్తుఇచ్చే ఈపని చేయిస్తున్నాడు; నాకు పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చివేశాడు. కాబట్టి ఇక మీదయా, నా అదృష్టమున్నూ. ఇట్లు మీప్రియమనోహారిణి మాణిక్యం."

సంపాదకుడు ఆ ఉత్తరం చేతితో పట్టుకొని నిలువున నీరైపోయాడు. తెలివి తెచ్చుకొని ఆమె రహస్యవర్తనం తనకింత కాలమూ తెలియనందుకు విచారించాడు. ఆ ఉత్తరంలో ప్రతి అంశమును గురించి ఆమెని ప్రశ్నింప దలచుకొన్నాడు. "ఇక విడాకులు ఇస్తే మంచిదేమో? దాని తండ్రికి రమ్మని టెలిగ్రాం ఇచ్చిపంపించి వెయ్యనా? బిడ్డలని దానితోతీసుకొని పొమ్మననా? తర్వాత నాగతేమిటి?" మొదలైన అనేక ఆలోచనలు, తెట్టె కదల్చగా కందిరీగలలాగు, ఐయలు దేరాయి. కాని అతడు ఇంకా లోతుగా ఆలోచించాడు. "దీనికంతకీ కారణం నేను! నా పత్రికలు చదివినవాళ్ళ వర్తన అమోస్తరుగా వుండదా! ఇవాళేకదా టపాలో ఉత్తరాలు చదివాను. నేను ఒక విషయమై ప్రచారంచేస్తూ, దానిఫలితం మరొకలాగు వుంటుందని భావించడం అజ్ఞానం. పత్రికలు చదివి దేశంలో ఎక్కడో పాడైపోతూన్నారంటే పోనీ మనకెందుకు, ఎవరెలాగు చస్తేయేం అనుకొన్నాను. కాని ఇప్పుడు నా కొంపమీదికే వచ్చింది. నా సంసారం చెడిపోయేక నేను చేసేదేమిటి నామొహం! మొట్టమొదట లెంపలువాయించుకొని మరీ ఆలోచిస్తాను" అని బుద్ధిచెప్పుకొని "ఇక ఇదికాదు దీనికి పద్ధతి! ఈ ఇంటినుంచి మకాం మార్చేస్తాను. దానితో ఇక్కడి సంబంధాలు తెగి చక్కాపోతాయి" అనుకొన్నాడు.

అతను ఆఫీసుకివెళ్ళడం మానివేశాడు. ఇంటివిషయమై వాకబు చేశాడు. వారం రోజులు వెతికాడు.

చెన్నపట్టణంలో ఇల్లుదొరకడం సామాన్యమైనపనికాదు. ఉన్న ఇల్లు విడిచిపెడితే మరొకఇల్లు దొరకదనే వాడుక. అసలు మొదట నిలువనీడ ఏలాగు దొరికిందని ఆశ్చర్యపోతారు. ఇళ్ళకోసం వెతకబోతే ఆ బాధలా చెప్పలేము. అద్దెలు విపరీతమనే విషయం అలాగుండనియ్యండి. ఇంటి యజమానులు ఎన్నినెలల అడ్వాన్సు మొదట ఇస్తావు అని అడుగుతాడు. ఇంకా కొందరు ఎన్నివందలు ఇస్తావు అని అడుగుతారు. ఇదంతా ఇల్లు ఇవ్వడానికి లంచాలాంటిది. నువ్వు పెట్టుబడిపెడితే కొత్తవాటా వెంటనే కట్టిఇస్తాం అంటారు కొందరు. ఇంత అద్దె వాటా వుందని ఇంటి యజమాని అంటే,

దానిసంగతేమిటంటే, అంగడ నోగది అమద నోగది చూపిస్తాడు. బోడిగుండికి బొటన వేలికి ముడివేసినట్లు. అక్కడ ఒకటుంటే ఒకటుండదు. సర్వ సాధారణం నూతులలో నీరు ఉండదు. ఇక్కడ వరసగా మూడేళ్ళ నుంచి వానలు తక్కువవడంచేత నీటిబాధ జాస్తి అయింది. ముఖ్యంగా వేసంకాలంలో నూతులలో పిల్లనూతులు తీయిస్తారు పాపం. కాని ఫలితం సున్న. నీళ్లులేనిదే క్షణం జరగదు. కొళాయి నీటికన్న పాలు సులువుగా దొరుకుతాయని ఇక్కడ సామెత. పాపం! ఇన్నిబాధలూ ఓర్చి రమానాధరావు ఒకవాటా సాధించాడు. అది ఇప్పుడతనున్నదానికన్న మెరుగుగావుండడం చాల గొప్ప అదృష్టం. ఇప్పటి మకాంకి మూడుమైళ్ళ దూరంలో కుదిరింది. అతను లాడీబేడీతో అక్కడ చేరుకొని "అమ్మయ్య!" అని నిట్టూర్పు వదిలి "చావుతప్పి కన్ను లొట్టపోయిం" దని సంతోషించాడు.

ఇంటిగొడవలో పత్రికపని వెనకపడింది. దానిమాట యేమిటని ఆలోచించాడు. "ఇంక పత్రిక విరమించవలసిన కాలం వచ్చింది. ఇది నా ఆత్మ నాశనానికి కారణమయింది" అని బాధగా అనుకొన్నాడు. తీవ్రంగా ఆలోచించాడు. అతను పత్రికధోరణి, పత్రిక పేరుకూడా మార్చివేయ దలచుకొన్నాడు. ఇంతలో నవానందస్వామి జ్ఞాపకానికి వచ్చాడు. "స్వామితో కూడ చర్చిస్తే బాగుంటుంది" అని భావించాడు.

తలవని తలంపుగా నవానందస్వామి దర్శనమయింది. రమానాధరావు ఆశ్చర్య పోయాడు. అతను స్వామితో "నేను సంకల్ప సిద్ధుడనా. మీరు సంకల్పమాత్రాన దర్శన మిచ్చేవారా? ఏమిటి సంగతి?" అన్నారు.

వాక్యసందర్భ మెరుగని స్వామి విస్తు పోయి "ఏమిటి కథ" అని ఎదురుప్రశ్నించి, కుర్చీమీద కూర్చున్నాడు.

సంపాదకుడు పూసగుచ్చినట్లు జరిగిన కథంతా ఏకరువుపెట్టాడు.

స్వామి ఆశ్చర్యంతోపాటు విచారించాడు. ఒక్కక్షణం గడ్డం, మీసాలు నిమురుకొని ఆకాశంవైపు చూచాడు.

మునపటికన్న ఇద్దరూ సన్నిహితు లయారు.

"నేను నా పత్రిక ఆదర్శాన్ని, పేరునికూడ మార్చదలచుకొన్నాను" అన్నాడు రమానాధ రావు పశ్చాత్తాపదృష్టితో.


స్వామి "చాలాసంతోషం" అని "ఇదే ధర్మ విజయం" అన్నాడు గంభీరంగా.

స్వామి మాటలలో సంపాదకుడికి ఏదో స్ఫురించింది. అతను తటాలున "పెద్దల మాటలు ఊరకేపోవు. మీరు వెలవిచ్చినదే పత్రికపేరు" అన్నాడు.

"అదేమిటి" అని స్వామి విచిత్రంగా చూశాడు.

"ధర్మ విజయం మా పత్రికపేరు" అన్నాడు సంపాదకుడు.

ఇద్దరూ విరగబడి నవ్వుకొన్నారు.





# బికారి

ఒడ్డుననున్న రావిచెట్లు గాలికి జలవ్వున ఊగుతున్నయ్. గూళ్ళకు తిరిగి వస్తున్న పిట్టలు కొమ్మలమధ్య రొద చేస్తున్నయ్. పడమటన దూరాన కారడవులకు నిప్పంటుకున్నట్టుంది. కాలవ నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. కింద మలుపులో వెళ్తున్న పడవల తెఱచాపలు గాలికి తపతపమంటున్నయ్.

ఒడ్డున కూర్చుని కుర్రవాడు నిశ్శబ్ద ప్రవాహంలోకి మట్టిగడ్డలు విసురుతున్నాడు. అంతకుముందే దాటిపోయిన పడవల సరంగుల కోలాహలం, యాత్రికుల ముఖాలు వాడికింకా గోచరిస్తూనే ఉన్నయ్. మధ్యమధ్య పక్కనున్న మట్టిపెల్లలనుతీసి నీళ్ళలోకి విసురుతున్నాడు. పై చెట్టుకొమ్మలమధ్య రొద చేస్తున్న పిట్టలవల్ల వాడి ధ్యానకు భంగం కలుగుతోంది. లేచి ఒకగడ్డ విసురుగా కొమ్మల్లోకి విసిరాడు. అన్నీ భయంతో రెక్కలు తపతప కొట్టుకుంటూ లేచిపోయినయ్. వాడు మళ్లీ తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాడు.

తప్పతాగే తండ్రి ఇంటికి రెండు రోజులనుంచి రావట్లేదు. గొల్లసరిసింటో పడివుంటాడని తనకు తెలుసు. నిన్న వాళ్లింటివగ్గర వీళ్లింటిదగ్గర ఎలాగో తిండితిన్నాడు గాని, ఇవ్వాళ డొక్క అంటుకుపోయేఉంది. ఈ వంద గుడిసెలున్న పల్లెలోనూ వాడికి తిండిలభించే అవకాశం గోచరించట్లేదు.

అసాములవద్ద చిన్న పాలేళ్లుగాజేరి తోటివాళ్లు జీవిస్తున్నారు. కాని తనకు వళ్లు వంగదు. ప్రయత్నించిచూశాడు గాని త్వరలోనే గ్రహించాడు—తనకు కుదురులేదని. పగలల్లా ఆ గొడ్లనుకాసి, ఆ తుక్కు మోసి.... వెధవ రొచ్చులో పడి ఉండాలి పొద్దస్తమానమూ! ఆకలితోనైనా ఉండవచ్చునుగాని.... ఈ పేడలో, రొచ్చులో మురగటం దుర్భరం! అందుకే వాడిప్పుడు ఊరిబైటకువచ్చి, వాగుఒడ్డున కూర్చుని తన భవిష్యత్తు ఆలోచిస్తున్నాడు. ఆలోచనల్లో ఒకటి రెండుసార్లు తండ్రి స్ఫురణకువచ్చాడు. మమకారంవల్లకాదు. ఏం తండ్రి?.... కనబడినప్పుడు తనను కొట్టటమో లేక పుగాకు తెచ్చిపెట్టమని వేధించటమో.... ఇంతకన్న తండ్రి తన కెక్కువవాడు కాడు. ఇక తల్లి.... ఆ సంగతే తనకు

వి. సహజానంద

తెలియదు. బహుశ జీవించి ఉంటే తల్లి కూడా కొట్టుతూ ఉండేదేమో....

అయినా తోటివాళ్లు "అమ్మా!" అని తల్లులదగ్గరకు వెళ్లినప్పుడు, తన హృదయమూ ఏవో ఆరాటపడేది. కాని వాడికి బెంగలేదు. తీరని విచారంలేదు. ఎవరైనా ఆటల్లో బాగా దేహశుద్ధి జేసినా, ఏడుస్తూ ఎవరివగ్గరికైనా వెళ్లాలనిపించేదికాదు వాడికి. కాసేపేడ్చి, కొట్టినవాళ్ల పని ఎలాపట్టించటమా అని ఆలోచిస్తూ ఉండేవాడు. వాడికి అపరిమితమైన ఆనందమూలేదు. ఒకసారి చెఱువులో విచ్చిన కలవపూలనుచూసి చాలా సంతోషించాడు. కాసలావాడికి కనబడకుండా మునిగి ఈతలో వెళ్లి, పువ్వులు కోసుకొచ్చాడు. పదేళ్లపిల్ల నరిసి "ఒరే....నాకో పువ్వు ఇవ్వరా!" అని అడిగితే, చీదరించుకున్నాడు. ఇవ్వలేదు. ఆది వెంటబడ్డది. ఒకపువ్వు అందకు పారేశాడు. దాన్ని తీసుకోమని....మట్టికొట్టుకున్న పువ్వునుచూసి నరిసి చిన్నపుచ్చుకొని వెళ్లిపోయింది. తన ఏడ్పులుగాని, నవ్వులుగాని ఇంకోళ్ళతో పంచుకోవాలనే కుతూహలం వాడికి కలగలేదు.

పొలాల్లో ఆడపిల్లలతో ఆడుకోవాలని చూశాడు. కాని ఒక్కళ్ళతోనూ సావాసం కుదరలేదు. తనకు కోపం ఎక్కువఅని, దుబ్బులాంటి జుట్టుఅని వెక్కిరించేవారు. వాళ్లు పూలకోసం ఒకటే గోలచేసేవాళ్లు. కాని తనకు పూలంటే మోజులేదు.

ఎవడనైనా కుస్తీకి రమ్మను. తయారు. ఎవడి దొడ్లోనైనా కాయగూరలు కోసుకు రమ్మను సిద్ధం. లేకపోతే ఈ కాలవలో ఈదమను. అంతేగాని పూలు ఏమిటి? గట్టిగా ముట్టుకుంటె రెక్కలూడిపోతయ్. ఒక్క కలవపూలుమటుకు చాలు తనకు. ఒక్కత్తే తనతో మాట్లాడకపోతే యేం? వాళ్ళకు తను పేడతట్టలు ఎత్తనే ఎత్తడు.

కుర్రాళ్ళలో వాడికెవ్వడూ మిత్రుడు లేడు. ప్రతివాడితోనూ దెబ్బలాడటమే వాడిపని.

ఈ ఊరునుంచి లేచిపోతే! చల్లనిగాలి తగిలినట్టుంది వాడికి తలపురాగానే. అవును. తను ఈ ఊరునంటిపెట్టుకొని ఉండవలసిన కారణం కన్పించట్లేదు. తనసంగతి తండ్రికి పట్టదు. తండ్రి సంగతి తనకు పట్టదు. ఇంకెవరూ తనకు లేరు.

దూరంగా పొగ కన్పించింది. ఇంతలో రైలుకూత వినబడ్డది. జెర్రెగొడ్డులా చరచరా పాకుకొపోతోంది రైలు. మైళ్లకు మైళ్లు వెళ్ళిపోతుంది రోజుకు. తాను నేలపై కాలుపెట్టినప్పటినుంచి కట్టుగొయ్యకు గొడ్డులా తను ఈ ఊరికి కట్టుబడ్డాడు కాని ఈ బందిలి దొడ్లోంచి తనూ వెళ్ళిపోవచ్చు.

మెల్లగా లేచాడు. గూళ్ళలో పిట్టలు సద్దుకున్నయ్. కాలవ నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. పైన దూరంగా తెలిచాపలు కనబడుతున్నయ్.

* * *

పెట్టెలో మూలన ఒదిగి కూర్చొని కునికిపాట్లు పడుతున్న కుర్రవాడు ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా నుంచున్న

టికెట్టు కలెక్టరు ఏనాదిలనాటకంలో భేతాళుడులా కనిపించాడు—వాడికళ్ళకు. తను పైకిలేస్తూనే, ఒక తన్ను తిన్నాడు. సొంతం లేవకముందే తన జుట్టుపట్టు కొని, "టికెట్టు ఏది?" అన్నాడు ఉద్యోగి.

"అవతల పెట్టెలో మా అన్నయ్య...." అన్నాడు కుర్రవాడు. ఉద్యోగి వాడి మడ్డి జేబూలోకి చెయ్యిపోనిచ్చి, ఏవో బైటకు తీశాడు. చిల్లుకానీకూడా దొరకలేదు. నగం సిగరెట్టుముక్క ఒకటి, పూర్తి సిగరెట్టు ఒకటి కన్పించినయ్.

ఉద్యోగి పక్కస్టేషన్లో దింపేశాడు కుర్రవాడిని. రైలు కదిలి వెళ్లిపోయింది. మళ్లీ రైలు వచ్చేదాకా విశ్రాంతి తీసుకో వచ్చు. ఈలోపు ఒక దమ్ముపేద్దాం అను కొని కుర్రాడు జేబులో చెయ్యిపెట్టాడు. నగంముక్క ఒక్కటే చేతికి తగిలింది. వేళ్లు వృధాగా జేబూఅంతా గాలించి నయ్. కుర్రాడు తెల్లబోయాడు.

జెవరిస్తూవస్తున్న పోర్టరు ఆ సిగరెట్టు ముక్కతో తృప్తిజెందాడు.

"ఇప్పుడు రైలేదైనా వస్తుందా?" అని అడిగాడు కుర్రవాడు.

"నువ్వువచ్చిన వేపుకు వెళ్ళే రైలు ఓ అరగంటలో వస్తుంది" అని పోర్టరు వెళ్లిపోయాడు.

"అటువేపైతే నాకేం?" అను కొని కుర్రవాడు చెట్టుకింద కూలబడ్డాడు.

* * *

ప్లాటుఫారంమీదకువచ్చి రైలు ఆగింది.

పెట్టెల్లోంచి జనం దిగి కాఫీ, టీల కోసం తొటుపడుతున్నారు. కుర్రవాడు అవవాళ్ళ పెట్టెదగ్గర నిలబడి, తిండితిని మూడురోజులైందనే పాఠాన్ని అప్పజెప్పు తున్నాడు. ఇవ్వాళేకాదు వాడలా అనేది. ఏరోజు కారోజే అలా అనటం అలవా టైంది. అంతా విసుక్కున్నారు. మళ్ళీ అడిగాడు. చీదరించుకున్నారు. మళ్ళీ అడిగాడు. పదిపన్నెండేళ్ళ పిల్ల ఒకత్తె "అబ్బ....పోరా....ఎంత పాడువాసన" అంది.

వాడిముఖం చిన్నపుచ్చుకుంది. నిజంగా తనదగ్గర దుర్వాసనే! దుమ్ము, బొగ్గు, నీళ్లు, అరటితొక్కలు, చెమట.... వీటిలో దుర్వాసనలేకుండా ఎలా?

మెల్లగా అక్కడనుంచి కదిలాడు. మళ్లీ ఆరంభించాడు—అకలిపాఠం అప్ప జెప్పటం. నగం తిన్నగారెముక్క ఒకటి చేతిలో పడ్డది. ఆ గారె స్పర్శకు, ఆకలి మంట చల్లారినట్టుంది.

"ఎంగిలిగారె....ఎబ్బే!" అంటున్నాడు రైలుపెట్టెలో ఉన్న కుర్రవాడొకడు. అవును....ఎంగిలిగారే? అయితేనేం? ఇవ్వాళ తనకు కొత్తకాదు. ఈ రైలు జీవితంలో అడుగుపెట్టినప్పటినుంచి ఇదే విందు తనకు. ఒకసారి వెనక్కు తిరిగి చూశాడు. పెట్టెలో కుర్రాళ్ళందరి ముఖాల్లోనూ తనంటె అసహ్యం కొట్ట వచ్చినట్టు కనబడుతోంది. వాడికి రోషం వేసింది. అక్కడనుంచి లేచివెళ్ళి, కటకటాలకానుకొని చూస్తూ నిలబడాడు.

వాడి చూపంతా రైలుపెట్టెల్లో కూర్చున్న తన ఈడువాళ్ళపైనే ఉంది. వాళ్ళసవ్వాలు, వేళాకోళాలు చూస్తుంటె

వాడికి వళ్లుమండింది. తనూ ఒకప్పుడు ఊర్లో తోటివాళ్లతో నవ్వాడు. వేళాకోళాలు చేశాడు. కాని క్రమేపి వేసవి వడగాడ్పుకు ఏటిలో నీరింకినట్టు, తన ముఖంలో సంతోషం హరించిపోయింది. ఉన్నట్టుండి వాడి కెందుకో లోపలనుంచి నవ్వు వచ్చింది. బాల్యమేదో గుర్తుకువచ్చింది. కాని ఆ వికృతముఖంలో అది వెలవెల బోయింది. ఆ కుర్రాళ్లు కాఫీ, టీలు తాగుతున్నారు. వాడికి రోషం హెచ్చింది. ఇంకెప్పుడూ కుర్రాళ్లదగ్గఅ తను చెయ్యి జాపడు. అన లీసారి రైలువచ్చినప్పుడు, తను సిగరెట్టుదమ్ముపీలుస్తూ, అటూ ఇటూ పచారుచేస్తాడు. రెండువేళ్లమధ్య సిగరెట్టుపెట్టి, దర్జాగా వెన్నువిరుచుకొని షికారుచేస్తాడు. వెధవఆకలి....రోజులకు రోజులు మొద్దునిద్రబోయే ఆకలి ఒక పూట కన్నుమూయదేమిటి? అప్పుడు ఆ కుర్రాళ్లు తెలుసుకుంటారు – తనూ తీసిపోలేదని!

గంటకొట్టారు. ఎంజిన్‌లోంచి గుప్పున పొగవచ్చింది. వాడు నోట్లోంచి సిగరెట్టు పొగ వదిలాడు. రైలు కదలింది. కటకటాలదగ్గరనుంచి ముందుకువచ్చి నుంచున్నాడు. ఎవరో పదేళ్ళపిల్ల చిన్న హార్మోనియం నోటితో ఊదుతోంది. అది వినబడగానే వాడిముఖంలో వెన్నెల కాసింది. కదులుతున్న పెట్టెలోకి గబగబా ఎక్కాడు.

రైలు సాగిపోతోంది. పిల్ల ఊపిరికొద్దీ హార్మోనియం ఊదుతోంది. పెట్టెగుమ్మంలో నిలబడి కుర్రవాడు సంగీతం వింటున్నాడు. వింతధ్వనులు వాడినేదో కొత్త ప్రపంచానికి పిలుచుకొపోతున్నయ్.

ఆపిల్లకేసి చూశాడు. ఆ లేముఖంలో ఆ కుర్రాళ్ళఅసహ్యం, పొగరు కన్పించ లేదు.

రైలు వేగంగా వెళ్లిపోతోంది. పిల్ల హార్మోనియం నోటిముందునుంచి తీసేసి, పరుగెత్తుతున్న చెట్లకేసి, కొండలకేసి చూస్తోంది. వాడికళ్లు హార్మోనియంమీదే ఉన్నయ్. మూగవడిఉన్నా, దాని పాట ఇంకా వాడికి వినబడుతూనే ఉంది. ఆపిల్ల మళ్లీ పాడుతుందేమోననిచూశాడు. పాడలేదు. హార్మోనియంలో సంగీతకన్య నిద్రించినట్టుంది. వాడు యాచన ఆరంభించాడు. స్టేషన్ దగ్గరకువస్తోంది. యాత్రికులు మూట ముల్లె సర్దుకుంటున్నారు. వాడు పిల్లను సమీపించాడు. కానీ ఇవ్వమన్నాడు. బేడా ఉందంది. చిల్లర లేదన్నాడు. పాడతావా అని అడిగింది. వాడిగోల నీకెందుకే అని పెద్దలు కేకలేశారు. వాడు మెల్లగా తప్పుకున్నాడు.

రైలు ఆగింది. జనం కొంతమంది దిగారు. గభుక్కున పిల్ల లేచి, "ఏదే.... ఏదే'' అని ఏడుస్తూ అటూ ఇటూ వెతుక్కుంటోంది. "ఏమిటీ?'' అన్నారు పెద్దలు. "హార్మోనియం...హార్మోనియం" అని పిల్ల, కుర్రవాడికోసం పెట్టె నలు మూలలా చూసింది.

రైలు కదిలింది. ఇనపచక్రాలరొదలో పిల్లకు ఎక్కడినుంచో హార్మోనియంపాట వినబడుతోంది. కిటికీలోంచి చూసింది. కుర్రవాడు ప్లాటుఫారంమీద నుంచోని



పరమానందంగా ఊషుతున్నాడు. పిల్ల దానికళ్ళలో నీళ్లుతిరిగినయ్.

*　　　*　　　*

పెద్దవాన జోరుతగ్గి, ఇంకా తుప్పర పడుతూనేఉంది. సంధ్యచీకట్లో స్టేషన్‌దీపాలు వెలిగినయ్. రైలు ఆగగానే హార్మోనియం ఊదుతూ, కుర్రవాడు పెట్టెలదగ్గరకు వెళ్లాడు. ఆ చినుకుల మధ్య, సంధ్యచీకటిలో వీడి పాట ఎవ్వరూ విన్పించుకోవట్లేదు. గబగబా పెట్టెరదగ్గరనుంచి పెట్టెదగ్గరకుపాడుతూ మటుకు వెళ్తున్నాడు.

ఒకపెట్టెదగ్గర కిటికీకిందనుంచొని పాడటం ఆరంభించాడు. కుతూహలంతో వింటోంది ఒకపిల్ల. వాడు ఆకళ్ళలో చనువునుగ్రహించి,సంతోషంతో పాడటం ఆరంభించాడు. పిల్ల కుర్రవాడికేసే చూస్తోంది. ఆపిల్ల విశాలనేత్రాల్లోకి చూస్తుంటె, వాడికేదో ఆనందంగా ఉంది. ఇన్నాళ్లు అనుక్షణం రైళ్లలో తిరుగుతూనే ఉన్నాడు. కాని చిరాకుపడేవి కొన్నికళ్లు. కొన్ని అసహ్యించుకునేవి. కొన్నిచూసి, చూడనట్టుఉండేవి. కాని ఏదో ఆప్యాయంగా, చనువుగా తనకేసిచూడటం మొదటిసారి ఇదే.

ఆకళ్ళలోకి చూస్తుంటె, అతనికాపిల్ల నిదివరలోనే ఎరిగినట్టుంది. చిన్నతనం నుంచి ఆటపాటలు గరపి, కొన్నాళ్ళ ఎడబాటయ్యాక మళ్లీ హఠాత్తుగా కలుసు కున్నట్టుంది.

కళ్ళలో ఎంతహాయిఉంది? ఎంత మాధుర్యం? ఇంద్రధనుస్సును చూసినట్టు! నల్లనిమేఘంలో పూర్ణచంద్ర బింబాన్ని చూసినట్టు! చెఱువులో కలవ పువ్వుకేసిచూసి ముగ్ధుడైన సంగతి గుర్తుకువచ్చింది. ఆకళ్ళలో ఎన్ని కలువలు...తామరపూలు .... ఆపిల్ల తనకేసి చూసినప్పుడు, ఏదో తోటలోకి తీసుకొపోతున్నట్టున్నయ్ ఆకళ్లు! వాడిహృదయం స్పందించింది. ఉత్సాహం ఎక్కువైంది.

"మళ్ళీ పాడనా?" అని అడిగాడు, పిల్లను.

పిల్లముఖం కళకళపడ్డది. సిగ్గు ముఖాన్ని కమ్మివేసింది. ఎరగని పిల్లవాడు, అందులో ముష్టివాడు ఇలా హఠాత్తుగా, చనువుగా పలకరించటంలో పిల్లకు ఏమిచెప్పాలో తెలియలేదు. పిల్లవాని ఆమోదం తెలుసుకోకుండానే మళ్లీ ఆరంభించాడు.

మిగతా పెట్టెలదగ్గరకు వెళ్ళి, కాని డబ్బులుగాని, గారెముక్కలుగాని సంపాదించుకోవాలనే స్పృహతప్పింది వానికి. ఆ బాల సాన్నిధ్యంలో ఆకలిమంటలు చల్లారినయ్. ఆ కళ్ళలోంచి మలయమారుతం వీస్తున్నట్టుంది.

గంట కొట్టారు. గార్డు ఈలవేశాడు. తొందర తొందరగా పాడుతున్నాడు కుర్రవాడు. పిల్ల వంగి, ఏదోఇచ్చింది. అలవాటుచొప్పున చేతులా బిస్కట్లుపొట్లం పట్టుకున్నయ్.

రైలు కదలింది. పిల్ల కుర్రవాడికేసి చూడట్లేదు. లోపల ఎదురుగాఉన్న పిల్లలతో ఏవో మాట్లాడుతోంది. కుర్రవాడు గబగబా నాలుగడుగులు ముందుకు వేశాడు. తొట్రుపాటులో చేతిలోంచి జారిపడ్డది బిస్కట్లపొట్లం. పరుగెత్తుతున్న రైలుపెట్టెలోకి చూశాడు. ఆ పిల్లముఖం కనబడలేదు.

రైలు వెళ్ళిపోయింది. వెనుదిరిగి చూడగా కింద ఆటూఇటూ పడివున్న బిస్కట్లు కనబడినయ్. వాటి ఏరటానికి వాడు వంగలేదు. అవి వాడిపాదాలకింద పొడుం అవటంకూడా వాడికి తెలియదు. వాడిముఖం వడిలిఉంది.

ఎవరికోసమూ, జీవించిఉన్న తండ్రికోసంగాని, మృతమాతకోసంగాని, తోటివాళ్ళకోసంగాని వాడిహృదయం ఎప్పుడూ ఆరాటపడలేదు. ఆపిల్లకోసం వాడిఎడద తడబడుతోంది.

కొలదిక్షణాలయాక, హార్మోనియం పెదవులకు అన్చాడు. కాని దీర్ఘనిశ్వాసం మటుకే వెలువడింది. పాట ధ్వనించలేదు. వాడిపెదవులు కంపించినయ్. కళ్లు చెమ్మగిలినయ్. రైలువెళ్ళినవైపే చూశాడు. గుడ్లనిండా నీరుచిమ్మింది. కమ్మినమబ్బుల్లో మెఱుపుమెరసి దూసుకొపోయింది.



# అంతరం



కామాక్షమ్మగారంటే. అప్పుడు అమలాపురంలో డిప్టీకలెక్టరుగా ఉంటూన్న సోమరాజుపంతులు భార్య. పేరుకి డిప్టీకలెక్టరు ఆయనగాని, అహోదా చెలాయించేది కామాక్షమ్మగారే. ఆవిడ పవరు చెలాయించడం అనేది ఆయన మేస్త్రీటు ఐననాడే ఆరంభమైంది. మొదట గుమాస్తాగా చేరి, తర్వాత మేస్త్రీటై, ఆపిమ్మట తాసిల్దారీ చేసి, ఇప్పుడు డిప్యూటీకలెక్టరయ్యా డాయన. ఆయనకిలా ప్రమోషనుమీద ప్రమోషను రావటాని క్కారణం స్వతహాగా తెలివైనవాడవటం. లంచాల క్కక్కుర్తిపడకుండా సూటిగా పని చేసుకుంటూపోవటం అని ఆతని స్నేహితులు అభిప్రాయపడేవారు. కామాక్షమ్మగారి అభిప్రాయంమాత్రం అవేవీ కాదని. అతడు తన పెళ్ళినాటికొక గుమాస్తా మాత్రమే! తను కాపరానికొచ్చినప్పట్నుంచే కదా ఆయనకి మంచిదశ ప్రవేశించింది? దీనికంతకీ తన జాతకం కారణం! ఈ ప్రయోజకత్వమంతా తనదే!

కామాక్షమ్మగారిలా అనుకోగలిగింది కనుకనే ఆవిడ భర్తమీదకూడా ఒకవిధమైన పవరు చెలాయించ గలిగేది. ఒక ఉన్నయింటిపిల్ల ఇల్లరికమున్న మొగుణ్ణి చూసినట్లు చూసే దావిడ సోమరాజుని. 'ఊరంతకీ డిప్టీకలెక్టర్ని కాని, ఇంటావిడకు డిప్టీకలెక్టర్నా?' అన్నట్లాయన ఆవిణ్ణి ఎప్పుడూ ప్రతిఘటించేవాడుకాడు. అలా చేయకపోవటమే తెలివైనపని అనుకోండి. ఏమంటే, ప్రతిఘటించి రభస తెచ్చుకోటంతప్ప ప్రయోజనం ఉండదని ఆయనకి బాగాతెలుసు.

ఆయన భార్యతో చటుక్కుని ఏకీభవించని దల్లా ఒక్కమాటే - ఆవిడ శ్యామల పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడు. 'పిల్లకి పద్దానుగో యేడు వచ్చింది. తగిన సంబంధంచూసి ఈ యేడు పెళ్ళి చేసెయ్యాలి.' అందావిడ. 'వేరేచూడ్డం యేమిటి? కాశీపతి కొడుక్కిచ్చి చేస్తానని యెప్పుడో అన్నానుగా.' అన్నాడాయన. ఆమాట ఆయన నోటమ్మట వచ్చేసరికి పాముకల వచ్చి ఉలిక్కిపడి లేచినట్లయింది కామాక్షమ్మకి. 'ఏమిటీ? ఏమన్నారు? ఇంకా ఆ మేస్త్రీటుతోనే వియ్యమందాలనిఉందా మీకు? వాళ్ళంతరంఎక్కడ? మనంతరం ఎక్కడండీ? డిప్టీకలెక్టరు చేస్తూ కూడా మీకీ చచ్చు ఆలోచన పోలే దేమిటి?' అంటూ ఒక తట్టు వరపపెట్టింది. ఆయన పెట్టనిచ్చి మెల్లిగా ఇలా అన్నాడు. 'చూడూ, నేను డిప్టీకలెక్టరీ చేసి వెలిగించిందీలేదు; కాశీపతి మేస్త్రీటుగా ఉండిపోయి చెడిపోయిందీలేదు. వాళ్ళు వచ్చిందాంట్లోనే మిగిల్చి, మరోపుట్టెడు భూమిదాకానైనా కొనుక్కో గలిగేరు కాని నువ్వు నా జీతంలో ఒక్క

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

కానీఐనా మిగల్చలేకపోతున్నావు. ఇంక వాళ్ల శేషగిరిమాట. వాడు యే చేటా ఫస్టుగా పరీక్షలు ప్యాసై పైకొస్తున్నాడు. మన శ్యామలకి పద్దానుగూ, వాడికి పద్దెనిమిదీని. ఈడూ, జోడూను. మరి మూడేళ్ళల్లో అనర్సు ప్యాసవుతాడు. ఎవరుపడితే వాళ్ళు కళ్ళ నద్దుకుని బోలెడు కట్నంఇచ్చి పిల్లనిస్తారు వాడికి. నువ్వు యేముటో అనుకుంటున్నావు కాని. మనకి శ్యామల ఒక్కర్తే కాదుగదా, మంది మీదమజ్జిగ పల్చ నన్నట్లు, ఆడపిల్లలందరికీ మనం పెద్ద పెద్ద కట్నాలిచ్చి చెయ్యగలమా? ఈ సంబంధం అన్నావ్? పేచీ పూచీలేని వ్యవహారం. కాశీపతీ, సత్యవతీకూడా మనం యేమిచ్చినా సంబరపడతారు. ఆలోచించుకో.'

ఈ మాటలు కామాక్షమ్మగారికి ఎంత మాత్రం రుచించలేదు. కాశీపతి తన మొగుడితోబాటు కలెక్టరాఫీసులో గుమాస్తాగా ప్రవేశించినా, ప్రమోషననేదిలేక మొన్న మొన్నటిదాకా అలాగే ఉండిపోయాడు! అంతా యీమధ్యనేకదూ అతనికీ మేస్త్రీటవుత? ముందు ముందు తాసిల్దారీ ఐనా అవుతుందో కాదో! ఒకవేళ ఐనా ఈలోపుగా తన మొగుడికి జిల్లా కలెక్టరీ తప్పకుండా ఔతుంది! తన జాతకం అలాంటిది! తన భర్త జిల్లా కలెక్టరు కాబోతో తా నా సత్తెమ్మతో వియ్యమందడమా! ఛస్! ఇలాంటి దౌర్భాగ్యపు ఆలోచన తట్టిందేమిటి తన మొగుడికి? శ్యామల పుట్టినప్పుడు, 'పీకు కోడలు పుట్టిందిరా' అని ఆయన కాశీపతితో అన్నమాట నిజమే కావచ్చు. ఐతేం? అప్పటి పరిస్థితులు వేరు; ఇప్పటి పరిస్థితులు వేరు! ఆలోగా పిచ్చెనమెట్లు ఎన్ని ఎక్కివచ్చింది తను! సత్యవతో? అడుగునే అణగారిపోయింది! తనంతరం ఎక్కడ, ఆవిడంతరం ఎక్కడ, ....ఆయనకి తోచినందుకు చెప్పాలి!

కామాక్షమ్మ భర్త కోరినప్రకారం ఆలోచించకపోలేదు. ఎంత ఆలోచించినా, తనకీ సత్యవతికీ ఉన్న ఆ 'అంతరమే' గోచరించింది. మూడురోజులయాక భర్తతో చెప్పేసింది. 'మంచి మనిషికొక మాటా, మంచి ఎద్దుకొక బోటూను. చెప్తున్నా వినండి. ఆ సత్తెమ్మ సంబంధం నాకు హితవుగాదు. వియ్యానికైనా, కయ్యానికైనా సమాన ఫాయీ ఉండాలి. మనహోదాకితగ్గ మరో సంబంధం చూడండి.'

సోమరాజుగారు విని, 'ఆ హోదాయేదో సరిగ్గా తూచి, ఆ సంబంధమేదో నువ్వే చూడు.' అని చెప్పి, అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయారు.

'నేనుచూడకపోతే మీరు చూస్తారనుకున్నానా?' అన్నటుగా ఒక నవ్వు నవ్వి, ఆవిడే వరాన్వేషణ ప్రారంభించింది.

పెద్ద అన్వేషణ కేముంది? భర్త ఆఫీసులో హెడ్డు గుమాస్తాగా వుంటూన్న శేషాచలం గార్ని రప్పించి, అంతకుపూర్వం అక్కడ ఎవరెవరు డిప్టీకలెక్టరీచేసి వెళ్ళారో, వాళ్లలో ఎవరెవరికి పెళ్ళియీడుకుమారు లున్నారో, యావత్తు సంగతులూ అడిగి తెలుసుకుంది. శేషాచలం చిత్రగుప్తుడులాంటివాడు. గోత్రాల దగ్గిర్నుంచీ చెప్పుకొచ్చాడతను. చంద్రశేఖరయ్యగారి కుమారుడు పద్దెనిమిదేళ్ళవాడు ఉన్నాడనీ, ఈపాటికేదో పెద్ద చదువులోనే వుండి వుంటాడనీ, చంద్రశేఖరయ్యగారు సోమరాజు పంతులుగారికిమల్లే మడిగట్టు

తూకాచోకుండా మడీ, మాన్యం సంపాదించాడనీ, ఆ ఆరిందా గుమాస్తా ఆవిడకు తెలియజేశాడు.

'నువ్వు మాకు పరాయివాడవు గనకనా? పెళ్ళి సంగతి సందర్భాలేవో కనుక్కురా. మనకి సందర్భపడుతుందని తోస్తే, వచ్చి తాంబూలాలు పుచ్చుకోమని రాద్దాం' అంది కామాక్షమ్మ.

'అలాగేనమ్మా. మీ శ్యామల పెళ్ళి ఒకటీ, మా కామి పెళ్ళి ఒకటీనా? స్వవిషయంకింద శిరసావహించి, కార్యం చక్కచేసుకొస్తాన'ని చెప్పి, శేషాచలం మర్నాడే, చంద్రశేఖరయ్యగారు రిటైరై స్థిరపడివున్న నిడదవోలుకి ప్రయాణమై వెళ్లేడు. వెళ్ళినట్టూ, వచ్చినట్టేలేదు. అంత త్వరగా వచ్చి. 'పెళ్ళి సంబంధం నిశ్చయమైనట్టే. శ్యామల్ని చూసుకోటానికి రమ్మనికూడా మీతరఫున చెప్పి చక్కావచ్చాను' అన్నాడు. 'మంచిపని చేశావు!' అని కామాక్షమ్మ మెచ్చుకుంది.

చంద్రశేఖరయ్య, పెళ్లికొడుకుతోబాటు, భార్యనికూడా వెంటతీసుకొచ్చాడు. ఆయన రిటైరైనా, ఇంకా చిరిగిపోకుండావున్న ఆ లాంగుకోటూ, ఆ జరీపాగా ధరించే వచ్చాడు. ఆ జేబు గడియారం బంగారపు గొలుసు బయట వేల్లాడుతో కనపడేసరికి కామాక్షమ్మకెంతో తృప్తిగావుంది. సుందరమ్మగారు కామాక్షమ్మకంటె వయసుమళ్ళినదే ఐనా, కోయంబత్తూరు చీర సరికొత్తది కట్టుకొచ్చింది. వియ్యమందితే ఆవిడతోనే అందాలనిపించింది కామాక్షమ్మకి. 'సుందరమ్మ!' ఆ పేరేచేస్తుంది చాలెడు వరహాలు! సత్తెమ్మా, సుబ్బమ్మా, ఏంపేర్లివి! ఎబ్బె!.... చెప్పొచ్చే మాటేమిటంటే, కామాక్షమ్మకి నచ్చిందా సంబంధం. వారు కోరినంతా ఇవ్వటానికి వప్పుకుని సోమరాజుచేత తాంబూలాలు ఇప్పించేసింది.

పెళ్ళిలో, పెళ్ళికొడుకు సాంబశివరావు కన్న ఒక చాయ ఎరుపూ, ఒక అంగుళం పొడుగూ, పొడుక్కితగ్గ పుష్టీవున్న పద్దెనిమిదేళ్ళ పిల్లవాడొకడు తానుతెచ్చిన పెళ్ళి బహుమానాన్ని శ్యామల కందిస్తోండగా కామాక్షమ్మచూసింది. 'ఎవరీ అబ్బాయి? ఎక్కడో చూసినట్టుగానేవుంది' అనిపించిం దావిడకి.

'మరిచిపోయావా అత్తయ్యా? నేను శేషగిర్ని. కాశీపతిగారి అబ్బాయిని. మా అమ్మకి వంట్లో బాగుండలేదు. అంచేత పెళ్లికి రాలేకపోయింది. ఏమీ అనుకోవద్దంది,' అన్నాడతడు.

'నువ్వటోయ్, ఎవరో అనుకున్నాను. ఈ నాలుగేళ్ళల్లో అనమాలుకట్టలేకుండా ఎదిగిపోయావు మరి!' అంది కామాక్షమ్మ. 'ఎదిగేడు గోవగా చక్కగా ఎదిగేడు!' అనుకుందిచూస్తో. అప్పుడెవరో ఆవిడతో 'ఆయన చిలక్కచెప్పినట్టు చెబితే పనికొచ్చిందికాదు నీకు! నువ్వుతెచ్చిన పెళ్లికొడుకు ఈ కుర్రాడికన్న ఏం ఎక్కువని?' అని దెప్పుతో నిలేసి అడిగినట్లయింది.

సాంబం, శేషగిరీ వాల్తేరులో ఒకేక్లాసులో చదువుతూన్నా వాళ్ళకి పరిచయంతప్ప పెద్ద స్నేహమేమీలేదు. పెళ్లిలోనే స్నేహమౌత, సాంబం అత్తవారింటికొచ్చి వెళ్ళినప్పుడల్లా శేషగిరిమాట చెపుతోండేవాడు. 'శేషగిర్రావు

తెలివైనవాళ్ళలో లెక్క, ఫస్టుక్లాసు వస్తుం దనుకుంటున్నారు' అన్నాడొకమాటు. తనే అలా చెప్పటంవల్ల అత్తగారిమనసు నొప్పిం చటం అని అతని కేంతెలుసు ?

సాంబం, శేషగిరీకూడా ఆనర్సు ప్యాస య్యారు. శేషగిరికి ఒకమార్కులో ఫస్టుక్లాసు పోయింది. సాంబం థర్డుక్లాసుతో ప్యాస య్యాడు. మామగారికి రాసిన ఉత్తరంలో, శేషగిరికి ఒక్కమార్కుతేడాలో, మొదటి క్లాసు పోయిందన్న సానుభూతిని కనపరి చాడు. 'ఇతడు తనకి సెకండుక్లాసైనా రాలే దన్న విచారానికిబదులు, ఎవడికో ఫస్టుక్లాసు రాలేదని వ్యధపడతాడేమిటి ?' అనిపించింది కామాక్షమ్మకి. 'ఇతను క్లాసు వస్తుందని అనుకోలేదుగా రాకపోతే విచారించటానికి ?' అన్నాడు సోమరాజు. 'ఇతనికి సెకండుక్లాసు వచ్చేదే, ఏదో ఒకమార్కు తక్కువై యుంటుంది,' అందావిడ.


శేషగిరి బి. ఎల్. చదవటానికి మద్రాసు వెళ్ళేడు. కాశీపతి, కొడుక్కి పెళ్లి చేసి, నౌక రీలో ప్రవేశపెట్టించా లనుకున్నాడుగాని, 'తొందరపడవద్ద'న్నాడు శేషగిరి. సోమరాజు సాంబంతో, 'లా' క్వాలిఫికేషనుంటే అన్ని విధాలా ఉపయోగిస్తుంది. చదవ్వోయి" అని సలహా ఇచ్చాడుకాని, అతగాడు తనకి 'లా'లో 'ఇంటరెస్టు' లేదనేశాడు. కామా క్షమ్మకూడా వద్దనేసింది. "ఎందుకండీ ప్లీడరీ ? ఈ పట్టా పుచ్చుకున్న వాళ్ళంతా వాదించేటప్పుడు మీముందు నిలబడవలసిందే కదూ ?....'చదువు, చదు[illegible]టూ కాలయాపన చెయ్యక, సాంబాన్ని చక్కా నౌకరీలో ప్రవేశపెట్టించండి. అదృష్టం బాగుంటే ప్రమోషన్లొచ్చి, మీకుమల్లేనే అతనూ డిప్టీ కలెక్టరీ చేస్తాడు" అంది. చంద్రశేఖరయ్య గారుకూడా కుమారుణ్ణి రెవెన్యూ ఇలాకాలోనే ప్రవేశపెట్టడానికి నిశ్చయించారు. సోమరాజు గారే కలెక్టరుతోచెప్పి సాంబానికి గుమాస్తా ఉద్యోగం వేయించారు.

ఆనర్సులో జారిపోయిన ఫస్టుక్లాసును, శేషగిరి బి. ఎల్. లో పోనివ్వలేదు. వచ్చి బల్లకట్టి ప్రాక్టీసు మొదలెట్టేడు. 'కేసులేమీ రావటంలేదుట పాపం' అన్నాడు సాంబం. 'పరీక్షలు ప్యాసైతే సరిపోదు. వాగ్ధాటి వుండాలి. రేఖవుండాలి!' అంది కామాక్షమ్మ.

మునసబీకి దరఖాస్తుపెట్టమని ముసలి ప్లీడ రొకాయన సలహాయిస్తే, శేషగిరి, 'పోనీ ఓ బెడ్డ విసిరిచూద్దాం' అనిపించి అప్లికేషను పంపేడు. బ్రాహ్మల్లోకల్లా ఇతనికొక్కడికే సెలక్షనయింది. సోమరాజుగారికి కోనసీమ నుంచి చాలా ఊళ్ళకి ట్రాన్స్ఫరై ఆఖర్ని శ్రీకాకుళానికి బదలీ అయింది. ఆయన ఆఊరువెళ్లి స్థాయిపడుతోన్న రెండోరోజునే, మల్లుపంచా, మల్లుచొక్కా, ఖండువా వేసు కున్న ముప్ఫైయేళ్ళ యువకుడొకడు, పాతి కేళ్ళ భార్యని ఐదేళ్ళ కొడుకుని వెంటబెట్టు కుని ప్రవేశించి, 'నమస్కారం పంతులు గారూ' అన్నాడు.

'ఎవరూ, శేషగిర్రావా ?' అన్నాడు సోమ రాజుగారు.

'ఔనండీ, ఇక్కడ డిస్ట్రిక్టు మునసబుగా వుంటున్నాను' అన్నాడు శేషగిరి. సోమరాజు గారు సంతోషంతో కావలించుకుని శేషగిర్ని



లోపలకి తీసుకెళ్లేరు. 'ఔనే. చూడూ, శేషగిరి, భార్యనీ పిల్లవాణ్ణీ తీసుకుని మనల్ని చూడటానికొచ్చాడే. ఇక్కడ జిల్లా మునసబుగా ఉంటున్నాట్ట' అని కామాక్షమ్మతో అన్నాడు. శేషగిరి కొడుకుని పలకరిస్తో, 'అచ్చు మీ నాన్న ఫొటోయేరా నువ్వు!'.... శేషగిరీ, నువ్వు ఈ యీడులో ఇలాగే ఉండేవాడివి!' అన్నాడు.

కామాక్షమ్మ కిదంతా వెగటుగా తోచింది. 'మగపిల్లవాడు తల్లిపోలికైతే అదృష్టంగాని తండ్రినిపోలితే యేముంది? ఎందుకూ ఈ ముసిలాయన ఇంత పొంగిపోతాడు?' అనుకుందావిడ. ఐతేం, ఆ హాలాహలం అంతా ఒక్కమాటు దిగమింగి, శకుంతల్ని కూచోమని ఆప్యాయం కనపరుస్తో, 'మా సత్యవతి కోడలువా అమ్మా! నీ మొగుడికి జిల్లా మునసబీ, అయిందా? సంతోషం! ఇదంతా నీ అదృష్టమే అనుకో. పెట్టిపుట్టేవు' అంది.

వచ్చినవాళ్లు కాసేపు కబుర్లుచెప్పి, 'వచ్చే ఆదివారం మాయింటికి మీరంతా విందుకు రావాలి' అని సోమరాజుని, కామాక్షమ్మనీ పిల్లల్నీ ఆహ్వానించి వెళ్ళిపోయారు. వెళ్ళనిచ్చి, కామాక్షమ్మ, 'ఏమండీ, మీరు సొంతంవిషయంలో బొత్తిగా శ్రద్ధతీసుకోటం లేదు. ఎన్నాళ్ళుండీ ఆ గుమాస్తాగిరీ, ఈపాటికి మేస్త్రీ నైనా అవొద్దూ?' అంది.

'నాచేతిలో ఏముందే? కాలం మారిపోతోంది. మనమాట వినేవాడెవడూ లేడు. అతడే ఆఫీసర్ల మెప్పుసంపాదించి ప్రమోషను తెచ్చుకోవాలి' అన్నాడు.

కామాక్షమ్మ ప్రార్థన దేవుడికి వినిపించినట్టుంది. ఏమంటే మరో యేడాదికి, సాంబానికి మేస్త్రీటుపని అయింది. సాంబందగ్గిర్నుంచి ఆ ఉత్తరం వచ్చినరోజున ఆవిడకి చాలా సంతోషంగా వుంది. 'ప్రమోషను ఓమాటువస్తే ఇంక వరసాక్కా అలావస్తూనే ఉంటుంది' అనుకుందావిడ. ఐతేం ఆసాయంకాలమే ఆవిడ సంతోషమంతా చప్పబడి ఊరుకుంది. ఏమంటే, శేషగిరి, శకుంతలతో వచ్చి, నన్ను సబుజడ్జీగా వేశారు. అనంతపురానికి.' అనిచెప్పి, 'ఎల్లుండి వెడుతున్నాం' అన్నాడు.

'ఎల్లుండిదాకా ఎందుకు, తక్షణమే పోరాదూ? పనిగట్టుకొచ్చి మాతోచెప్పాలా ఏమిటి!' అనుకుంది కామాక్షమ్మ. ఆవిడ ఏమనుకుంటూన్నదీ వాళ్ళు గమనించలేదు. అట్టేసేపు ఉండకుండానే, 'పిల్లల్ని వదిలి వచ్చా' మంటూ వెళ్ళిపోయారు. ఆ వెళ్ళేటప్పుడు శకుంతల మామూలుగానే అడుగులు వేసింది. కాని కామాక్షమ్మకి ఆ నడకలో సబుజడ్జీ భార్యకుండే ప్రత్యేకపు ఠీవియేదో గోచరించింది. ఆవిడకి దూరాన్ని కాకినాడలో ఉన్న శ్యామల జ్ఞాపకంవచ్చి, శ్యామలకి రావలసిన పదవి శకుంతలకొచ్చేసిం దనిపించింది. శ్యామలకి ఆ స్థానం పోగొడత తనేగా! మొగుడు చిలక్కి చెప్పినట్లు చెపితే విందిగాదు తను! కాని ఆయన తన ఇష్టంవచ్చినట్లు జరగనివ్వటం యేమిటి? మొగాడు అడదానికి పెత్తనం వదిలేస్తాడా ఇలాంటివాటిల్లో! మరొహాటీ మరొహాటీనా. కూతురు పెళ్ళి విషయమాయిరి! ఛీ, ఆయన ఎప్పుడూ ఇలాగే మించబెట్టేశారు!

ఏళ్లు గడిచాయి. 1947 వచ్చింది. అగస్టు 15 వ తేదీతో తెల్లఉద్యోగులు దేశంలోంచి వెళ్ళి పెద్ద ఉద్యోగాలన్నీ మనవాళ్ళకి అందుబాటులోకొచ్చాయి. దానితో కామాక్షమ్మగారి చిరకాలవాంఛ ఈడేరి, సోమరాజుగారికి జిల్లా కలెక్టరీ అయింది. అప్పుడు అయినా కాకపోయినాఒకటే ఆయనకి. ఏమంటే మరొక్క సంవత్సరంలో రిటైరు కాబోతున్నాడాయన. ఐతేం, కామాక్షమ్మకి మటుక్కి కలెక్టరు సతీమణి అనిపించుకో కలిగినందుకు ఆనందంగానేవుంది. ఆవిడ జాతకం మంచిది! కనుకనే 1947 ఆయన రిటైరుకాకుండానే వచ్చి, ఆయనకి కలెక్టరుపదవి యిప్పించింది. డిప్టీకలెక్టర్లు కలెక్టర్లు కావటమే కాకుండా చాలామంది మేస్త్రీట్లు తాసిల్దార్లయారు. ఆవిడ జాతకం భర్తకే కాకుండా అల్లుడికి కూడా సాయంచేసినట్టుంది! సాంబశివరావు తాసిల్దారయాడు.

ఆ యేడు వేసంగిలో కామాక్షమ్మగారు భర్తతో, 'ఏమండీ, మనలాంటి పెద్ద ఉద్యోగస్థులంతా ఉతకమండలం వెడతారుకదా. మనం ఒకమాటు అక్కడికివెళ్ళి అదేమిటో చూసిరావాలండీ' అంది.

ఆయన, 'వెళ్ళవచ్చుగాని, వేసంగుల్లో సెలవులున్నవాళ్ళకే అదివీలు. మనం వెళ్లాలంటే సెలవుపెట్టాలి' అన్నాడు. 'పెట్టండీపోనీ' అందావిడ. ఆయన ఆవిడమాటకు ఎప్పుడైనా అడ్డుచెప్పేడు గనకనా! 'సరే'

వన్నాడు. పిలవు పెట్టి ఉతకమండలానికి ప్రయాణం కట్టేరు. అల్లుడికికూడా ఉత్తరం రాయించి, కుటుంబంతో రప్పించింది. సోమ రాజుగారు ఎరుగున్న స్నేహితు డొకాయనకు ఉతకమండలంలో ఒకఇల్లు అద్దెకు చూసి పెట్టవలసిందని జాబురాశాడు. ఆ స్నేహి తుడు సమాధానంలో, 'పెద్ద ఇళ్ళన్నీ భర్తీ ఐపోయాయి. ఒక బంగళాలో ఔట్‌హౌ సొకటిమాత్రం ఖాళీగాఉంది, అది కుదిర్చేను. అనిచెప్పి ఆ చిరునామా తెలుపుదుచేశాడు. సోమరాజుగారు ఇంటిల్లిపాదినీ వెంటబెట్టుకొని ఊటీచేరి, ఆ ఔటుహౌనులో ప్రవేశించాడు. 'ఇల్లు చిన్నదేమిటి? చాలు. అస్తమానూ ఇంటోకూచుంటాం గనకనా? వేడుకచూట్టాని కని అవతలకి పోతూనేవుంటాం' అని తృప్తి పడి కామాక్షమ్మగారు సామాను సర్దిస్తోంది.

బయట సోమరాజుగారూ, సాంబం ఎవరి తోనో మాట్లాడుతోన్న అలికిడి అయింది. అవతలాయన కంఠస్వరం ఆవిడికి ఎక్కడో విన్నట్లేతోచింది. 'ఎవరుచెప్మా' అనుకుంటూ ఆమె గుమ్మంలో కొచ్చేసరికి, 'ఏమత్తయ్యా, కులాసాగావున్నారా? ఎవరో పరాయివాళ్ళు దిగుతున్నారనుకున్నాను. మీరే అని తెలియ లేదు' అన్నాడు శేషగిరి.

సోమరాజు అందుకుని, 'ఈ బంగళాలో మొన్ననే ఇతనూ పిల్లలూ దిగేరట! తలవని తలంపుగా మనమంతా ఒకచోటే చేరటం ఎలాకుదిరిందోచూడు. అపేక్షలున్నచోట భగ వంతు డిలాగే కుదురుస్తోంటాడు' అన్నాడు.

సాంబం, 'శేషగిరీ, చాలా యేళ్ళయిం దోయ్ మనం కలుసుకుని!' అని అప్పుడైనా కలుసుకో కలిగినందుకు సంబరపడ్డాడు. శకుంతలా, పిల్లలూ ఆ సమయానికే అక్క డికిచేరేరు. సంగతితెలిసి, శకుంతల, 'మన బంగళాలో కావలసినంత ఖాళీఉంటే, వీరు సామాను ఇక్కడ సర్దుకోడమేమిటి?' అంది. 'నేనూ అదే అన్నాను పంతులుగారితో.... ఏం మామయ్యా, ఇంక మీరు అడ్డుపెట్ట టానికి వీల్లేదు. మీ అమ్మాయేవచ్చి పిలు స్తోంటే, అభ్యంతరం చెప్పటానికి వీలామరి?' అన్నాడు.

అంతవరకూ నోట మాటరాక నిలబడి పోయిన కామాక్షమ్మ చప్పుని, 'అబ్బే ఎందు కయ్యా, ఇక్కడేఉంటాం. ఇంతకీ ఒక ఆవరణ లోనేగా ఉన్నాం. అందరం అక్కడచేరితే మీకూ, మాకూ ఇబ్బందే' అంది. 'మాకేమీ ఇబ్బందిలేదు' అని శకుంతల చెప్పబోయింది గాని, కామాక్షమ్మవైఖరి అదో మోస్తరుగా కనపడి, ఇంతట్లో అక్కడికొచ్చిన శ్యామ లతో పరిచయం కలుగచేసుకుంది. సోమ రాజు, 'శేషగిరీ, ఇప్పుడెక్కడా, వుద్యోగం? మళ్ళీ ప్రమోషనేమైనా వచ్చిందా? నేనేమిటో పేపర్లు సరిగ్గా చూట్టంలేదు' అన్నాడు. 'కోయంబత్తూరులో జిల్లా జడ్జీగావేశారు' అన్నాడు శేషగిరి. 'జిల్లా జడ్జీ! జిల్లా జడ్జీ అంటే జిల్లా కలెక్టరీలాంటిదే!' అనిపించింది కామాక్షమ్మకి. ఆవిడ ఎవరూచూడకుండా లోపలికి వెళ్ళిపోయింది. 'జిల్లా జడ్జి!'

ఆ మర్నాడే కాశీపతీ, సత్యవతమ్మా వచ్చారు. సత్యవతి కామాక్షమ్మని కావిలించు కుని, 'ఎన్నాళ్ళకి కలుసుకున్నాం వదినా!' అని ఆనందబాష్పాలు రాల్చింది. కామా

క్షమ్మకి నోరు పెగల్లేదు. ఆనందంచేత్తే నోరు పెగల్లేదనుకున్నారు అంతా. సోమరాజు సంతోషానికి అంతేలేదు. 'ఏమిరా కాశీపతీ' అంటూ మెడమీద చెయ్యివేసి, తోటలో అటునుంచి ఇటూ, ఇటునుంచీ అటూ పచార్లు చేస్తో, ఏవేవో కబుర్లు విడేశాడు. సాంబం, శేషగిరీ క్లాసుమేట్లూ పాతస్నేహితులేకదా. శ్యామలకూ, శకుంతలకూ ప్రథమ పరిచయమే ఐనా పరమస్నేహమై ఊరుకుంది. శకుంతల పిల్లలూ, శ్యామల పిల్లలూ పుట్టకపూర్వంనుంచీ ఎరుగున్నవాళ్ళకిమల్లే మాటలూ, ఆటలూ ఆరంభించారు. పెద్దలూ, పిన్నలూ అంతావెళ్ళి ఆ బంగళాలోనే కూచునేవారు. ఒక్క కామాక్షమ్మే సామాను సద్దుకోవాలంటూ, ఆ ఔటుహౌసులోనే చెటు వుండిపోయేది. ఆసంగతి ఒక్క సత్యవతే గుర్తిస్త. ఎవళ్ళ యీడువాళ్ళు వాళ్ళతో బాతా కానీవేస్తోంటే తనతో కబుర్లుచెప్పేవాళ్లు లేరనిపించింది సత్యవతికి. అదిదే కామాక్షమ్మ దగ్గరకెళ్ళి చనువుగా, 'ఏమిటొదినా, ఇక్కడే ఉండిపోతా వెప్పుడూను! ఊటీకొచ్చినా సద్దుకోడం తప్పదంటావు? ఎన్నాళ్ళూ ఈ సద్దడం తెములుచుకురాక!' అంటూ ప్రారంభించింది. రెట్టెరై యేడాదైన మేస్త్రీటుగారి భార్యకు మల్లేనే మాట్లాడింది సత్యవతి. ఐతేం, కామాక్షమ్మ కా కంఠస్వరంలో ఏదో గర్వం కనపడి, 'జిల్లాజడ్జీ తల్లివాయిరి! ఆమాత్రం ఉండకపోతుందా ఏమిటిలే!' అనుకుంది కామాక్షమ్మ. 'రా, యీపాటికి బయటికి, ఇవాళ మీరంతా మాయింటే భోజనం' అని అంటూ సత్యవతి కామాక్షమ్మ జబ్బపట్టుకుని ఈడుచుకెళ్ళింది. 'ఈడ్చుకెళ్ళు! జిల్లా కలెక్టరు పెళ్ళాంనైయుండికూడా మేస్త్రీటుపెళ్లాం చేతిలో పిల్లిలా లొంగవలసొచ్చింది నాకు. జిల్లా జడ్జి తల్లివాయిరి మరి! ఈడ్చుకెళ్ళు' అనుకుంటూ కామాక్షమ్మ, తప్పనిసరిగా కూడా వెళ్ళింది. తోటలో శకుంతలపిల్లలూ, శ్యామలపిల్లలూ కలిసి ఆడుకుంటున్నారు. శకుంతల కొడుకొకడు శ్యామల కూతురు పక్కన నిలపడి పువ్వులుకోసి ఇస్తున్నాడు. ఆ చిన్న శేషగిరీ, ఆ చిన్న శ్యామలా ఈడూ జోడుగా కనపడ్డారు కామాక్షమ్మకి. 'పెళ్ళి చేస్తే చక్కటి ఉజ్జీ!' అనుకుం దావిడ. మరుక్షణంలోనే, 'ఏమిటీ ఈ పిచ్చిఊహ! జిల్లాజడ్జి భార్య కాసిల్దారు పెళ్ళాంతో వియ్యమందుతుందా?' అని నిట్టూర్చింది.

సోమరాజు సెలవూ, సాంబం సెలవూ పూర్తిగాకుండానే, 'వెళ్ళిపోదామండీ' అంది కామాక్షమ్మ. వాళ్ళు ఆశ్చర్యపోతూ, 'ఏం, ఎందుకూ తొందరపడుతున్నావు?' అన్నారు. 'వంట్లో బాగుండలేదు' అనేసిందావిడ. ఆ మర్నాడే బయల్దేరి వెళ్ళిపోయారు వాళ్లంతా. ఇంక వాళ్ళూ వీళ్ళూ, మళ్ళీకలవటం తటస్థించలేదు.



# గ్రంథస్వీకారము

ఈ దిగువ పుస్తకాలు, పత్రికలు మా కార్యస్థానమునకు చేరినవి—నం॥

★

**చిన్న కథలు :**

మహాకవి శ్రీ గురజాడ అప్పారావుగారు రచించినవి. పాకెట్ సైజు 196 పుటలు. ముచ్చటైన ముద్రణ. మూల్యం: ఒక రూపాయి. ప్రకాశకులు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్. 292 ఎస్ప్లనేడ్, మదరాసు.

**ఖండకావ్యములు :**

శ్రీ ఉమర్ అలీషా కవి రచన. డెమ్మీ అక్టేవొ 388 పేజీలు. 'ఎవరు తల్లి' అనే శీర్షికగల చక్కని ముఖచిత్రమున్నది. వెల: రు. 4-8-0 లు. ప్రతులకు శ్రీ యం. కబీర్‌షా, ఇన్కమ్‌టాక్స్ ఆఫీసరు, ఏ: (పశ్చిమగోదావరి జిల్లా).

**భిక్షుకి : (నవల)**

కర్త : శ్రీ 'పద్మావతి'. క్రౌన్ 28[illegible] పే[illegible] రెండురంగుల ముఖచిత్రం. వెల: రు. 2 లు.

**నిట్టూర్పు: (చిన్నకథ)**

కర్త: శ్రీ వోలాప్రగడ సత్యనారాయణ మూర్తి. క్రౌను 50 పేజీలు, వెల: 8 అణాలు

ఈరెండు పుస్తకములకు ప్రకాశకులు: ఆనందబోధిని కార్యాలయం, నెం 6 లాయర్ చిన్నతంబి మొదలివీధి, మద్రాసు.

**రేషనింగుకథలు: (వినోదకథల సంపుటి.)**

రచన : జ్యోతికుమారి. క్రౌను సైజున 100 పుటలు. వెల: రూపాయి. పబ్లిషర్స్: ఫన్‌లాండ్ ఏజన్సీస్. పోస్టుబాక్సు నెం. 16. కర్నూలు.

**కాపుబిడ్డ : (వ్యవసాయ పద్యకావ్యము)**

రచన : శ్రీ గంగుల శాయిరెడ్డి. క్రౌను 72 పేజీలు. మూల్యం: 1[illegible] అణాలు. ప్రకాశకులు: రాష్ట్ర కళాపీఠము, సికింద్రాబాదు.

**రవీంద్రుని [illegible]**

తెనుగుసేత: శ్రీ బెజవాడ [illegible] క్రౌన్ సైజు 108 పేజీలు. వెల: రు. 1-8-0 లు. ప్రాప్తిస్థానం: త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నం.

## పత్రికలు

**సంతోషి :**

కార్టూన్ మాసపత్రిక. సంపాదకులు : శ్రీ ఎ. వి. కృష్ణమూర్తి. సాలు చందా రు. 6-0-0. విడిసంచిక : 8 అణాలు. కార్యాలయం: 26, గోవిందప్పనాయక్ వీధి, మద్రాసు—1.

**నటన : (విసలైన సినిమా పత్రిక)**

సంపాదకుడు : శ్రీ రామాచారి. సాలు చందా రు. 3 లు. విడిసంచిక 4 అణాలు. కార్యస్థానం: 66, పీటర్సు రోడ్డు, మద్రాసు-6.

నాలుగు భాషలలో
చందమామ

(తెలుగు) చందమామ

విడిసంచిక సాలుచందా : 4-8-0

0-6-0 రెండేండ్లకు : 8-0-0

(కన్నడ) చందమామ

విడిసంచిక [illegible] : 4-8-0

[illegible] రెండేండ్లకు : 8-0-0

[illegible] మామ

[illegible] : 4-8-0

[illegible]-0 రెండేండ్లకు : 8-0-0

(అరవ) అంబులిమామ

విడిసంచిక సాలుచందా : 4-8-0

0-6-0 రెండేండ్లకు : 8-0-0

చందమామ పబ్లికేషన్స్

పోస్టు బాక్స్ 1686 :: మద్రాసు 1



Edited, Printed and Published by B. Nagi Reddy at B. N. K. Press,
37, Acharappan Street, Madras [illegible] Founder : B. [illegible]